


ఈ సంచికతోపాటు 12 పేజీల **సక్సెస్** సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత
వెలుగు
02.02.2019
www.v6velugu.com
శనివారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 347 పేజీలు: 12+12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

"ఇది ట్రైలర్ మాత్రమే. ఎన్నికల తర్వాత దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్ తోడ్పడుతుంది. ఇందులో అన్నివర్గాలకు ప్రాధాన్యం ఇచ్చాం. ప్రధాన మంత్రి కిసాన్ నిధి చరిత్రాత్మకం.

– ప్రధాని నరేంద్రమోడీ



ఎన్నికల ముంగట బడ్జెట్ ఎట్లుండాల్నో మోడీ సర్కార్ బడ్జెట్ గట్లనె ఉంది. బడ్జెట్ అసల్ టార్గెట్ బ్యాలెటే. మన దేశం షకల్ మార్చేటందుకే అన్నట్టు పీయూష్ గోయెల్ పిక్చరిచ్చినా, పల్చవడుతున్న పతారాను నిలవెట్టుకునేందుకు సర్కారు తన్లాడుతున్న సంగతి ఉత్తగనె ఎర్కయితంది. మిడిల్‌క్లాస్‌ను, చిన్న రైతుల్ని, సర్కారు లెక్కలల్ల లేకుండా చిన్నచిన్న పనులు జేస్కొని బతికెటోళ్లను... ఈ మూడు పెద్ద గ్రూప్‌లను సుదరాయించే ఉపాయాలు బడ్జెట్ల చేసిన్రు. 5 లక్షల కన్న కమ్మి ఆమ్దానీ ఉన్నోళ్లకు టాక్సుల రిబేట్ ఇచ్చిన్రు. చిన్న సన్న రైతులకు యాడాదికి 6 వేల రూపాయలు డైరెక్ట్‌గా బ్యాంకుల ఎయ్యాలని ప్రపోజ్ చేసిన్రు. అనార్గనైజ్‌డ్ వర్కర్లకు పెన్షన్ స్కీమ్ తెచ్చింన్రు. పవర్‌లోకి వచ్చిన అయిదేళ్ల సంది అచ్ఛేదిన్ అని ఆశవెట్టుకుంట నడిపించిన మోడీ సర్కారుకు ఆఖర్ల సెగ తగులుతున్నట్టే ఉంది. అన్ని గ్రూప్‌లను టచ్ చేసేందుకు బడ్జెట్ ప్రయత్నమైతే చేసింది. రైల్వే బడ్జెట్‌ను కూడా కలిపి లెక్కలు ముందుటవెట్టిన్రు.



బడ్జెట్ స్వరూపం (రూ.కోట్లలో)

రెవెన్యూ వసూళ్లు	19,77,693
మూలధన వసూళ్లు	8,06,507
మొత్తం బడ్జెట్	27,84,200

బ్యాలెట్ బడ్జెట్

ఎన్నికలపై గురిపెట్టిన పీయూష్ పద్దు

"ఐదేళ్ల మోదీ అసమర్థ పాలనలో రైతుల జీవితాలు నాశనమయ్యాయి. ఇప్పుడు రైతులకు రోజుకు 17 రూపాయలు ఇస్తామని చెప్పడం వారి శ్రమను అవమానించడమే.

– ఏఐసీసీ చీఫ్ రాహుల్‌గాంధీ



రైతులు, వర్కర్లు, మధ్య తరగతే టార్గెట్ | 'రైతుబంధు' మోడల్‌లో 'పీఎంకిసాన్' స్కీం | ఐదెకరాల్లోపు రైతులకు ఏటా రూ.6 వేల నగదు బదిలీ | రూ.5 లక్షల లోపు ఆదాయంపై నో టాక్స్ | అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్

2019–20 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను ప్రతిపాదనలు (రూపాయల్లో)

	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన
వేతనం	5,00,000	5,00,000	7,50,000	7,50,000	20,00,000	20,00,000
స్టాండర్డ్ డిడక్షన్	40,000	50,000	40,000	50,000	40,000	50,000
నికర ఆదాయం	4,60,000	4,50,000	7,10,000	7,00,000	19,60,000	19,50,000
పన్ను	10,500	10,000	54,500	52,500	3,00,500	2,97,500
నికర పన్ను	10,500	-	54,500	52,500	3,00,500	2,97,500
సర్‌ఛార్జ్						
ఎడ్యుకేషనల్ సెస్	420	-	2,180	2,100	12,020	11,900
మొత్తం పన్ను	10,920	-	56,680	54,600	3,12,520	3,09,400
పన్ను ఆదా	-	10,920	-	2,080	-	3,120

అన్ని మినహాయింపుల తర్వాత ఐదు లక్షల వార్షికాదాయం వరకూ పూర్తిగా ట్యాక్స్ రిబేట్.

కొన్ని రకాల పెట్టుబడులు పెట్టిన వారికి రూ.6.5 లక్షల వరకూ పూర్తి పన్ను మినహాయింపు.

స్టాండర్డ్ డిడక్షన్40 వేల నుంచి 50 వేలకు పెంపు. 3 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులకు లబ్ధి.

వచ్చే ఐదేళ్లలో లక్ష డిజిటల్ విలేజ్‌ల ఏర్పాటు

నేషనల్ సెంటర్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు

ప్రధానమంత్రి కిసాన్ యోజనకు ఆమోదం. 2 హెక్టార్ల (ఐదు ఎకరాలలోపు) వరకూ భూమి ఉన్న ప్రతి రైతుకూ ఏడాదికి రూ.6,000 సాయం.

01–12–2018 నుంచి అమలు. మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ.

31–03–2019లోపు తొలి విడత చెల్లింపు. 12 కోట్ల మంది చిన్న, మధ్యతరహా రైతు కుటుంబాలకు లబ్ధి. ఇందుకు బడ్జెట్‌లో రూ.75 వేల కోట్లు కేటాయింపు.

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఎంఎస్ఎంఈలకు రూ.కోటి వరకూ రుణంపై 2 శాతం వడ్డీ రాయితీ

ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ కింద అనార్గనైజ్డ్ సెక్టార్‌లోని 10 కోట్ల మంది కార్మికులు నెలకు రూ.100/55 చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.3,000 పెన్షన్. ఇందుకోసం రూ.500 కోట్లు కేటాయింపు.

1.5 కోట్ల మంది మత్స్యకారుల సంక్షేమం కోసం ఫిషరీస్‌కు ప్రత్యేక మంత్రిత్వ శాఖ. పశుసంరక్షణ చేసే రైతులకు రుణాల మీద వడ్డీపై 2 శాతం రాయితీ. సకాలంలో రుణాలు చెల్లిస్తే అదనంగా 3 శాతం వడ్డీ రాయితీ.

ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ. సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు అదనంగా మరో 3 శాతం వడ్డీ రాయితీ.

..జో మజా ఆయా! పీయూష్ ప్రసంగం 2లో
మరిన్ని కథనాలు 2, 3, 4, 5, 6, 7, 8 పేజీల్లో



శుక్రవారం వరంగల్ సీకేఎం గ్రౌండ్స్‌లో V6 వెలుగు టీ20 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన తర్వాత బ్యాటింగ్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి

11

రాష్ట్రంలో కూత పెట్టలే

- రైల్వే బడ్జెట్‌లో కొత్త ప్రతిపాదనలు లేవు
- దక్షిణ మధ్య రైల్వేకు రూ. 5,924 కోట్ల కేటాయింపు
- గతేడాదితో పోలిస్తే పెంపు స్వల్పమే
- కాజీపేట ప్రాజెక్టులకు నిరాశ
- అభివృద్ధిలో ఉన్న పనులకే కేటాయింపులు
- కొత్త లైన్లకు రూ. 834 కోట్లు
- డబ్లింగ్ పనులకు రూ. 1,905 కోట్లు
- మౌలిక వసతులకు రూ. 229 కోట్లు

07



సన్నరైతు ఖుష్

- గుంట భూమి ఉన్నా కేంద్ర పథకం కింద ఏడాదికి రూ.6 వేలు
- రాష్ట్రంలో ఐదెకరాల లోపు ఉన్నోళ్లు 47 లక్షల మంది
- ఎకరంలోపు ఉన్నవారు 14.86 లక్షలు
- వారందరికీ కేంద్రం నుంచి రూ.2,824 కోట్ల లబ్ధి
- మొదటి విడతగా రూ.941.53 కోట్ల సాయం
- మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ

05

రైతుబంధుకు కాపీ

'పీఎం కిసాన్' పథకంపై కేటీఆర్ వ్యాఖ్య

- కొన్ని మార్పులతో పేరు మార్చి తెచ్చారు
- అయినా ఎన్డీయేకు ఓట్లు రాల్చదు
- ఇప్పుడే ఎందుకు తెచ్చారో ప్రజలకు తెలుసు
- రైతు బంధుతోనే ప్రయోజనం ఎక్కువ

12

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
80.00	78.00	80.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
79.00	78.00	81.00

రూ.6 వేలు విదిలించి..

అన్నదాతను అవమానించారు

'కిసాన్ సమ్మాన్ నిధి'పై రైతు సంఘాల మండిపాటు

- చీప్ రేటుకు ఓట్లు కొనే ప్రయత్నమన్న యోగేంద్ర యాదవ్
- డేటాబేస్ లేకుండా డబ్బులెలా డిపాజిట్ చేస్తారని ప్రశ్న
- కేసీఆర్ 'రైతుబంధు'ఎంతో నయం: రైతు స్వరాజ్య వేదిక

04

బడ్జెట్ మెలికలు


- రైతుకు సరిపోయే సాయమేనా?
- సాగు బడ్జెట్ తగ్గిందా? పెరిగిందా?
- రూపాయి తేడాతో రూ.35వేల పన్ను?


06

02
శనివారం | హైదరాబాద్
02.02.2019
www.v6velugu.com

ప్రభాత
వెలుగు
Follow:
v6velugu

బ్యాలెట్ బడ్జెట్ 2019-20





కేటాయింపులిలా..

రూ. కోట్లలో

సాగు, రైతు సంక్షేమం, అనుబంధ రంగాలు	₹1,40,763.97
అణు విద్యుత్	₹16,725.51
పెట్రోలియం, సహజ వాయువులు	₹42,901.49
రసాయనాలు, ఎరువులు	₹75,534.16
పౌర విమానయానం	₹4,500
గ్రామీణాభివృద్ధి	₹1,19,874.43
వాణిజ్యం, పరిశ్రమలు	₹11,893.83
సమాచారశాఖ	₹38,637.46
వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు	₹1,94,512.71
సాంస్కృతిక శాఖ	₹3,042.35
రక్షణ శాఖ	₹3,18,931
రోడ్డు రవాణా, హైవేలు	₹83,015.97
తాగునీరు, పారిశుద్ధ్యం	₹18,216.34
రైల్వే	₹66,768.67
ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	₹6,420
గిరిజన వ్యవహారాలు	₹6,526.96
విద్యుత్ రంగం	₹15,874.82
విదేశీ వ్యవహారాలు	₹16,061.78
ఆర్థిక శాఖ	₹10,21,725.37
సైన్స్ అండ్ టెక్నాలజీ	₹12,797.24
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	₹63,298.12
స్పేస్ (అంతరిక్షం)	₹11,538.26
హోం శాఖ	₹1,18,969.28
గృహ, పట్టణ వ్యవహారాలు	₹48,032.17
మానవ వనరుల అభివృద్ధి	₹93,847.64
సమాచార, ప్రసార శాఖ	₹4,375.21
మైనారిటీ వ్యవహారాలు	₹4,700
సామాజిక న్యాయం, సాధికారత	₹8,944.90
సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు	₹7,011.29





..జో మజా ఆయా!

అవినీతి రహిత, సుస్థిర పాలన అందిస్తున్నాం | **అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం** | **బడ్జెట్ ప్రసంగంలో పీయూష్ గోయల్** | **'ఉరీ' సినిమాకు ప్రశంసలు**

న్యూఢిల్లీ:

ఒక వైపు పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగం.. మరోవైపు ఎన్డీయే సభ్యుల హర్షధ్వానాలతో శుక్రవారం లోక్ సభ రెండు గంటల పాటు మార్మోగింది. తాత్కాలిక ఆర్థిక మంత్రి హోదాలో పీయూష్ గోయల్ ఉదయం 11 గంటలకు లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. మధ్యాహ్నం 12.45 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లండన్‌లో చికిత్స పొందుతుండటంతో ఆయన స్థానంలో గోయల్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి వచ్చింది. రైతులు, అసంఘటిత రంగాల కార్మికుల కోసం పథకాలను ప్రకటిస్తున్నప్పుడు ఎన్డీయే సభ్యులంతా బల్లలు చరుస్తూ హర్షం ప్రకటించారు. 'ఉరీ' సినిమాను గోయల్ ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జో మజా ఆయా..' అంటూ ఆయన అనగానే.. సభ్యులు 'హౌ ఈస్ ది జోష్' అంటూ డైలాగ్‌తో హోరెత్తించారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సిన జైట్లీ అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయన త్వరగా కోలుకోవాలని తనతోపాటు సభ్యులు ఆకాక్షిస్తున్నారని పీయూష్ తెలిపారు. వికాస్ భారత్ యాత్రను బడ్జెట్ ద్వారా కొనసాగిస్తున్నామని, 2019-20 ఏడాదికి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో తమ సర్కారు చేసిన పనులు ఇవీ అంటూ చెప్పుకొచ్చారు. దాదాపు 20 నిమిషాల వరకు ప్రభుత్వ విజయాలనే వివరించారు.

మోడీ సారథ్యంలో సుస్థిర పాలన

ప్రధాని మోడీ సారథ్యంలో తమ ప్రభుత్వం దేశంలో సుస్థిర పాలనను అందిస్తోందని తెలిపారు. సమ్మిళిత వృద్ధి కొనసాగిస్తున్నామన్నారు. విధాన నిర్ణయాల్లో వేగం పెంచామని, అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, పారదర్శకతకు పెద్ద పీట వేశామని వివరించారు. ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు తగ్గించామన్నారు.

కోటా చరిత్రాత్మకం

పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు తమ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని గోయల్ వివరించారు. అగ్రవర్ణ పేదలకు కూడా ఉపయోగపడేలా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను తీసుకువచ్చామని, ఇది చరిత్రాత్మకమని తెలిపారు. కోటాతో విద్యా రంగంలో అదనంగా ఒక్కోసంస్థలో 25 సీట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు.

హర్యానాకు ఎయిమ్స్

దేశంలో ప్రస్తుతం 21 ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఉన్నాయని, 2014కు ముందు 14 మాత్రమే ఉండేవని పీయూష్ గోయల్ తెలిపారు. 22వ ఎయిమ్స్‌ను హర్యానాలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

శ్రమ్ యోగి మాన్‌ధన్

దేశంలో 42 కోట్ల మంది కార్మికులు అసంఘటిత రంగాల్లో ఉన్నారని.. అందులో రిక్షా కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, బీడీ వర్కర్స్ ఇలా ఎందరో ఉన్నారని, వారందరి కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పీయూష్ తెలిపారు. 'ఆయుష్మాన్ భారత్', 'ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన' కింద లబ్ధిచేకూరుస్తున్నామని, ఇక నుంచి అసంఘటిత రంగాల కార్మికులకు మెగా పెన్షన్ స్కీంను తీసుకురానున్నట్లు తెలిపారు. దాని పేరు 'ప్రధాన మంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్' అని ప్రకటించారు. పథకం ప్రకటించగానే.. ఎన్డీయే సభ్యుల నుంచి పెద్ద పెట్టున హర్షం వ్యక్తమైంది. 'ఉజ్వల యోజన' కింద దేశంలో 8 కోట్ల ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందజేయాలని నిర్ణయించామని, ఇప్పటికే 6 కోట్ల కనెక్షన్లు అందజేశామని, మిగతా కనెక్షన్లు వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని చెప్పారు. 'ముద్ర' యోజన పథకం కింద యువతకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా ఇండియా నిలిచిందని తెలిపారు. రక్షణ రంగం బడ్జెట్ రూ.3 లక్షల కోట్లకు చేరుకుందని వివరించారు. కాపలా లేని రైల్వే లెవల్ క్రాసింగ్‌లు తొలగించామని, రైలు ప్రయాణికుల రక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రపంచంలోనే హైవేల వృద్ధిలో భారత్ ముందున్నదని, రోజుకు 27 కిలో మీటర్ల మేర హైవే నిర్మాణం జరుగుతోందని తెలిపారు. డిజిటల్ ఇండియా ద్వారా 3 లక్షల కామన్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్‌సీ)ను ఏర్పాటు చేశామని చెప్పారు. డీమానిటైజేషన్‌తో బ్లాక్ మనీని కట్టడి చేశామని, అవినీతి రహిత పాలనను ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు.

హౌ ఈజ్ ది జోష్

ఇండియన్ ఆర్మీ చేపట్టిన 'సర్జికల్ స్ట్రైక్స్' ఇతివృత్తంతో తెరకెక్కిన సినిమా 'ఉరీ' సినిమా డైలాగ్‌లతో లోక్‌సభ ప్రతిధ్వనించింది. పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగంలో సినిమా గురించి మాట్లాడుతూ.. "ఉరీ సినిమా చూసే అదృష్టం నాకు దక్కింది. సినిమాలో ఎంతో జోష్ ఉంది. జో మజా ఆయా.. జో జోష్ థా..' అని అన్నారు. వెంటనే ఎన్డీయే సభ్యులు సినిమాలోని 'హౌ ఈజ్ ది జోష్' అనే డైలాగ్‌ను అందుకున్నారు. కాసేపు.. ఆ డైలాగ్‌తో సభ మార్మోగింది.

పీఎం కిసాన్

రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు కృషి చేస్తున్నామని, చరిత్రలో తొలిసారిగా 22 రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని గోయల్ వివరించారు. ఐదు ఎకరాల (2 హెక్టార్ల) లోపు వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు ఏటా రూ. 6000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, దీనికి 'ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్)'గా ప్రకటిస్తున్నామని వెల్లడించారు. ఈ పథకాన్ని గోయల్ ప్రకటించగానే సభలోని ప్రధాని మోడీ సహా ఎన్డీయే సభ్యులంతా బల్లలు చరుస్తూ హర్షం ప్రకటించారు. జై కిసాన్.. జైజై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. గో సంరక్షణకు కట్టుబడి ఉన్నామని, 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్'కు రూ. 750 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డులను పాడి, మత్స్య రైతులకు అందజేస్తామని ప్రకటించారు. వారికి 2 శాతం వడ్డీతో రుణాలు ఇప్పిస్తామన్నారు.






వృద్ధి రేటులో ప్రపంచంలోనే 6వ స్థానం

ఆర్థిక వృద్ధి రేటులో 2013-14లో ప్రపంచంలో దేశం 11వ స్థానంలో ఉండేదని గోయల్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రస్తుతం 6వ స్థానానికి ఎగబాకిందని, ఇది గొప్ప విజయమని కొనియాడారు. 2009-2014 మధ్య 10.1శాతం ఉన్న ద్రవ్యోల్బణాన్ని నాలుగేళ్లలో తాము 4.6 శాతానికి తీసుకువచ్చామని, డిసెంబర్ నాటికి అది 2.19 శాతానికి చేరిందని తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గడంతో మధ్యతరగతికి మేలు జరిగిందని, లేకపోతే తినే తిండిపై, వాడే వస్తువులపై ఎంతో ఖర్చు చేయాల్సి వచ్చేదన్నారు. రికార్డు స్థాయిలో 239 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ఐదేళ్లలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని, అందులో జీఎస్టీ కూడా ఒకటని తెలిపారు. రూ. 3 లక్షల కోట్ల మొండి బకాయిలు వసూలు చేశామని ఆయన వివరించారు. దివాలా, రెరా వంటి చట్టాల ద్వారా బినామీ లావాదేవీలకు చెక్ పెట్టామని, పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లను దేశానికి తిరిగి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

2022 నాటికి నవ భారత్


2022 నాటికి నవ భారత్‌ను చూడబోతున్నామని, ఆ నాటికి దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుందని గోయల్ తెలిపారు. అప్పటికి దేశంలో ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉంటుందని, రైతుల ఆదాయం రెండింతలవుతుందని చెప్పారు. పల్లెలు, పట్టణాల మధ్య అంతరాలు తొలగించేందుకు కృషి చేస్తున్నామని, పల్లెల్లో జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ సడక్ యోజనలో భాగంగా ఊళ్లల్లో రహదారుల నిర్మాణం మూడు రెట్లు పెరిగిందని, బస్సు సౌకర్యం లేని పల్లెలకు ఆ సౌకర్యాన్ని కల్పించామని వివరించారు. 2014కు ముందు దేశంలో 2.5 కోట్ల కుటుంబాలు చీకట్లలోనే మగ్గేవని, ఇప్పుడు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అందజేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరా లేని అన్ని గృహాలకు మార్చి నాటికి 'సౌభాగ్య యోజన' కింద ఉచితంగా కనెక్షన్లు అందుతాయన్నారు.



దేశంలో 143 కోట్ల ఎల్ఈడీ బల్బులను వినియోగిస్తున్నామని, దీని వల్ల పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు కరెంటు బిల్లులు తగ్గిపోయాయని చెప్పారు. ప్రపంచంలోనే అతి పెద్ద స్కీం 'ఆయుష్మాన్ భారత్' అని, దీని వల్ల 50 కోట్ల మందికి లబ్ధిచేకూరుతోందన్నారు. ఏ ఒక్కరూ ఆకలితో నిద్రపోయే పరిస్థితులు ఉండకూడదని, ఉపాధి హామీ పథకాన్ని విస్తరించి పేదలకు ప్రయోజనం చేకూరుస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని, జన్‌ధన్ యోజన ద్వారా ప్రజల ఖాతాల్లోకి సబ్సిడీ నగదు జమ అవుతోందని తెలిపారు. స్వచ్ఛభారత్ కోసం దేశంలోని 130 కోట్ల మంది జనం ముందుకు వస్తున్నారని, ఇది మంచి పరిణామమన్నారు. 5.45 లక్షల గ్రామాలు ఓపెన్ డిఫకేషన్ ఫ్రీ (ఓడీఎఫ్) గ్రామాలుగా నిలిచాయని, 98% మందికి మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

లోక్‌సభలో అథవాలె కవితా చమత్కారం

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే శుక్రవారం లోక్‌సభలో కవితలు, ద్విపదులతో తన హాస్య చతురతను ప్రదర్శించారు. ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పేద, మధ్య తరగతికి బడ్జెట్‌లో వరాలు కురిపించినప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని చూస్తూ అథవాలె మూడుసార్లు కవితలు వినిపించి ఆకట్టుకున్నారు.



బోర్ కొట్టకుండా.. విసుగు రాకుండా

బడ్జెట్ ప్రసంగం అనగానే.. అబ్బ అంత బోరింగ్ ప్రసంగం ఎవడింటాడ్రా బాబూ అని కొందరు కళ్లు తిప్పేసుకుంటూ ఉంటారు. అందుకే ఆర్థిక మంత్రులు తమ ప్రసంగాలను వివిధ భాషలు, చలోక్తులు, జోకులు, కవితలు చెబుతూ కొంచెం జోష్ నింపే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రులే కాదు.. ఓ సారి ప్రధాని నరేంద్ర మోడీ కూడా తన ప్రసంగంలో ఓ శ్లోకం చెప్పి అందరి దృష్టిని ఆకర్షించారు. అలాంటి కొన్ని సందర్భాలపై ఓ లుక్కేద్దాం...

ఫ్లాష్‌బ్యాక్...

17 ఏళ్ల క్రితం. 1991లో మన్మోహన్ సింగ్ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నారు. బడ్జెట్ ప్రసంగం చేస్తూ మధ్యలో ఉర్దూలో మాట్లాడారు. ముజఫర్ రజ్మీ అనే కవి రాసిన ఓ కవితలోని కొన్ని లైన్లను ఉటంకించారు. 2017 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హిందీ కవితను వల్లించారు. మార్పులను చూసి జనం భయపడొద్దని ఆ కవిత సారాంశం. ఆ ఏడాది బడ్జెట్‌పై రాష్ట్రపతికి కృతజ్ఞత ప్రసంగం సందర్భంగా ప్రధాని మోడి సంస్కృతంలో మాట్లాడారు. ఓ శ్లోకాన్ని వినిపించారు. 2015లో వెంకయ్య నాయుడు



కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ టైంలో బడ్జెట్ సమావేశాల్లో ఆయన తెలుగులో మాట్లాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. "చాలా మంది పంచాలి పంచాలి అని అంటున్నారు. కానీ, నేను మాత్రం ఉత్పత్తిని పెంచాలి పెంచాలి అని అంటున్నా. 'పెంచాలి' లేకుండా 'పంచాలి' అంటే మిగిలేది పంచే. అది నిజం" అని అన్నారు. 2013-14 బడ్జెట్ సందర్భంగా నాటి ఆర్థిక మంత్రి పీ చిదంబరం తమిళంలో మాట్లాడారు. ప్రముఖ తమిళ కవి తిరువల్లువర్ రాసిన పద్యాన్ని వినిపించారు. 1997-98 బడ్జెట్ ప్రసంగంలోనూ ఆయన బెంగాలీలో మాట్లాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన కవితను చెప్పారు.

'సంపన్నులు ఎప్పటికీ అర్థం చేసుకోలేరు'

బడ్జెట్ పై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన విమర్శలను పీయూష్ గోయల్ తిప్పికొట్టారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని సమర్థించుకున్నారు. ఇది రైతులకు ఎలా ఉపయోగపడుతుందో సంపన్నులు ఎప్పటికీ అర్థం చేసుకోలేరని ఆయన ఎద్దేవా చేశారు. 'కేవలం ఒక్క ఏడాది మాత్రమే కాదు. రైతులు ఏటా రూ.6 వేలు చొప్పున అందుకుంటారు. ఈ స్కీమ్ వల్ల వారి జీవితాల్లో అనూహ్య మార్పు వస్తుంది. సంపన్నులకు ఇది అర్థం కాదు' అని అన్నారు. రెండేళ్లుగా ఆహార ద్రవ్యోల్బణం పడిపోవడం, అంతర్జాతీయ మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గుతున్నందునే వ్యవసాయంలో లాభాలు తగ్గాయన్నారు.





బ్యాలెట్ బడ్జెట్ 2019-20

రూ.5 లక్షల వరకు బేఫికర్

టాక్స్ రిబేట్ ప్రకటించిన పీయూష్

వేతన జీవులకు ఊరట | రాయితీలు కలుపుకుంటే రూ.6.5 లక్షల వరకూ నో టాక్స్ | యథాతథంగా స్లాబ్‌లు | స్టాండర్డ్ డిడక్షన్ మరో రూ.10 వేలు పెంపు

న్యూఢిల్లీ:
మధ్యతరగతిపై మోడీ ప్రభుత్వం రంగుల వల విసిరింది. మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకునేలా శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వరాల మూట విప్పింది. రూ.5 లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారికి పన్ను బెడద లేకుండా టాక్స్ రిబేట్ ప్రకటించింది. స్టాండర్డ్ డిడక్షన్‌ను మరో రూ.10 వేలు పెంచింది. వాస్తవానికి పన్నుల స్లాబ్‌లోనే మార్పులు చేస్తారని ఆశించినప్పటికీ తెలివిగా రిబేట్‌తో సరిపెట్టారు. ప్రస్తుత ప్రతిపాదన వల్ల కేవలం దిగువ స్లాబ్‌లోని వారికి మాత్రమే లాభం ఉంటుంది. ఎక్కువ పన్ను రేటు పరిధిలోకి వచ్చేవారికి ప్రయోజనం ఉండదు. బడ్జెట్‌లో భారీ ఎత్తున పన్ను రాయితీలు కల్పిస్తున్నట్టు పీయూష్ తన ప్రసంగంలో పిక్చర్ ఇచ్చినప్పటికీ వాస్తవంలో అంత సీన్ లేదని విశ్లేషకులు అంటున్నారు. మధ్య తరగతికి పాక్షికంగానే లాభమని వారు చెబుతున్నారు.

డైరెక్ట్ టాక్సెస్ ముఖ్యాంశాలివీ..

- ప్రస్తుతమున్న పన్ను రేట్ల ప్రకారం రూ.2.5 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంది. రూ .2.5 లక్షల నుంచి 5 లక్షల రాబడిపై 5 శాతం పన్ను విధిస్తున్నారు. అంటే రూ.12,500 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ రూ.12,500కు ప్రభుత్వం పన్ను రిబేట్ కల్పించింది. అంటే రూ.5 లక్షల లోపు రాబడి ఉంటే పన్ను చెల్లించాల్సిన పనే లేదు. ఇతర రాయితీలను ఉపయోగించుకుంటే రూ.6.5 లక్షల వరకు రాబడి ఉన్న వారు కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు.
- గతేడాది బడ్జెట్‌లో కూడా రూ.3.5 లక్షల లోపు రాబడి ఉన్నవారికి టాక్స్ రిబేట్ ప్రకటించారు. అంటే మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షలు పోను అదనంగా ఉన్న రూ.లక్షపై కట్టాల్సిన రూ.5 వేలకు పన్ను రిబేట్ ఇచ్చారు. ఇప్పుడు ఈ రిబేట్‌నే మరి కాస్త పెంచారు.
- గతేడాది బడ్జెట్‌లో పన్ను స్లాబ్‌లను మార్చారు. అంతకుముందు వరకు 2.5 లక్షల నుంచి 5 లక్షల రాబడిపై 10 శాతం పన్ను ఉండేది. దాన్ని 5 శాతానికి తగ్గించారు. ఇప్పుడు కూడా ఈ 5 శాతం రేటు ఎప్పటిలానే కొనసాగుతుంది. అధికాదాయం ఉన్న వర్గాలకు ఈ రేటు ఎప్పటిలానే వర్తిస్తుంది. ఆ తర్వాత రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వార్షిక రాబడిపై 20 శాతం, రూ.10 లక్షల పైబడిన వార్షిక రాబడిపై 30 శాతం పన్ను రేటు యథాతథంగా కొనసాగుతాయి.
- యథాప్రకారం 5, 20, 30 శాతం పన్ను శ్లాబులతో పాటు ఎడ్యుకేషన్ సెస్, సర్‌ఛార్జ్‌లు కూడా అలాగే ఉంటాయి.
- స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.40 వేల నుంచి.50 వేలకు పెంచారు. 3 కోట్ల మందికి పైగా టాక్స్ పేయర్స్ లాభపడుతారని పీయూష్ వెల్లడించారు.
- ప్రస్తుత రిబేట్ వల్ల దాదాపు రూ.8 లక్షల వరకు వార్షిక రాబడి ఉన్న వారు కూడా మినహాయింపు పరిమితులకు అనుగుణంగా ఇన్వెస్ట్ చేస్తే పన్ను లేకుండా బయటపడే అవకాశం ఉంది. మొత్తం డైరెక్ట్ టాక్స్ బెనిఫిట్స్ భారం ప్రభుత్వంపై రూ.18,500 కోట్లు ఉంటుందని మంత్రి చెప్పారు.
- ఆదాయం పన్ను చట్టం సెక్షన్ 80 సీ కింద పీఎఫ్, బీమా, ఇతర సేవింగ్ స్కీమ్‌ల్లో ఇన్వెస్ట్‌మెంట్లపై ఇస్తున్న పన్ను రాయితీల పరిమితి ఎప్పటిలానే రూ.1.50 లక్షలు ఉంటుంది.
- హౌజింగ్ లోన్ వడ్డీలపై డిడక్షన్‌ను గతంలోనే రూ.1.5 లక్షల నుంచి రూ. 2 లక్షలకు పెంచారు. ఇందులో కూడా మార్పు లేదు.
- సీనియర్ సిటిజన్స్ వైద్య ఖర్చులు, ఎడ్యుకేషన్ లోన్స్‌పై చెల్లించే వడ్డీ, నేషనల్ పెన్షన్ స్కీమ్, మెడికల్ ఇన్సూరెన్స్ ఖర్చులపై కూడా పన్ను మినహాయింపులు వివిధ సెక్షన్ల కింద ఉపయోగించుకోవచ్చు.

సేవింగ్స్ వడ్డీపై టీడీఎస్ రిలీఫ్
బ్యాంకులు, పోస్టాఫీసులలో డిపాజిట్ల మీద వచ్చే వడ్డీ ఆదాయంపై టీడీఎస్ పరిమితిని గణనీయంగా పెంచారు. గతంలో ఈ పరిమితి రూ.10 వేలుగా ఉండగా, ఇప్పుడు దాన్ని ఏకంగా రూ.40 వేలకు పెంచారు. అంటే గతంలో పది వేల వడ్డీ ఆదాయానికే బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లోనే టీడీఎస్ మినహాయించేవారు. ఇప్పుడు రూ.40 వేల దాకా ఆ బాధ ఉండదన్న మాట. 60 ఏళ్ల దాకా వయసున్న వారికి ఈ ప్రతిపాదన వర్తిస్తుంది. రిటైర్ అయిన తర్వాత వచ్చే బెనిఫిట్స్‌ను బ్యాంకుల్లో దాచుకునే చాలామందికి ఈ ప్రతిపాదన లాభం చేకూరుస్తుంది.

ఇంటి రెంట్‌పైనా..
హౌజింగ్ రెంట్‌పై ప్రస్తుతం రూ.లక్షా ఎనభై వేల వరకు టీడీఎస్ మినహాయింపు ఉంది. ఈ పరిమితిని రూ.2.4 లక్షల వరకు పెంచారు. అంటే రూ.2.4 లక్షల వరకు వచ్చే అద్దె రాబడిపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

క్యాపిటల్ గెయిన్స్ పెట్టుబడిపై..
ఆస్తుల విక్రయంపై లభించే క్యాపిటల్ గెయిన్స్‌ను ఇంటి కొనుగోలుపై వెచ్చించడం ద్వారా పన్ను మినహాయింపు పొందవచ్చు. ఇప్పటి వరకు ఇది ఒక ఇంటిపై ఇన్వెస్ట్‌మెంట్‌కు మాత్రమే వర్తిస్తోంది. ఇప్పుడు రెండో ఇంటిపై కూడా క్యాపిటల్ గెయిన్స్ పెట్టుబడికి అవకాశం ఇచ్చారు. రూ.2కోట్లు అంతకంటే తక్కువ క్యాపిటల్ గెయిన్స్‌కు ఈ రాయితీ వర్తిస్తుంది.

రిబేటు లెక్క ఇలా..

రిబేటు వర్తింప చేయడానికి ఆదాయాన్ని ఎలా గణించాలనేది కూడా నిర్ధారించారు. గ్రాస్ టోటల్ ఇన్‌కం కాకుండా.. ట్యాక్సబుల్ ఇన్‌కంనే ఆధారం చేసుకుంటారు. ఐతే ఎవరికైనా ఎక్కువ గ్రాస్ ఇన్‌కం ఉంటే, అలాంటి వారు పన్ను ఆదాకు ఉన్న మార్గాల్లో పెట్టుబడులు పెడితే, వారి గ్రాస్ టోటల్ ఇన్‌కంను రూ.5 లక్షలకు తగ్గించుకునే వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణ చూద్దాం... ఒక వ్యక్తి ఏటా రూ.6.50 లక్షలు సంపాదిస్తున్నాడనుకుందాం. ఆయన 80 సీ సెక్షన్ కింద రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే, అప్పుడు ఆ రూ.1.50 లక్షలను డిడక్షన్‌గా క్లెయిమ్ చేసుకోవచ్చు. దాంతో గ్రాస్ ఇన్‌కం రూ.5 లక్షలకు తగ్గించుకోవచ్చు. ఉద్యోగులు ఆదాయపు పన్ను చట్టంలోని స్టాండర్డ్ డిడక్షన్‌తోపాటు, సెక్షన్ 80 డీ కింద డిడక్షన్స్‌ను కూడా వర్తింపచేసుకోవచ్చు.

వేతనజీవులకు సంబురమే

వేతన జీవులకు బడ్జెట్ సంతోషం మిగిల్చింది. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ గోయల్ తీపి వార్త చెప్పారు. పెరుగుతున్న ఇంటిఖర్చుల 'బడ్జెట్'తో సతమతమవుతున్న ఉద్యోగులకు ఈ బడ్జెట్ ప్రతిపాదన వరమే. వేతనాలపై ఆధారపడే ఉద్యోగులకు, పెన్షనర్లకూ ఊరట కలిగించారు.

స్టాండర్డ్ డిడక్షన్‌తో అందరికీ లాభం

జీతాలు, పెన్షన్ ఆదాయం ఉండే వారికి స్టాండర్డ్ డిడక్షన్‌ను తాజా బడ్జెట్లో ఇప్పటిదాకా ఉన్న రూ.40 వేల నుంచి ఇప్పుడు రూ. 50 వేలకు పెంచారు. ఈ బెనిఫిట్ పన్ను చెల్లింపుదారులందరికీ లభిస్తుంది. దీనివల్ల రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఆదాయం ఉండే వారికి రూ.2,080 చొప్పున ఆదా అవుతుంది. అలాగే రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల ఆదాయం ఉన్న వారికి రూ.3,120 ఆదా అవుతుంది. ఇక రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం ఉన్న వారికి రూ.3,432 దాకా ఆదా అవుతుంది. వార్షికాదాయం రూ. కోటి దాటిన వాళ్లకి రూ.3,588 మాత్రమే ఆదా కానుంది. సెస్, సర్ ఛార్జ్‌లు కూడా అందులో కలిసే ఉన్నాయి.

2019–20 సంవత్సరానికి పన్ను లెక్కింపు (రూ.లో)

5 లక్షలకు

మొత్తం స్థూల ఆదాయం (జీతం, ఇంటి అద్దె, వ్యాపారం, ఇతరాలు)	500000	
తొలగింపు: చాప్టర్ వీఐఏ ప్రకారం తగ్గింపులు		
80సీ సెక్షన్ ప్రకారం (ఇంటి లోన్, ఎల్ఐసీ, ఫీజులు)	0	
80డీ సెక్షన్ ప్రకారం (మెడికల్ ఇన్సూరెన్స్)	0	0
మొత్తం టాక్సబుల్ ఇన్‌కం		500000
సాధారణ ఆదాయంపై పన్ను		12500
తగ్గింపు: 87ఏ సెక్షన్ రిబేట్		12500
		0
ఎడ్యుకేషన్ సెస్@ 4శాతం		0
పన్నుభారం		0

8 లక్షల 75వేలకు

మొత్తం స్థూల ఆదాయం (జీతం, ఇంటి అద్దె, వ్యాపారం, క్యాపిటల్ గెయిన్స్ ఇతరాలు)		875000
తొలగింపు: సెక్షన్ 24 ప్రకారం మినహాయింపు (హౌస్‌లోన్ ఇంట్రెస్ట్)		- 200000
స్టాండర్డ్ డిడక్షన్		- 50000
మొత్తం స్థూల ఆదాయం		625000
తగ్గింపు: చాప్టర్ వీఐఏ ప్రకారం మినహాయింపులు		
80సీ సెక్షన్ ప్రకారం (ఇంటి లోన్, ఎల్ఐసీ, ఫీజులు)		- 150000
మొత్తం టాక్సబుల్ ఇన్‌కం		475000
సాధారణ ఆదాయంపై పన్ను		11250
తగ్గింపు: 87ఏ సెక్షన్ రిబేట్		-12500
ఎడ్యుకేషన్ సెస్@4శాతం		0
పన్నుభారం		0

10 లక్షలకు

మొత్తం స్థూల ఆదాయం (జీతం, ఇంటి అద్దె, వ్యాపారం, క్యాపిటల్ గెయిన్స్ ఇతరాలు)		1000000
తొలగింపు: సెక్షన్ 24 ప్రకారం మినహాయింపు (హౌస్‌లోన్ ఇంట్రెస్ట్)		- 200000
స్టాండర్డ్ డిడక్షన్		- 50000
మొత్తం స్థూల ఆదాయం		750000
తగ్గింపు: చాప్టర్ వీఐఏ ప్రకారం మినహాయింపులు		
80సీ సెక్షన్ ప్రకారం (ఇంటి లోన్, ఎల్ఐసీ, ఫీజులు)	150000	
80డీ సెక్షన్ ప్రకారం (మెడికల్ ఇన్సూరెన్స్)	25000	175000
మొత్తం టాక్సబుల్ ఇన్‌కం		575000
సాధారణ ఆదాయంపై పన్ను		27500
తగ్గింపు: 87ఏ సెక్షన్ రిబేట్		0
ఎడ్యుకేషన్ సెస్@4శాతం		1100
పన్నుభారం		28600

రెండో ఇంటి అద్దెకూ పన్నుండదు

బడ్జెట్‌లో రియల్‌కు ఊతం

న్యూఢిల్లీ:
రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా కేంద్రం వరాలు ప్రకటించింది. రియల్‌లో పెట్టుబడులు పెరిగితే ఇతర రంగాలపైనా ప్రభావముంటుంది కాబట్టి బడ్జెట్‌లో ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. హౌసింగ్‌లో పెట్టుబడులు పెంచేలా ప్రోత్సాహకాలను ప్రకటించింది.

1. ఇళ్లను అందుబాటు ధరల్లోకి తెచ్చేందుకు సెక్షన్ 80ఐబీఏ కింద ఇస్తున్న బెనిఫిట్లు 2020 మార్చి దాకా పొడిగించాలని నిర్ణయించింది.
2. అమ్ముడవని ఇన్వెంటరీస్, నోషనల్ అద్దెపై ఇస్తున్న ట్యాక్స్ రాయితీని రెండేళ్లకు పెంచింది. ప్రాజెక్టు పూర్తయిన నాటి నుంచి రెండేళ్లపాటు రాయితీ వర్తిస్తుంది.
3. రెండు ఇళ్లున్న వ్యక్తి ఓ ఇంటిని నివాసానికి వాడుకుంటాడని రెండో ఇంటి అద్దెపైనే ఇప్పటివరకు పన్ను విధిస్తూ వచ్చారు. కానీ బదిలీలతో ఉద్యోగం ఓచోట, కుటుంబం మరోచోట చేసే మధ్యతరగతి ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని రెండో ఇంటి అద్దెపైనా పన్ను రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించారు.
4. సెక్షన్ 54 కింద ఇచ్చే క్యాపిటల్ గెయిన్స్ రోల్ ఓవర్‌ను రెండు ఇళ్లకు వర్తింప చేయాలని కూడా నిర్ణయించారు. ఆస్తిని అమ్మి ఆ డబ్బుతో ఇల్లు కొంటే ఆ పెట్టుబడికి పన్ను మినహాయింపు ఉంది. మరో ఇంటికీ రూ. 2 కోట్ల వరకు దీన్ని వర్తింప జేయాలని ప్రతిపాదించారు. జీవితకాలంలో ఒక్కసారే ఈ రాయితీ వాడుకోవచ్చు.
5. అద్దెపై టీడీఎస్ పరిమితిని రూ.1.80 లక్షల నుంచి రూ. 2.40 లక్షలకు పెంచారు.



ఢిల్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని వింటున్న పారిశ్రామికవేత్తలు

4 నెల్లకా.. 6 నెల్లకా!

రాష్ట్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి

హైదరాబాద్, వెలుగు: కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నాలుగు నెలలకు అంచనాలు రూపొందించింది. దీంతో ఇప్పుడిక రాష్ట్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రం కూడా ఓటాన్ అకౌంట్‌నే ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో 4 నెలలకు బడ్జెట్ పెడతరా? లేక 6 నెలలకు రూపొందిస్తారా అని చర్చ జరుగుతోంది. ఈమధ్యే బడ్జెట్‌పై సమీక్ష జరిపిన సీఎం కేసీఆర్.. 6 నెలలకు పెడదామని సూచించినట్టు తెలిసింది. కానీ కేంద్రం 4 నెలలకే ప్రవేశపెట్టినందున ద్రవ్య వినిమయానికి ఇబ్బంది లేకుండా తాత్కాలిక బడ్జెట్ పెడితే చాలని అధికారులంటున్నారు. కేంద్ర ద్రవ్య వినిమయ బిల్లు జూలై వరకు అమల్లో ఉంటుంది. ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది. అందులో రాష్ట్రానికి పూర్తి స్థాయి కేటాయింపులు దక్కుతాయని రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. అందుకే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశమున్నా ఓటాన్ అకౌంట్‌తోనే సరిపెడుతోంది. 6 నెలలకు ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదిస్తే ప్రభుత్వ నిర్వహణకు ఇబ్బంది ఉండదని సీఎం భావిస్తున్నారు. ఆయన సూచన మేరకే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఫిబ్రవరి రెండో వారంలో..
ఫిబ్రవరి రెండో వారంలో బడ్జెట్ పెట్టేందుకు ఆర్థిక శాఖ సన్నద్ధమవుతోంది. తాత్కాలిక బడ్జెట్ అయినా పూర్తి స్థాయి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. బడ్జెట్ పాఠాన్నీ పూర్తి స్థాయి అంచనాలతోనే రెడీ చేస్తున్నారు.

ఈ పథకాలకు పెంపు
ఎన్నికలపుడు ఇచ్చిన హామీల ప్రకారం ఆసరా పెన్షన్లు, రైతుబంధు పెంపు వ్యయాన్ని ఈ బడ్జెట్లోనే ప్రవేశపెట్టనున్నారు. ఎస్సీ, ఎస్టీల స్వయం సమృద్ధికి కొత్త పథకాలనూ ప్రతిపాదించనున్నారు. నిరుద్యోగ భృతికి అర్హుల ఎంపిక, పథకం స్వభావ స్వరూపాలను నిర్ణయించే కమిటీని కూడా ఈ సందర్భంగానే నియమించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోతున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపైనా స్పష్టత ఇచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

బడ్జెట్ హైలైట్స్


- రాబోయే రెండేళ్లలో ఆన్‌లైన్‌లోనే ఐటీ రిటర్నుల దాఖలు. 24 గంటల్లోనే ఐటీ రిటర్న్‌ల ప్రాసెసింగ్
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు జీఎస్‌టీ రెవెన్యూలో కనీసం 14 శాతం వాటా
- ఇళ్ల కొనుగోలుదారులపై జీఎస్‌టీ రేట్ల తగ్గించేలా జీఎస్‌టీ కౌన్సిల్‌కు ప్రతిపాదనలు
- అన్ని మినహాయింపుల తర్వాత ఐదు లక్షల వార్షికాదాయం వరకూ పూర్తిగా టాక్స్ రిబేట్.
- కొన్ని రకాల పెట్టుబడులు పెట్టిన వారికి రూ.6.5 లక్షల వరకూ పూర్తి పన్ను మినహాయింపు.
- స్టాండర్డ్ డిడక్షన్ 40 వేల నుంచి 50 వేలకు పెంపు. 3 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులకు లబ్ధి.
- సొంతంగా నివాసం ఉండే రెండో ఇంటిపై పన్ను మినహాయింపు
- 194ఏ సెక్షన్ కింద టీడీఎస్‌పై సీలింగ్ లిమిట్ 10 వేల నుంచి 40 వేలకు పెంపు.
- 194ఐ సెక్షన్ కింద టీడీఎస్ సీలింగ్ లిమిట్ 1,80,000 నుంచి 2,40,000కి పెంపు.
- 54 సెక్షన్ కింద ఒక ఇంటిపై పెట్టిన పెట్టుబడులపై మూలధన పన్ను లాభం రెండో ఇంటికి వర్తింపు.
- 80ఐబీ బెనిఫిట్స్ మరో ఏడాది (2020 వరకు) పొడిగింపు. అన్‌సోల్డ్ ఇన్వెంటరీపై బెనిఫిట్స్ రెండేళ్లకు పెంపు
- ప్రధానమంత్రి కిసాన్ యోజనకు ఆమోదం. 2 హెక్టార్ల (ఐదు ఎకరాలలోపు) వరకూ భూమి ఉన్న ప్రతి రైతుకూ ఏడాదికి రూ.6,000 సాయం.
- 01-12-2018 నుంచి అమలు. మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ.
- 31-03-2019లోపు తొలి విడత చెల్లింపు. 12 కోట్ల మంది చిన్న, మధ్యతరహా రైతు కుటుంబాలకు లబ్ధి. ఇందుకు బడ్జెట్‌లో రూ.75 వేల కోట్లు కేటాయింపు.
- ఆవుల కోసం నేషనల్ కామధేనూ ఆయోగ్. రూ.750 కోట్లతో నేషనల్ గోకుల్ మిషన్.
- 1.5 కోట్ల మంది మత్స్యకారుల సంక్షేమం కోసం ఫిషరీస్‌కు ప్రత్యేక మంత్రిత్వ శాఖ. పశుసంరక్షణ చేసే రైతులకు రుణాల మీద వడ్డీపై 2 శాతం రాయితీ. సకాలంలో రుణాలు చెల్లిస్తే అదనంగా 3 శాతం వడ్డీ రాయితీ.
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ. సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు అదనంగా మరో 3 శాతం వడ్డీ రాయితీ.
- ప్రధానమంత్రి శ్రమ యోగి మంధన్ కింద అనార్గనైజ్డ్ సెక్టార్‌లోని కార్మికులు నెలకు రూ.100/55 చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.3,000 పెన్షన్. 10 కోట్ల మందికి ప్రయోజనం
- గ్రాట్యూటీపై పన్ను మినహాయింపు పరిమితి పది లక్షల నుంచి 20 లక్షలకు పెంపు
- నెలకు 21 వేల జీతం వచ్చే కార్మికులకు బోనస్ వర్తింపు
- ఉజ్వల్ స్కీమ్‌కింద ఆరు కోట్ల మందికి ఉచితంగా ఎల్పీజీ కనెక్షన్లు
- జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఎంఎస్ఎంఈలకు రూ.కోటి వరకూ రుణంపై 2 శాతం వడ్డీ రాయితీ
- మహిళలకు 26 వారాల మెటర్నిటీ లీవ్స్.
- రక్షణ రంగానికి రూ.3 లక్షల కోట్లకుపైగా కేటాయింపులు
- వచ్చే ఐదేళ్లలో లక్ష డిజిటల్ విలేజ్‌ల ఏర్పాటు
- ఇండియన్ ఫిల్మ్ మేకర్లకు సింగిల్ విండో అనుమతులు
- నేషనల్ సెంటర్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు
- డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.90వేలకోట్లు
- 2019-20 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్యలోటు 3.4 శాతం. 2020-21 నాటికి ద్రవ్య లోటును 3 శాతానికి తీసుకొచ్చే ప్రయత్నాలు
- నేషనల్ ఎడ్యుకేషన్ మిషన్‌కు కేటాయింపులు 20 శాతం పెంపు. రూ.38,572 కోట్లు కేటాయింపు
- చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్‌కు నిధుల్లో 18 శాతం పెరుగుదల రూ.27,584 కోట్లు కేటాయింపు
- ఈశాన్య రాష్ట్రాలకు నిధులు 21 శాతం పెరుగుదల. రూ.58,166 కోట్లు
- రైల్వేలకు మూలధన సాయం కింద రూ.64,587 కోట్లు
- పెద్ద కులాల్లోని పేదలకు 10 శాతం కోటాతో 2 లక్షల సీట్ల పెరుగుదల
- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.60 వేల కోట్లు
- అందరికీ ఆరోగ్యం పథకానికి రూ.1.7 లక్షల కోట్లు

ఇప్పటివరకు దేశంలో 11 సార్లు మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు.

ప్రస్తుతం 12వ ఇంటెరిమ్ బడ్జెట్

1947 నుంచి ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్లు 89 (మధ్యంతరం, ఓటాన్ అకౌంట్ అన్నీ కలిపి).

ఇప్పటివరకు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రులు 25 మంది



మోడీ ప్రభుత్వం పేదలు, రైతులు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తుందని ఈ బడ్జెట్ నిరూపించింది. సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసింది. మధ్య తరగతి ప్రజలు, రైతులు, పేద కార్మికులు, ఇతరులకు ఊరట కలిగించింది. రూ. 5 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు చరిత్రాత్మకం. మధ్య తరగతి ప్రజలకు పన్నుల నుంచి ఊరట లభించడమే కాదు. దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచుతుంది. 60 ఏళ్లు దాటిన 10 కోట్ల మంది పేద కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ప్రశంసనీయం.

- బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా




ఈ బడ్జెట్ ఓటాన్ అకౌంట్ కాదు.. అకౌంట్ ఫర్ ఓట్స్. దేశ వనరుల్లో మొదటి హక్కు పేదలకేనన్న కాంగ్రెస్ డిక్లరేషన్ ను కాపీ కొట్టారు. 2018 19 లో ద్రవ్యలోటు టార్గెట్‌ను ప్రభుత్వం మిస్ చేసింది. కరెంటు ఖాతా లోటు 2.5 శాతం ఉంది.

- కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం



మధ్యంతర బడ్జెట్ రైతులు, పేదలకు అనుకూలమైనది. మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచనుంది. దేశాభివృద్ధికి సాయం చేస్తుంది. 2014 నుంచి 2019 వరకు ప్రతి బడ్జెట్ లో మిడిల్ క్లాస్ కు ఊరట కలిగించాం. ఐదేళ్ల ప్రభుత్వ పనితీరు ఆత్మావలోకనానికి, వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు మధ్యంతర బడ్జెట్ మంచి అవకాశం కల్పించింది.

- కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ



ఈ బడ్జెట్ చరిత్రాత్మకం. సమాజంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలన్నదే మా ప్రభుత్వ ఆకాంక్ష. బడ్జెట్ లక్ష్యం కూడా అదే.

- కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్

ప్రభాత వెలుగు
Follow: v6velugu





ఎరుపు రంగు సూట్‌కేసులో..

బడ్జెట్ అనగానే ముందుగా గుర్తొచ్చేది ఆర్థిక మంత్రి చేతిలో ఉండే సూట్‌కేస్. బడ్జెట్ ప్రసంగం రోజున ఆ సూట్‌కేస్‌ను చూపిస్తూనే మీడియాకు ఫోజులిస్తారు. తర్వాత ఆ సూట్‌కేస్‌లోనే బడ్జెట్ పత్రాలు ఉంటాయి. అంతే కాదు ఈ సూట్ కేసు రంగుకూ పెద్ద చరిత్రే ఉంది. చాలా దేశాల్లో ఇదో ఆనవాయితీగా ఉంది. కొందరు ఆర్థిక మంత్రులు నలుపు రంగులో, మరికొందరు బ్రౌన్ రంగులో ఉన్న సూట్‌కేసు వాడుతుంటారు. మనదేశంలోనూ ఇప్పటివరకు ఆర్థిక మంత్రులుగా పనిచేసినవారు కూడా నలుపు, బ్రౌన్‌రంగుల్లో ఉన్న సూట్‌కేస్‌లనే వాడారు. తాజాగా మధ్యంతర బడ్జెట్ పెట్టిన పీయూష్ గోయల్ ఎరుపు రంగు సూట్‌కేస్‌తో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. ఈ విశేషం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎందుకంటే బడ్జెట్ మారుతుంటుంది, ఆర్థిక మంత్రులూ మారుతుంటారు. కానీ లెదర్‌సూట్ కేసులు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. మరి ఈ బడ్జెట్ సూట్ కేసు ఏంటి, దాని రంగుకు స్పెషాలిటీ ఏంటో తెలుసుకుందామా?

బ్రిటన్‌లో మొదలై..

బడ్జెట్ అనే పదం బొగెట్టి అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. బొగెట్టి అంటే లెదర్ బ్యాగ్ అని అర్థం. చాలా దేశాల్లో ఆర్థిక మంత్రులు లెదర్ బ్యాగ్‌లోనే బడ్జెట్ పత్రాలను తీసుకొచ్చి పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఈ సంప్రదాయం 156 ఏళ్ల క్రితం మొదలైంది. 1860లో బ్రిటీష్ ఆర్థిక మంత్రి విలియం గ్లాడ్‌స్టోన్ ఎరుపు రంగు సూట్‌కేస్‌లో బడ్జెట్ పేపర్లను పెట్టుకుని పార్లమెంటుకు వెళ్లారు. దానిపై బంగారు వర్ణంతో అచ్చువేసిన ఓ బొమ్మ కూడా ఉండేది. సుమారు 6 గంటలపాటు సాగిన ఆయన ప్రసంగంలో అప్పట్లో అతిపెద్ద బడ్జెట్. తర్వాత విలియం ప్రధానమంత్రి కూడా అయ్యారు. ఆయన తర్వాతి మంత్రులు బ్రీఫ్‌కేస్ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఇంగ్లిష్ దేశాలతోపాటు యూరోపియన్ వలస దేశాలకూ ఆ పద్ధతి పాకింది. మనదేశంలో తొలి బడ్జెట్ పెట్టిన ఆర్కే షణ్ముఖం చెట్టి కూడా బడ్జెట్ సూట్‌కేస్ వాడారు. పార్లమెంటుకు రాగానే బడ్జెట్ సూట్‌కేసుతో ఫొటోకు ఫోజివ్వడం కూడా ఇక్కడ ఆయనతోనే మొదలైంది. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. అయితే లెదర్ సూట్‌కేసు మారకపోయినా.. రంగులు మాత్రం మారాయి. యశ్వంత్ సిన్హా, మన్మోహన్, ప్రణబ్ ముఖర్జీ, అరుణ్‌జైట్లీ నలుపు, బ్రౌన్‌రంగుల సూట్ కేసులు వాడారు. ఆర్థిక శాఖే ఈ బడ్జెట్ సూట్‌కేసును సేకరిస్తుంది. నాలుగు రంగుల బ్యాగులను మంత్రి ముందు ఉంచుతుంది. వాటిలో తనకు నచ్చిన రంగు సూట్‌కేసును ఆయన ఎంచుకుంటారు. ఈసారి పీయూష్ గోయల్ ఎరుపు రంగు సూట్‌కేసు తెచ్చారు.



అసంఘటిత కార్మికులకు రూ.3000 పెన్షన్

బడ్జెట్‌లో ప్రకటించిన కేంద్రం • రూ.15 వేల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులు

న్యూఢిల్లీ: అసంఘటిత కార్మికులకు కేంద్రం తీపికబురు చెప్పింది. 60 ఏళ్లు పైబడిన అన్‌ఆర్గనైజ్డ్ వర్కర్లకు పెన్షన్ ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. నెలవారీ ఆదాయం రూ.15 వేలు లోపు ఉన్న వారందరికీ రూ.3 వేల చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించింది. ఈ పథకం వల్ల 10 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని తెలిపింది. ఇందుకోసం త్వరలోనే 'ప్రధాన్ మంత్రి శ్రమ్-యోగి మాన్‌ధన్(పీఎంఎస్‌వైఎం)' పెన్షన్ పథకాన్ని తీసుకురానున్నట్లు వివరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే దీన్ని ప్రారంభించనుంది. పథకానికి మాచింగ్‌కంట్రిబ్యూషన్‌కింద ప్రభుత్వం, కార్మికులు నెలకు రూ.100 చొప్పున జమ చేయాల్సి ఉంది.

42 కోట్ల మంది శ్రమ

"దేశ జీడీపీలో సగానికిపైగా.. 42 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికుల చెమట నుంచే వస్తోంది. ఇందులో వీధి వ్యాపారులు, రిక్షా పుల్లర్లు, నిర్మాణ రంగ కార్మికులు.. ఇంకా ఎందరో వ్యక్తుల కృషి ఉంది. వీరు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు సామాజిక భద్రత కల్పించాల్సి ఉంది" అని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఐదేళ్లలో అన్ని కేటగిరీల కార్మికుల కనీస వేతనాలు 42 శాతం పెరిగాయని చెప్పారు. ప్రతి ఒక్క కార్మికుడికి కనీసం 1,000 పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒకవేళ సర్వీసులో ఉండగా చనిపోతే చెల్లించే మొత్తాన్ని రూ.2.5 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచుతున్నామన్నారు. ఐదేళ్ల కన్నా ఎక్కువ సర్వీసున్న ఉద్యోగులకు చెల్లిస్తున్న టాక్స్ ఫ్రీ గ్రాట్యుటీని 30 లక్షలకు పెంచారు.

ముఖ్య వివరాలివీ

- పీఎంఎస్‌వైఎం పెన్షన్ స్కీమ్ కోసం కేంద్రం బడ్జెట్‌లో 500 కోట్ల రూపాయలు కేటాయించనుంది. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని ప్రకటించింది.
- ఈ ఏడాదే ఈ పథకాన్ని ప్రారంభించనుంది.
- స్కీమ్‌లోకి పద్దెనిమిదేళ్ల వయసులో చేరితే, కార్మికుడు నెలకు రూ. 55 చొప్పున తనకు 60 ఏళ్లు వచ్చే వరకు జమ చేయాలి. అదే 29 ఏళ్ల వయసులో చేరితే నెలకు 100 రూపాయల చొప్పున జమ చేయాలి. కార్మికుడు ఎంతమొత్తంలో జమ చేస్తాడో, అంతే మొత్తంలో కేంద్రం జమ చేస్తుంది.
- ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో కనీసం 10 కోట్ల మంది కార్మికులు, వర్కర్లు లబ్ధి పొందుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.
- ఈ పథకంలో అమల్లోకి వస్తే ప్రపంచంలోనే అతి పెద్ద పెన్షన్ స్కీముల్లో ఒకటిగా నిలవనుంది.

- ఐదేళ్లలో 10 కోట్ల మందికి సభ్యత్వం
- ఈ ఏడాది నుంచి పథకం ప్రారంభం
- రూ.500 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం

ఎస్సీలపై కోట్ల వర్షం

- రూ.76 వేల కోట్ల కేటాయింపు
- గతేడాది కన్నా 36% ఎక్కువ

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ఎస్సీలకు కేంద్రం ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. వారికి సంబంధించిన కేటాయింపులను గతేడాది కన్నా 35.6 శాతం పెంచింది. గతేడాది రూ.56,619 కోట్లు ప్రకటిస్తే ఈసారి రూ.76,801 కోట్లు కేటాయించింది. పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేందుకు సామాజిక న్యాయం, సాధికారత శాఖ కింద సంక్షేమ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేస్తామని మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అధికారికంగా వర్గీకరించని, గుర్తించని జాతులు, సంచార జాతులను గుర్తించేందుకు నీతి ఆయోగ్ కింద ప్రత్యేకకమిటీ నియమిస్తామన్నారు. 5 జాతీయ కమిషన్లకు గతేడాది రూ.33.72 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి రూ.39.87 కోట్లకు పెంచింది. నేషనల్ ఫెలోషిప్ ఫర్ ఎస్సీస్, నేషనల్ ఫెలోషిప్ ఫర్ అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ ఫర్ ఎస్సీస్ అండ్ ఓబీసీస్ జాతీయ స్కాలర్‌షిప్‌లకు బడ్జెట్‌ను తగ్గించింది. గతేడాది రూ.500 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.390.50 కోట్లకు పరిమితం చేసింది. నేషనల్ షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహా ప్రభుత్వ రంగ కార్పొరేషన్లకు రూ.215 కోట్లు ప్రకటించింది. సామాజిక న్యాయం, సాధికారత శాఖకు గతేడాది రూ.7,750 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.7,800 కోట్లు చేసింది. వికలాంగుల సాధికారత శాఖకు బడ్జెట్‌ను 7 శాతం పెంచింది. 201819లో రూ.1,070 కోట్లివ్వగా ఈసారి రూ.1,140 కోట్లు ప్రకటించింది.

కొత్త కొత్త కేటాయింపులు

మాన్యువల్ స్కావెంజర్లకు స్వయం ఉపాధి పథకం కింద రూ. 30 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. వృద్ధులకు సేవలందించే స్వచ్ఛంద సంస్థలకు చేయూతనిచ్చేందుకు రూ.105 కోట్లు.. డ్రగ్స్, ఆల్కహాల్ నివారణ పథకం కింద రూ.105 కోట్లు ప్రకటించింది. బెగ్గర్ల పునరావాస పథకానికి రూ. 5 కోట్లు, ట్రాన్స్‌జెండర్స్ పథకానికి రూ. 1 కోటి కేటాయించింది. ఓబీసీలకు సేవలందించే స్వచ్ఛంద సంస్థలకు రూ. 30 కోట్లు ప్రకటించింది. ఎస్సీ స్టూడెంట్ల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కేటాయింపులు రూ. 125 కోట్ల నుంచి రూ.355 కోట్లకు పెరిగాయి. అపరిశుభ్ర, ఆరోగ్యానికి హాని కలిగించే వృత్తులు చేస్తున్న చిన్నారులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం రూ. 5 కోట్లను కేంద్రం కేటాయించింది. వికలాంగులకు కేటాయింపులు రూ. 1,070 కోట్ల నుంచి రూ.1,144 కోట్లకు పెరిగాయి.



న్యాయ శాఖకు రూ.666 కోట్లు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు న్యాయ శాఖకు బడ్జెట్‌లో రూ.666.66 కోట్లు కేటాయించారు. ఎన్నికల సమయంలో సిబ్బంది, వారికి సంబంధించిన సామగ్రిని తరలించేందుకు హోం శాఖకు కూడా కొంత మొత్తం కేటాయించారు. ఈసీకి రెవెన్యూ సెక్షన్ కింద 12.14 కోట్లు, ఓటర్ అవగాహన కార్యక్రమాలకు క్యాపిటల్ సెక్షన్ కింద రూ.16.67 కోట్లు కేటాయించారు.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)

మధ్యంతర బడ్జెట్ 2019–20

	2017-18 వాస్తవ గణాంకాలు	2018-19 బడ్జెట్ అంచనాలు	2018-19 సవరించిన అంచనాలు	2019-20 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ వసూళ్లు	14,35,233	17,25,738	17,29,682	19,77,693
మూలధన వసూళ్లు	7,06,742	7,16,475	7,27,553	8,06,507
మొత్తం వసూళ్లు	21,41,975	24,42,213	24,57,235	27,84,200
మొత్తం వ్యయం	21,41,975	24,42,213	24,57,235	27,84,200
రెవెన్యూ లోటు	4,43,602	4,16,034	4,10,930	4,70,214
ద్రవ్య లోటు	5,91,064	6,24,276	6,34398	7,03,999
ప్రాథమిక లోటు	62,112	48,481	46,828	38,938



రూ.6 వేలు విదిలించి.. అన్నదాతను అవమానించారు!



- 'కిసాన్ సమ్మాన్ నిధి'పై రైతు సంఘాల మండిపాటు
- చీప్ రేటుకు ఓట్లు కొనే ప్రయత్నమన్న యోగేంద్ర యాదవ్
- కేసీఆర్ 'రైతుబంధు' ఎంతో నయం: రైతు స్వరాజ్య వేదిక

శిఖోపూర్ (హరియాణ) : బడ్జెట్‌లో భాగంగా మోడీ సర్కార్ 'కిసాన్ సమ్మాన్ నిధి' పేరుతో కొత్త జుమ్లాకు తెరలేపిందని, ఈ పథకం రైతుల్ని అవమానపర్చేలా ఉందని రైతు సంఘాలు అభిప్రాయపడ్డాయి. తొమ్మిది రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాలు శుక్రవారం హరియాణలోని శిఖోపూర్‌లో సమావేశమై సంయుక్త ప్రకటన చేశాయి. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే స్కీం వర్తిస్తుందన్న ప్రభుత్వం.. కౌలు రైతులు, పోడు వ్యవసాయం చేసుకునే ఆదివాసీలు, సొంత భూమి లేనివాళ్లు, పట్టాలు లేని భూముల్ని దున్నుకుంటోన్న లక్షలాది మంది సామాన్య రైతులను పరిగణనలోకి తీసుకోకపోవడం విచారకరమని రైతు సంఘాల నాయకులు అన్నారు. విపత్తు సమయంలో లోన్ రీషెడ్యూల్ చేసుకున్నవారికే వడ్డీ మాఫీ వర్తిస్తుందని చెప్పడం సరికాదని, అలాంటి రైతులు ఒక శాతానికి మించి ఉండరని జై కిసాన్ ఆందోళన్ కన్వీనర్ అవిక్ సాహా అన్నారు.

చీప్ రేటుకు ఓట్లు కొనే యత్నం

రైతుల ఓట్లను గంపగుత్తగా దక్కించుకోవాలన్న ఉద్దేశంతోనే బడ్జెట్‌లో 'కిసాన్ సమ్మాన్ నిధి'ని హడావుడిగా ప్రకటించారని స్వరాజ్ ఇండియా అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ విమర్శించారు. "2018 డిసెంబర్ నుంచే పథకం వర్తిస్తుందని ప్రభుత్వం చెప్పడం ఎత్తుగడలో భాగం. ఎన్నికల నాటికి ప్రతి రైతుల అకౌంట్‌లో తలా 2 వేల రూపాయలు డిపాజిట్ చేసేస్తే, ఓట్లు వాటంతట అవే రాలతాయన్నది మోడీ ప్లాన్. రైతుల్ని బిచ్చగాళ్లుగా భావిస్తున్నది కాబట్టే ఎన్డీఏ సర్కార్ ఇలాంటి పథకానికి తెరలేపింది. రైతులు మోడీకి కచ్చితంగా గుణపాఠం చెబుతారు'' అని యోగేంద్ర అన్నారు.

రైతుబంధు ఎంతో మేలు

మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ నిధి పథకం కంటే తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకమే నయమని రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ కిరణ్‌కుమార్ విస్సా అన్నారు. హరియాణాలో జరిగిన సమావేశానికి తెలంగాణ నుంచి హాజరైన ఆయన.. మోడీ, కేసీఆర్ పథకాల్లోని ప్రాథమిక వ్యత్యాసాలను వివరించారు. 'ఎన్డీఏ ప్రభుత్వం ఒక రైతు కుటుంబానికి 6 వేలు మాత్రమే ఇస్తామంటోంది. అదే తెలంగాణలో రైతుబంధు ద్వారా ఒక రైతుకు ఒక ఎకరాకు ఏటా రూ.10 వేల పెట్టుబడి సహాయం అందిస్తున్నారు. అంటే, ఐదెకరాలున్న రైతుకు ఏటా రూ.50 వేల సాయం దక్కుతోంది. పెరిగిన సాగు ఖర్చుతో పోల్చుకుంటే ఈ సాయం ఎంతో కొంత ఉపశమనం ఇచ్చేదే. మరి మోడీ ఇస్తానంటోన్న రూ.6వేలు ఏమూలకు?' అని కిరణ్ కుమార్ ప్రశ్నించారు.

వాగ్దానాలు గంగపాలు

పాడి పరిశ్రమ, పశు సంరక్షణ కోసం రూ.10,881 వేల కోట్లు వెచ్చిస్తామని వాగ్దానం చేసిన మోడీ సర్కార్.. బడ్జెట్‌లో కేవలం రూ.440 కోట్లు మాత్రమే విదిల్చి చేతులు దులుపుకుందని స్వాభిమాని షెత్కారీ సంఘటన కన్వీనర్ యోగేశ్ పాండే విమర్శించారు. చెరుకు రైతులకు చెల్లించాల్సిన బకాయిల విలువ రూ.11 వేల కోట్లు దాటిపోయినా, బడ్జెట్ ప్రసంగంలో ఆ ప్రస్తావన చేయలేదన్నారు. ఫసల్ బీమా యోజన ద్వారా దేశంలో 50 శాతం మంది రైతులకు బీమా కవరేజీ అందించాలనుకున్నా, ఇప్పటికీ 29 శాతం మందికి మించి కవరేజ్ అందించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. బడ్జెట్ ప్రాధాన్యత క్రమంలో దేశవ్యాప్తంగా 22వేల రూరల్ మార్కెట్లు నెలకొల్పుతానన్న ప్రభుత్వం ఇప్పటిదాకా 85 మార్కెట్లను మాత్రమే ఏర్పాటు చేసిందని పాండే వివరించారు. కనీస మద్దతు ధరలు, ఆదాయం, బీమా, రుణభారం.. వీటిలో ఏ ఒక్క సమస్యనూ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

రక్షణకు 3.18 లక్షల కోట్లు



- సైనికులకు అలవెన్సుల పెంపు
- ఓఆర్ఓపీకి 35 వేల కోట్లు ఇచ్చామన్న ఆర్థిక మంత్రి
- ఆయుధాల కోసం లక్ష కోట్లే

న్యూఢిల్లీ

దేశ చరిత్రలో తొలిసారిగా రక్షణ బడ్జెట్ మూడు లక్షల కోట్లు దాటింది. దేశ రక్షణ కోసం 3,18,931 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్‌గోయల్ ప్రకటించారు. ఇది ప్రస్తుత 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తానికంటే 20 వేల కోట్లు(దాదాపు 6.87 శాతం) ఎక్కువ. సరిహద్దుల్లో శాంతి, భద్రతలను కాపాడేందుకు ఇంకెన్ని నిధులు కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు గోయల్ పేర్కొన్నారు. 2017 బడ్జెట్ తో ప్రపంచంలో రక్షణపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న ఐదో దేశంగా ఇండియా అవతరించింది. నాటి నుంచి రక్షణకు కేటాయింపు పెరుగుతోంది. 40 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న వన్ ర్యాంక్ వన్ పెన్షన్(ఓఆర్ఓపీ) కలను నెరవేర్చుతామన్న 2014 హామీ నిలబెట్టుకున్నామని గోయల్ చెప్పారు. ఓఆర్ఓపీ కింద సైనికులకు 35 వేల కోట్ల రూపాయల్ని అందజేసినట్లు వెల్లడించారు. సైనికులకు మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్పీ)ని, ప్రమాదకర బాధ్యతల్ని నిర్వర్తించే వాయు సేన, నౌక దళాల ఆఫీసర్ల ఇచ్చే స్పెషల్ అలవెన్సులను పెంచుతున్నట్లు తెలిపారు. 2014-15 మధ్యంతర బడ్జెట్లో నాటి యూపీఏ సర్కారు సైనికుల సంక్షేమానికి కేవలం రూ.500 కోట్లను విదిలించిందని మండిపడ్డారు.

ఆయుధాల కొనుగోళ్లకు లక్ష కోట్లే..

2019-20లో కొత్త ఆయుధాలు, యుద్ధ నౌకలు, జెట్ విమానాలు తదితర మిలటరీ కొనుగోళ్లకు రూ.1,08,248 కోట్లను సర్కారు కేటాయించింది. గతేడాది ఇది రూ. 93,932 కోట్లు. కేంద్రం కేటాయించిన లక్ష కోట్లలో ఆర్మీకి రూ.29,447 కోట్లు, నేవీకి రూ.23,156 కోట్లు, వాయుసేనకు రూ.39,902 కోట్లు దక్కుతాయి. దేశ రక్షణ అవసరాలకు కేంద్రం కేటాయించిన లక్ష కోట్లు అస్సలు సరిపోవని డిఫెన్స్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పొరుగున ఉన్న చైనా, పాకిస్తాన్ కొత్త ఆయుధాలను వేగంగా సమకూర్చుకుంటున్న ఈ తరుణంలో రక్షణ శాఖకు తక్కువ నిధులివ్వడం పొరపాటని డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్ కు చెందిన డా. లక్ష్మణ్ బెహరా అన్నారు.

2 లక్షల కోట్లు జీతాలే

బడ్జెట్లో రక్షణ రంగానికి కేంద్రం కేటాయించిన మూడు లక్షల కోట్లలో రెండు లక్షల కోట్లు జీతభత్యాలకే పోనున్నాయి. జీతాలు, మెయింటెన్స్ కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2,10,682 కోట్లను సర్కారు ఇచ్చింది. గతేడాది ఇచ్చిన శాలరీల మొత్తం రూ.1,88,118 కోట్లుగా ఉంది.

హోంశాఖకు భారీగా...

న్యూఢిల్లీ: కేంద్ర హోం శాఖకు కేటాయింపులు మొదటిసారి లక్ష కోట్ల మార్క్ దాటాయి. 2019-20 సంవత్సరానికి హోంశాఖకు రు.1,03,927 కోట్లు కేటాయించారు. 2018-19లో కేటాయించిన రూ. 99,034 కోట్ల కంటే ఇది 4.9 శాతం ఎక్కువ. దేశ రాజధానిలో శాంతి భద్రతల కోసం ఢిల్లీ పోలీసులకు రూ. 7,496 కోట్లు, ఇండో-పాక్, చైనా-ఇండియా సరిహద్దుల వద్ద మౌలిక వసతుల కల్పనకు రూ.2వేల కోట్లు కేటాయించారు. జమ్మూకాశ్మీర్‌లో యాంటీమిలటరీ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సీఆర్‌పీఎఫ్‌కు రూ.23,742 కోట్లు, ఇండో-పాక్, ఇండో-బంగ్లా బోర్డర్ సెక్యూరిటీ కోసం 19,647 కోట్లు ఇచ్చారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్‌ఎఫ్, సశస్త్ర సీమాబల్, అస్సాం రైఫిల్స్, ఎన్‌ఎస్‌జీతో పాటు కేంద్ర రక్షణ బలగాలన్నింటికీ కలిపి 71,618 కోట్లు కేటాయించారు. వీటికి గత బడ్జెట్‌లో ఇచ్చింది 67,779 కోట్లు. ఇంటెలిజెన్స్ బ్యూరోకు 2,198 కోట్లు, ప్రధాన మంత్రి, మాజీ ప్రధానుల రక్షణ, వారి బంధువుల సెక్యూరిటీకి నియమించే ఎస్పీజీకి రూ.530 కోట్లు కేటాయించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

బడ్జెట్‌లో 5,117 కోట్లు పోలీసు మౌలిక సదుపాయల కల్పనకు కేటాయించారు. ఈ నిధులను బ్యారక్‌ల నిర్మాణం, గృహ సముదాయాలు, వాహనాల కొనుగోలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి కొనుగోలుకు వినియోగిస్తారు. బలగాల ఆధునీకరణకు రూ.3,378 కోట్లు, సరిహద్దు మౌలిక వసతుల కల్పనకు 2 వేల కోట్లు, మహిళల రక్షణ, సాధికారతకు 1,330 కోట్లు, బోర్డర్ ఏరియా డెవలప్‌మెంట్‌కు రూ.825 కోట్లు ఇచ్చారు.

ప్రభాత
వెలుగు
Follow: v6velugu
05
శనివారం | హైదరాబాద్
02.02.2019
www.v6velugu.com



బ్యాలెట్ బడ్జెట్ 2019-20

ఇది ట్రైలర్ మాత్రమే

అభివృద్ధికి ఈ బడ్జెట్ దారి చూపుతుంది

అన్నివర్గాలకు లాభం: ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్ ట్రైలర్ మాత్రమేనని, లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ఇది మార్గదర్శనం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ‘ఈ బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనాలు కల్పిస్తుంది. 12 కోట్ల మంది రైతులు, 3 కోట్ల మధ్య తరగతి కుటుంబాలు, 30 కోట్ల నుంచి 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు లాభం కలుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పేదరికం రేటు రికార్డు స్థాయిలో పడిపోయింది. నవ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ బడ్జెట్ సాయం చేస్తుంది‘ అని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ఈ బడ్జెట్‌లో ప్రతిఫలించాయని కొనియాడారు. రైతుల నుంచి మధ్యతరగతి ప్రజలవరకు, ఆదాయ పన్ను మినహాయింపు నుంచి మౌలిక వసతుల వరకు, తయారీ రంగం నుంచి ఎంఎస్ఎంఈల వరకు, హౌసింగ్ నుంచి హెల్త్ కేర్ వరకు బడ్జెట్ ప్రతిపాదనల రూపంలో చేరాయని పేర్కొన్నారు. ఆదాయ పన్ను మినహాయింపులు పొందిన మధ్యతరగతి ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధిలో వారి పాత్ర కీలకమన్నారు. పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని మీడియాతో మాట్లాడారు. రైతుల కోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు చాలా స్కీమ్ లు తీసుకొచ్చాయని, అయితే ఎక్కువ మంది వాటి పరిధిలోకి రాలేదని తెలిపారు. ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందే ప్రధాన మంత్రి కిసాన్ నిధి పథకం చరిత్రాత్మక అడుగు అని కొనియాడారు. శ్రమ్ యోగి మాన్ ధన్ యోజన కింద అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనం చేకూరుతుందన్నారు. అన్నివర్గాలకు అండగా, ఆర్థిక వృద్ధిని పెంపొందించేలా బడ్జెట్ ఉందని ఆయన పేర్కొన్నారు.



సినిమా షూటింగ్ ఈజీ

సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు

స్వదేశీ సినిమాలకు సింగిల్ విండో పద్ధతిలో షూటింగ్‌లకు అనుమతులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటివరకు విదేశీ సినిమాలకు మాత్రమే ఇలాంటి అనుమతులు ఉన్నాయని పీయూష్‌గోయల్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ‘ఎంటర్‌టైన్మెం ట్ ఇండస్ట్రీ ద్వారా ఎందరికో ఉపాధి లభిస్తోంది. ఆ రంగానికి కేంద్రం అన్నిరకాలుగా సహకారం అందిస్తోంది. ఈ క్రమంలో సినిమా షూటింగ్‌ల కోసం మన సినీ నిర్మాతలకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తాం. దీని వల్ల సినిమా చిత్రీకరణ సజావుగా సాగిపోతుంది’ అని అన్నారు. సినిమా టికెట్లపై జీఎస్టీని కూడా 12 శాతానికి తగ్గిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. పైరసీని అరికట్టేందుకు సినిమాటోగ్రఫి చట్టం పరిధిలోకి యాంటీ కామ్ కార్డింగ్ ప్రొవిజన్ యాక్ట్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించారు. కేంద్రం ప్రకటనపై సినీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. షూటింగుల కోసం పర్మిషన్లు దొరకడం కష్టమవుతున్న తరుణంలో ఇది ఎంతో మేలు చేకూరుస్తోందంటున్నారు. పైరసీని అరికట్టేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మధు బండార్కర్ , వివేక్ అగ్నిహోత్రి, అశోక్‌పండిట్ వంటి వారు ట్వీట్ చేశారు.



మోడీ జై కిసాన్!

‘రైతుబంధు’ మోడల్‌లో ‘పీఎంకిసాన్’ పథకం

- ఐదెకరాల లోపు రైతులకు ఏటా రూ.6 వేలు
- 12 కోట్ల మందికి లబ్ధి
- మూడు విడతలుగా నేరుగా ఖాతాల్లో జమ
- 2018 డిసెంబర్ నుంచే అమలు
- విపత్తుల సమయంలో పంట రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ
- సకాలంలో రుణాలు చెల్లిస్తే మరో 3 శాతం రాయితీ
- పాడి, మత్స్య రైతులకూ కిసాన్ కార్డులు, రుణాలు
- ఆవుల కోసం ‘రాష్ట్రీయ కామధేను ఆయోగ్’

సాగు మొత్తం బడ్జెట్
1,40,763 కోట్లు

బడ్జెట్‌లో 75 వేల కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ: అందరూ ఊహించినట్టే మోడీ సర్కారు ‘జై కిసాన్’ నినాదాన్ని ఎత్తుకుంది! పెద్దనోట్ల రద్దుతో కుదేలైన వ్యవసాయ రంగంపై వరాల జల్లు కురిపించింది. ఎన్నికల ముంగిట రైతులను ఆకట్టుకునేందుకు బడ్జెట్‌లో రైతుబంధు తరహాలో కొత్త పథకాన్ని ప్రకటించింది. ఐదెకరాల లోపు భూమి ఉన్న అన్నదాతలకు ఏటా రూ.6 వేలు అందజేస్తామని తెలిపింది. ఈ సొమ్మును మూడు విడతల్లో నేరుగా రైతు ఖాతాల్లో జమచేస్తామని పేర్కొంది. ‘ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి’(పీఎంకిసాన్) పేరిట తెచ్చిన ఈ స్కీంను 2018 డిసెంబర్ నుంచే అమల్లోకి వస్తుందని చెప్పింది. దీనికి బడ్జెట్‌లో ఏకంగా రూ.75 వేల కోట్లు కేటాయించింది. శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ ఈ మేరకు ప్రకటన చేశారు. వ్యవసాయం, రైతుల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో మొత్తంగా రూ.1,40,763 కోట్లు కేటాయించారు. ‘‘రైతుల కష్టాలను తీర్చేందుకే కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తెస్తున్నాం. ఐదెకరాల లోపు రైతులకు ఏటా రూ.6 వేలను మూడు విడతలుగా నేరుగా వారి ఖతాల్లోనే జమచేస్తాం. దీనికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నిధుల్ని వెచ్చిస్తుంది’’ అని ఆయన చెప్పారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 12 కోట్ల సన్న, చిన్నకారు రైతులు లబ్ధి పొందనున్నారు. తొలి విడతలో భాగంగా 2018 డిసెంబరు 1 నుంచి ఈ ఏడాది మార్చి మధ్య కాలానికి రూ.2 వేలు రైతుల ఖాతాలో జమ కానుంది. ఈ పథకం కింద రైతులకు అందించేది ఏడాదికి రూ.6 వేలు. అంటే నెలకు రూ.500. పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో ఇది ఏ మూలకు అని వ్యవసాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇలాగైతే 2022 నాటికి రైతు ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేస్తారని అంటున్నారు.

విపత్తుల సమయంలో వడ్డీ రాయితీ

పంట రుణాల్లో రైతులకు రిలీఫ్ కల్పించేందుకు కూడా పీయూష్ గోయల్ పలు చర్యలను ప్రకటించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రుణాలు చెల్లించడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. వరదలు, వర్షాభావం వంటి సమయాల్లో పంట రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ ఇస్తామన్నారు. వ్యవసాయ రైతులతోపాటు పాడి, మత్స్య రైతులకు ఈ రాయితీని వర్తింపజేస్తామని చెప్పారు. అలాగే సకాలంలో పంట రుణాలు చెల్లిస్తే మరో 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తామన్నారు. పాడి, మత్స్య రైతులకూ కిసాన్ కార్డులు అందజేసి రుణాలు అందిస్తామని వెల్లడించారు.

ఆవుల పథకానికి 750 కోట్లు

దేశంలో గో సంపదను పెంచే దిశగా పీయూష్ గోయల్ బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రకటించారు. పాల ఉత్పత్తిని పెంచడం, ఆవుల సంరక్షణ చట్టాలు, నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు ‘రాష్ట్రీయ కామధేను ఆయోగ్’(నేషనల్ కౌ కమిషన్) ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నాణ్యమైన జాతి ఆవుల ఉత్పత్తికి కూడా ఆయోగ్ చర్యలు తీసుకుంటుందన్నారు. గోవుల కోసం ఇప్పటికే తెచ్చిన రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు రూ.750 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పారు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌తోపాటు కాంగ్రెస్ పాలిత మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు ఇప్పటికే గోవుల కోసం ప్రత్యేక పథకాలు తెచ్చాయి. చేపలు, రొయ్యలు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు మత్స్య శాఖకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని గోయల్ చెప్పారు. చేపల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా 1.45 కోట్ల మంది ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు.

‘రైతుబంధు’ వెనుక!

గ్రామీణ ప్రాంతాల్లో మోడీ ప్రభుత్వంపై వ్యతిరేకత వల్లే ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఓటమిపాలైందన్న విశ్లేషణలు వచ్చాయి. గిట్టుబాటు ధరల కోసం కొన్ని రాష్ట్రాల్లో రైతులు రోడ్డెక్కారు. కిందటేడాది రాజధాని ఢిల్లీని ముట్టడిచేందుకు రైతులంతా మూకుమ్మడిగా కదిలారు. కొద్దినెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలన్నీ బీజేపీ నేతల్లో ఆందోళనను పెంచాయి. దీనికితోడు పలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఇప్పటికే రైతు రుణమాఫీ హామీలిచ్చాయి. ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు తెలంగాణ తరహాలో రైతుబంధు స్కీంను ప్రకటించాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కూడా రైతన్నను ప్రసన్నం చేసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అందుకే అన్నదాతలకు నేరుగా నగదు సాయం చేసేందుకు రైతుబంధు తరహా పథకం ప్రకటించారని అంటున్నారు.

అతి ఎక్కువ పదాలున్న బడ్జెట్ ప్రసంగం 1991లో మన్మోహన్‌సింగ్ చేశారు. అందులో 18,520 పదాలున్నాయి.

1952లో సీడీ దేశ్‌ముఖ్ అతి తక్కువ పదాలున్న బడ్జెట్ ప్రసంగంచేశారు. అందులో 4,454 పదాలు ఉన్నాయి.

లాంగెస్ట్ బడ్జెట్ స్పీచ్2 గంటల 13 నిమిషాలు. 2003లో ఆర్థిక మంత్రి జస్వంత్‌సింగ్ ఈ ప్రసంగం చేశారు.

1997–98లో అసలు ఎటువంటి చర్చా లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించారు. అప్పటి ప్రధాని ఐకే గుజ్రాల్ రాజీనామా చేయడంతో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడింది. దీంతో కేంద్ర బడ్జెట్‌ను ఆమోదించడానికి ప్రత్యేకంగా పార్లమెంట్‌ను సమావేశపరిచారు.



ఎకరాకు రూ.12 వేలు ఇవ్వాలి

ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రూ.6 వేల సాయం చేస్తామని పేర్కొన్నారు. ఇవి సరిపోవు. ఎకరాకు రూ.12వేలు ఇవ్వాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి.

- సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ ప్రధాన కార్యదర్శి



ఈ బడ్జెట్ కు విలువ లేదు

ఈ మధ్యంతర బడ్జెట్ కు విలువ లేదు. దీన్ని ఎవరు అమలు చేస్తారు. కొత్త ప్రభుత్వం దీన్ని అమలు చేస్తుందా? నాలుగేళ్లలో రైతుల కోసం సింగిల్ అజెండాను కూడా ఎందుకు ప్రకటించలేదు?

మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం



ప్రధాని దూరదృష్టికి నిదర్శనం

ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టికి నిదర్శనం. ఆదాయ పన్ను పరిమితి రూ.5 లక్షలకు పెంచడం సాహసోపేతమైన నిర్ణయం. దీని వల్ల మధ్యతరగతికి ఎంతో మేలు చేకూరుతుంది.

- కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర ప్రెసిడెంట్



ఓట్ల కోసమే ఈ బడ్జెట్

రాబోయే ఎన్నికల కోసమే కేంద్రం ఈబడ్జెట్‌ను ప్రవేశ పెట్టినట్లుంది. పేదల సంక్షేమాన్ని పట్టించుకోకుండా బడాబాబులకు ఐటీ తగ్గించి బీజేపీ వ్యాపారస్థుల పార్టీ అని మరోసారి నిరూపించింది. కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడితే, బీజేపీ నిర్వీర్యం చేసుకుంటూ వస్తోంది.

- పొన్నం ప్రభాకర్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్.

సన్న రైతు ఖుష్

గుంట భూమి ఉన్నా కేంద్ర పథకం కింద ఏడాదికి రూ.6 వేలు

తెలంగాణలో ఐదెకరాలలోపు ఉన్నోళ్లు 47 లక్షల మంది

- ఎకరంలోపు ఉన్నవారు 14.86 లక్షలు
- వారందరికీ కేంద్రం నుంచి రూ.2,824 కోట్ల లబ్ధి
- మొదటి విడతగా రూ.941.53 కోట్ల సాయం
- మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ



హైదరాబాద్, వెలుగు: కేంద్రం ప్రకటించిన ‘కిసాన్ సమ్మాన్ నిధి’ పథకం కింద తెలంగాణ రైతులకు రూ.2,824 కోట్ల మేర లబ్ధి చేకూరే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఐదెకరాల లోపు 47 లక్షల 8 వేల మంది రైతులున్నారని వారంతా ఈ స్కీమ్‌కు అర్హులవుతారని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సి.పార్థసారథి చెప్పారు. ఈ లెక్కన మొత్తంగా మన రైతుల ఖాతాల్లోకి రూ.2,824 కోట్లు చేరుతాయని, 2018 డిసెంబర్ నుంచే పథకం అమల్లోకి వస్తున్నందున మొదటి విడతగా రూ.941.53 కోట్లు రానున్నాయి. కేంద్రం పథకంతో తక్కువ భూమి ఉన్న రైతులకు ఎక్కువ లబ్ధి చేకూరే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు కింద ఎలాంటి స్లాబ్ లేకుండా ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.4 వేల చొప్పున అమలు చేస్తోంది. అంటే భూమి ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ లబ్ధి చేకూరుతోంది. గుంట భూమికి రూ.100, పది గుంటలకు రూ.వెయ్యి సాయం చొప్పున సాయం అందేది. కానీ కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కేంద్రం స్లాబ్ విధించింది. ఐదెకరాల లోపున్న రైతులే దీనికి అర్హులు. పంటలు, భూమితో సంబంధం లేకుండా రూ.6 వేలు ఇవ్వాలని ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఎంత తక్కువ భూమి ఉన్నా రూ.6 వేల లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 14.86 లక్షల మంది ఉన్నారు. వారందరికీ రూ.6 వేల చొప్పున రూ.891.49 కోట్ల లబ్ధి చేకూరనుంది. ఎకరం నుంచి ఐదెకరాల లోపున్నవారు 32.22 లోల మంది ఉన్నారు. వారికి కూడా రూ.6 వేల సాయం అందనుంది. రాష్ట్రంలో ఐదెకరాల కంటే ఎక్కువ వ్యవసాయ భూమి ఉన్నవారు 7 లక్షలకు పైగా ఉన్నారు. వారికి కేంద్రం సాయం అందే అవకాశం లేదు.

రెండు వైపులా సాయం?

కేంద్ర పథకం రాష్ట్ర ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేకుండా రైతుల ఖాతాలో నేరుగా నగదు సాయం అందిస్తామని ప్రకటించింది. అంటే రైతులకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వేర్వేరుగా సాయం అందే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

రుణమాఫీపై దక్కని ఊరట

రైతులకు కేంద్రం ఎలాంటి రుణమాఫీ ప్రకటించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఉపశమనం లభించలేదు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ ప్రకటించింది. ఇందుకు దాదాపు రూ.20 వేల కోట్లు అయ్యే అవకాశం ఉంది. రైతుబంధు సాయాన్ని కూడా రూ.4 వేల నుంచి రూ.5 వేలకు పెంచింది. దీనికి 2019-20 బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించాలని భావిస్తోంది. గతేడాది రైతుబంధు పథకానికి బడ్జెట్లో రూ.12 వేల కోట్లు కేటాయించింది. రుణమాఫీ, రైతుబంధు పథకాలకు మొత్తంగా రూ.40 వేల కోట్లు అవసరమయ్యే అవకాశం ఉంది. కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద నిధులను కేంద్రం తామే అందజేస్తామని చెప్పడంతో రాష్ట్రానికి ఈ బడ్జెట్ ద్వారా ఎలాంటి ఉపశమనం లభించలేదని చెబుతున్నారు.

కేంద్ర పథకంతో మన రైతులకు ప్రయోజనం ఇలా..

ఎకరాలు	రైతులు (లక్షల్లో)	మెదటి విడత (రూ.2వేలు) కోట్లలో	మొత్తం (రూ.6 వేలు)
0-1	14.86	297.16	891.49
1-2	13.37	267.47	802.4
2-3	8.96	179.23	537.69
3-4	5.75	115.02	345.06
4-5	4.13	82.65	247.94
మొత్తం	47.08	941.53	2,824.59

పానం బాగైతది!

- బడ్జెట్‌లో ఆరోగ్యానికి ప్రాధాన్యం
- గతేడాది కన్నా 16% ఎక్కువ నిధులు

న్యూఢిల్లీ: ఆరోగ్యరంగానికి కేంద్రప్రభుత్వం ఈసారి (2019-20) భారీగా నిధులు కేటాయించింది. గతేడాది కన్నా 16 శాతం ఎక్కువ నిధులిచ్చింది. 2018-19లో రూ.52,800 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ. 61, 398 కోట్లకు పెంచింది. ఇందులో రూ.6,400 కోట్లను ఆయుష్మాన్ భారత్‌లో భాగమైన ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై)కు ఖర్చు చేయనున్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్, అండ్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు జాతీయ పట్టణ ఆరోగ్య కార్యక్రమం కింద రూ. 250 కోట్లు, జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం కింద రూ.1,350 కోట్లను వెచ్చించనున్నారు. ఇక జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్‌ఎం)కు గతేడాదికన్నా 3 శాతం ఎక్కువగా రూ.31,745 కోట్లను కేంద్రం ప్రకటించింది. నేషనల్ ఎయిడ్స్ అండ్ ఎస్టీడీ కంట్రోల్ ప్రోగ్రామ్‌కు రూ.2,500 కోట్లు కేటాయించింది. ఎయిమ్స్ కేటాయింపులను రూ. 3,018 కోట్ల నుంచి రూ. 3599.65 కోట్లకు పెంచింది. వృద్ధుల ఆరోగ్యానికి సంబంధించిన నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ హెల్త్‌కేర్ ఫర్ ఎల్డర్లీకి రూ. 105 కోట్లు ఇచ్చింది. ఎన్‌హెచ్‌ఎంలోని రాష్ట్రీయ స్వాస్థ్ బీమా యోజన (ఆర్ఎస్‌బీవై)కు ఈ బడ్జెట్‌లో భారీగా నిధులు తగ్గించింది. గతేడాది రూ.2 వేల కోట్లు ఇస్తే ఈసారి రూ.156 కోట్లతో సరిపెట్టింది.




ఆయుష్‌కు రూ.1,739 కోట్లు

ఆయుష్ శాఖకు కేటాయింపులు పెరిగాయి. గతేడాదితో పోలిస్తే 6.9% ఎక్కువ నిధులను కేంద్రం ప్రకటించింది. రూ.1,739.76 కేటాయించింది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (న్యూఢిల్లీ)కు రూ.40 కోట్లు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి(కోల్‌కతా)కి రూ. 50 కోట్లను ప్రకటించింది. ఆయుష్ డెలివరీ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు బడ్జెట్‌ను రూ.71.36కోట్ల నుంచి రూ.92.31 కోట్లకు పెంచింది.


మహిళా సాధికారతకు ప్రాధాన్యం

అంగన్‌వాడీలకు రూ.19,834.37 కోట్లు

న్యూఢిల్లీ: మహిళ, శిశు సంక్షేమ శాఖకు మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం రూ. 29,164.90 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 24,758.62 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఈ సారి 20శాతం పెంచింది. మొత్తం కేటాయింపుల్లో అధిక భాగం రూ.19,834.37 కోట్లను అంగన్‌వాడీల సంక్షేమానికి ఖర్చు చేయనున్నారు. ‘ప్రధాన మంత్రి మాతృవందన యోజన’ పథకానికి రూ.2,500 కోట్లు కేటాయించారు. చైల్డ్‌ప్రొటక్షన్ సర్వీస్‌ప్రోగాంకు రూ.1500 కోట్లు కేటాయించారు. ‘బేటీ బచావో, బేటీ పడావో’ కు రూ.280 కోట్లు కేటాయించగా .. నేషనల్‌న్యూట్రీషన్‌మిషన్‌కు రూ.3,400 కోట్లను కేటాయించారు. మహిళా శక్తి కేంద్రాలకు కేటాయించే నిధులను రూ.150కోట్లకు పెంచా రు. నేషనల్‌క్రచ్‌స్కీంకు రూ.50కోట్లు, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌స్కీంకు రూ.165 కోట్లు(గతంలో కంటే మూడు రెట్లు అధికం) కేటాయించారు. ఉజ్వలకు రూ.30కోట్లు, ఒంటరి మహిళల రక్షణ గృహాలకు రూ.15కోట్లు, మహిళా సాధికారతకు రూ.1330 కోట్లు కేటాయించారు.




ప్రత్యేక
వెలుగు
Follow: v6velugu



బ్యాలెట్ బడ్జెట్ 2019-20


బడ్జెట్ మెలికలు

ఐదేళ్ల పాలనలో జనాకర్షణ పథకాలకు దూరంగా ఉన్న మోడీ సర్కారు ఒకేసారి భారీ పథకాలతో చివరి బడ్జెట్ తెచ్చింది. ముందుగా ఊహించినట్లుగానే రైతు సాయం, ఐటీ మినహాయింపులతో పాటు మరికొన్ని నిర్ణయాలను ప్రకటించింది. మధ్యంతర బడ్జెట్ అంటూనే కీలక ప్రతిపాదనలు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కావడం వల్ల ఒకరకంగా ఇది ఎన్నికల తర్వాత అమలు చేసే మేనిఫెస్టోలాంటి బడ్జెట్ గా ఉందంటున్నారు ఆర్థిక నిపుణులు. ప్రత్యేకంగా రైతులు, దిగువ మధ్యతరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకొని ప్రకటించిన నిర్ణయాలు ఆ వర్గాలను ఎంత వరకు ఆకట్టుకుంటాయన్నదే మోడీ సర్కారు భవిష్యత్ ను తేల్చనుంది. ఇప్పటికే పలు సర్వేల్లో హంగ్ పార్లమెంట్ అంచనాలు రావడంతో పట్టునిలబెట్టుకోవడానికి ఆకర్ష పథకాలను ప్రకటించింది కేంద్రం. అయితే వాటిలో కనిపిస్తున్న కొన్ని మెలికలు అమలు తీరు, ఫలితాలపై సందేహాలు రేపుతున్నాయి. - సెంట్రల్ డెస్క్



సాగు బడ్జెట్ తగ్గిందా? పెరిగిందా?

ఈసారి బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి మొత్తంగా లక్షా 29వేల 585 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇది గత ఏడాది బడ్జెట్ కంటే రూ.61వేల 785 కోట్లు ఎక్కువని ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. అయితే రైతుసాయం పథకం ప్రకటించడంతో వ్యవసాయ బడ్జెట్ తగ్గించినట్లు కనిపిస్తోంది. ఈ పథకానికి ఏడాదికి రూ.75వేల కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ గత ఏడాది సాగు బడ్జెట్ కంటే ఈసారి పెంచింది 61వేల కోట్లు మాత్రమే. ఈ లెక్కన సాగుబడ్జెట్ ను గత ఏడాది కంటే 14వేల కోట్ల వరకు తగించినట్లు భావిస్తున్నారు. అలాగే రైతు సాయం పథకానికి ప్రస్తుతానికి రూ.20వేల కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి చెప్పారు. అయితే ఈ పథకాన్ని డిసెంబర్ నుంచే అమలు చేయబోతున్నారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖర్చును వచ్చే ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో చెప్పడం ఆసక్తి రేపుతోంది.



మనీ.. రోమన్ దేవత

పైసలు, డబ్బు, సొమ్ము, రొక్కం.. ఇలా ఎన్నో పేర్లతో పిలుస్తుంటం. అదే ఇంగ్లిష్ల డబ్బులను 'మనీ (Money)' అంటం. మరి ఈ పేరు ఎట్లా వచ్చిందో తెల్సా. మనీ అనే పదం రోమన్ దేవత 'మొనెటా (Moneta)' పేరు నుంచి వచ్చింది. రోమన్ సామ్రాజ్యం కొనసాగిన కాలంలో రోమ్ నగరంలోని 'జునో మొనెటా' ఆలయం వద్ద ఖజానా ఉండేది. అక్కడే బంగారు, వెండి నాణాలనూ ప్రింట్ చేసేవారు. జునో దేవత రాజ్యాన్ని రక్షిస్తుందని, మొనెటా దేవత జ్ఞాపకశక్తిని, తెలివిని ఇస్తుందని రోమన్లు నమ్మేవారు. మొత్తంగా జునోమొనెటా ఆలయమే ఖజానాను కాపాడుతుందని విశ్వసించేవారు. ఈ క్రమంలోనే డబ్బుకు సంబంధించిన మోనిటరీ, మనీ, మింట్ (నాణాలను ప్రింట్ చేసే చోటు) వంటి పదాలు పుట్టాయని చరిత్రకారులు చెబుతున్నారు. 'జునో, మొనెటా' వేర్వేరు దేవతలని కొందరు, లేదు రెండూ ఒకే దేవత పేర్లు అని మరికొందరు వాదిస్తున్నారు. ఏదేమైనా ఆ దేవత పేరు నుంచే మనీ అనే పదం పుట్టిందనే దానిపై ఏకాభిప్రాయం ఉంది. యూరప్లోని చాలా దేశాలు తమ కరెన్సీ కాయిన్లపై 'జునో మొనెటా' దేవత చిత్రాన్ని ముద్రిస్తుండటం గమనార్హం.

రైతుకు సరిపోయే సాయమేనా?

మన రాష్ట్రంలో కేసీఆర్ తెచ్చిన రైతుబంధు తరహాలోనే దేశంలో చిన్న రైతులందరికీ పంట సాయం అందిస్తామని కేంద్రం ప్రతిపాదించింది. రాబోయే ఏడాదికి సంబంధించిన బడ్జెట్ అయినా సంప్రదాయానికి భిన్నంగా డిసెంబర్ నుంచే అమలు చేస్తామని ప్రకటించింది. దీంతో సరిగ్గా ఎన్నికలకు ముందు మార్చి నెలాఖరులో చిన్న రైతుల అకౌంట్లలో రూ.2వేలు వేసే అవకాశం ఉంది. అయితే అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే దీన్ని ఎలా అమలుచేస్తారన్న సందేహాలున్నాయి. మన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధు పథకం అమలు వద్దని చెప్పిన ఈసీ తర్వాత చెక్కులుగా ఇవ్వడానికి అనుమతించింది. మరోవైపు రాష్ట్రాల సహకారంతోనే కేంద్రం ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో రైతులకు రుణ మాఫీతో పాటు రైతుబంధు తరహా పథకాలను ప్రకటించారు. దీంతో కేంద్రం ఇచ్చే రూ. 2వేలు అన్నదాతలను ఎంత వరకు ఆకర్షిస్తుందన్నది ఆసక్తి రేపుతోంది. మన రాష్ట్రంలోనే రైతుబంధు కింద ఎకరాకు ఏడాదికి రూ.8వేలు ఇస్తుంటే ఇక నుంచి దాన్ని రూ.10వేలకు పెంచనున్నారు. దీంతో కేంద్రం ఒక రైతుకు ఏడాదిలో ఇచ్చే డబ్బు కంటే రాష్ట్రంలో ఒక్క ఎకరాకు ఇచ్చే డబ్బే ఎక్కువగా ఉంటుంది. ఇక ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోనూ రైతుబంధు తరహా పథకాలు ప్రకటించారు. కర్నాటకతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లలో రుణమాఫీలు చేశారు. మరోవైపు ఎకరంలోపు భూమి ఉన్నా, 5 ఎకరాల భూమి ఉన్నా ఒకేలా సాయం ఇస్తామనడం రైతులను ఎంత వరకు ఆకట్టుకుంటుందన్నది కూడా సందేహాలు రేపుతోంది.

రూపాయి తేడాతో రూ.35వేల పన్ను?

బడ్జెట్లో దిగువ మధ్య తరగతివారిని లక్ష్యంగా చేసుకొని చిరుద్యోగులకు పెద్ద ఊరట ప్రకటించారు మంత్రి పీయూష్ గోయల్. ఐటీ స్లాబుల్లో ఏ మార్పులు లేకుండా ఆయన చేసిన ప్రకటన గందరగోళం రేపింది. గతంలో ఐటీ రాయితీలు ప్రకటించినప్పుడు అన్ని ఆదాయ వర్గాలకు ఏదో ఒక రకంగా ప్రయోజనం జరిగేది. ఈసారి అలా కాకుండా ప్రత్యేకంగా రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్నవారినే ఆకర్షించే ప్రయత్నం చేశారు. వారు అసలు పన్ను కట్టాల్సిన అవసరం లేకుండా చేశారు. దీంతో పాటు సెక్షన్ 80సీ లాంటి పొదుపు ప్రయోజనాలను వాడుకుంటే రూ.6.5 లక్షల ఆదాయం వరకు పన్నులేకుండా అవకాశం కల్పించారు. ఇదే సమయంలో పన్ను స్లాబుల్లో మార్పు లేకపోవడంతో మిగతా ఉద్యోగ వర్గాలకు ఒక్క రూపాయి కూడా ప్రయోజనం కలగదు. ఉదాహరణకు 6.5 లక్షల ఆదాయం ఉన్నవారు అన్ని ప్రయోజనాలను ఉపయోగించుకుంటే పన్నే ఉండదు. లిమిట్ కి మించి ఒక్క రూపాయి ఎక్కువ ఆదాయమున్నా ఆ ఉద్యోగి పాత స్లాబుల ప్రకారం రూ.35వేల దాకా పన్ను కట్టాల్సి ఉంటుంది. పేదల సంక్షేమానికి సాయం చేస్తున్నారంటూ ఐటీ చెల్లింపుదారులకు వందనాలు చెప్పిన మంత్రి రూపాయి తేడాతో వారికి ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ ఇది.

వడ్డీపై కట్ చేయం... కట్టుకోండి

బ్యాంకులు, పోస్టాఫీస్ లలో డిపాజిట్లకు వచ్చే వడ్డీపై మంత్రి చేసిన ప్రకటన చూసి రాయితీ పెంచారని అందరూ భావించారు. అయితే వివరాలు చూస్తే చిన్న మార్పు మాత్రమే జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు డిపాజిట్లపై ఏడాది వడ్డీ రూ.10వేలు దాటితే టీడీఎస్ కట్ చేసేవారు. ఇప్పుడు ఈ కటింగ్ పరిమితిని రూ.40వేలకు పెంచారు. ఇది రాయితీ పెంపుకాదనీ, కటింగ్ నుంచి మినహాయింపు మాత్రమేనని ఆర్థిక నిపుణులు అంటున్నారు. నేరుగా టీడీఎస్ కోత లేకుండా స్వచ్ఛందంగా ఆదాయంలో చూపించి పన్ను కట్టేలా చిన్న మార్పు మాత్రమే చేశారు. ఇకపై కూడా రూ.10వేలు మించిన వడ్డీపై పన్ను కట్టక తప్పదంటున్నారు.

అసంఘటిత అమలు సమస్య

దేశంలో అసంఘటిత కార్మికుల కోసం శ్రమ యోగి మాన్ధన్ యోజన పేరుతో భారీ పెన్షన్ స్కీం ప్రకటిస్తున్నట్లు మంత్రి చెప్పారు. దీని కింద నెలకు రూ.15వేలలోపు సంపాదించేవారు 60 ఏళ్ల వయసు నుంచి నెలకు రూ.3వేల పెన్షన్ తీసుకోవచ్చన్నారు. ఈ స్కీం కోసం 18 ఏళ్ల వయసువాళ్లు నెలకు రూ.55 వరకు, 29 ఏళ్లు దాటినవాళ్లు నెలకు రూ.100 వరకు చెల్లించాలి. అంతే మొత్తాన్ని కేంద్రం చెల్లిస్తుంది. దీని కింద ఐదేళ్లలో 10 కోట్ల మంది చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే అసంఘటిత రంగంలో నెలవారీ కాంట్రిబ్యూషన్ విధానం ఇప్పటివరకు విజయవంతం కాలేదంటున్నారు ఆర్థిక నిపుణులు. ఈ రంగంలో వారికి సరైన గుర్తింపు లేకపోవడం ఒక కారణమైతే, ఈ రంగంలో రిటైరయ్యేంత వరకు ఉద్యోగం ఉంటుందన్న హామీ లేకపోవడం మరో కారణం. ఇలాంటి పరిస్థితుల్లో నెలవారీ డబ్బు చెల్లించడానికి కార్మికులు ముందుకురావడం అనుమానమే. గతంలో యూపీఏ సర్కారు పెట్టిన పెన్షన్ పథకాన్ని ఎన్డీయే సర్కారు అటల్ పెన్షన్ యోజన పేరుతో కొనసాగిస్తోంది. ఎనిమిదేళ్ల కాలంలో ఈ స్కీంలో చేరినవారి సంఖ్య కోటి మంది మాత్రమే. నెలవారీ రూ.5వేల పెన్షన్ ఇచ్చే ఈ స్కీం పరిస్థితే ఇలా ఉంటే కొత్త స్కీంను ఎలా అమలు చేస్తారన్న సందేహాలున్నాయి. పైగా ఎప్పుడో దశాబ్దాల తర్వాత వచ్చే రూ.3వేల పెన్షన్ అప్పటి ఖర్చులకు ఏమాత్రం సరిపోవంటున్నారు ఆర్థిక నిపుణులు.

రైతుకు 17 రూపాయలేనా?

వారి శ్రమను అవమానించడమే: రాహుల్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పై ఏఐసీసీ చీఫ్ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రైతుకు రోజుకు రూ.17 ఇస్తామని ప్రకటించడం వారిని అవమానించడమేనని దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం రైతుల జీవితాలను నాశనం చేసిందని ఆరోపించారు. 'ప్రియమైన నోమో, ఐదేళ్లలో మీ అసమర్థత, అహంకారం వల్ల రైతుల జీవితాలు నాశనమయ్యాయి. రైతుకు రోజుకు రూ.17 ఇస్తామని ప్రకటించడం వారి శ్రమను అవమానించడమే' అని రాహుల్ ట్వీట్ చేశారు. 'ఆఖ్రీ జుమ్లా బడ్జెట్' అని హ్యాష్ట్యాగ్ చేశారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ. 6 వేలు ఇస్తామని మంత్రి గోయల్ ప్రకటించారు. ఈ మొత్తాన్ని రోజు లెక్క చూస్తే 17 రూపాయలలోపే వస్తుంది. దీన్నే రాహుల్ ట్విటర్లో ప్రస్తావించారు.



వందల ఏళ్ల కిందే క్రెడిట్ కార్డులు

జేబులో డబ్బులు లేకున్నా ఫర్వాలేదు. క్రెడిట్ కార్డులుంటే ఎక్కడైనా ఏదైనా కొనేయొచ్చు. మరి ఈ అవకాశం ఇప్పుడే కాదు వందల ఏళ్ల కిందే ఉండేది తెలుసా? అప్పట్లో ఎక్కడికి ప్రయాణించాలన్నా.. గుర్రాలు, గుర్రపు బండ్లే దిక్కు. వాటిపైనే అడవులు, గుట్టలు దాటుకుంటూ ప్రయాణించాలి. అలాంటప్పుడు దొంగలు దోచేసుకునేవారు. ఈ ప్రమాదం లేకుండా గ్రీకు, రోమన్, యూరోపియన్ ప్రాంతాల్లో 'క్రెడిట్ /డెబిట్ కార్డు'ల వంటి వ్యవస్థను అమలు చేశారు. ఎవరైనా దూర ప్రాంతాలకు వెళ్తుంటే తమ దగ్గరి 'బ్యాంకు'ల్లో సొమ్మును జమ చేసేవారు. ఆ బ్యాంకులు వాటికి సంబంధించిన ప్రత్యేక ముద్ర ఉండే ఉంగరాన్ని ఇచ్చేవి. ప్రయాణం చేసేవారు బస చేసే చోటగానీ, ఏదైనా వస్తువు కొన్నా, ఆహారం తిన్నా ఆ ముద్రతోనే బిల్లులు చెల్లించేవారు. కాగితంపైగానీ, వస్త్రం, తోలు పట్టీల వంటి వాటిపైగానీ బిల్లు మొత్తాన్ని రాసి, ఆ ముద్ర వేసి, సంతకం చేసేవారు. వ్యాపారులు ఆ బిల్లులను ఆ 'బ్యాంకు' శాఖల్లో ఇచ్చి, డబ్బులు తీసుకునేవారు. టెక్నికల్గా ఇది డెబిట్ కార్డు అన్నమాట. ప్రయాణం చేసేవారు చాలాసార్లు బ్యాంకుల్లో జమ చేసిదానికంటే ఎక్కువ ఖర్చుపెట్టేవారు. బ్యాంకులు వ్యాపారులందరికీ చెల్లించేసి, ఎక్కువైన మొత్తాన్ని ఆ వ్యక్తి నుంచి వసూలు చేసుకునేవి. ఇది క్రెడిట్ కార్డు అన్నమాటే. ఇప్పుడు జీతాలు ఎక్కువగా ఉండి, 'సిబిల్' స్కోరు బాగున్నవారికి ఇచ్చినట్టే.. అప్పట్లోనూ బాగా డబ్బున్నవారికి, ప్రముఖులకు, రాజుల వద్ద, సైన్యంలో పనిచేసేవారికే 'క్రెడిట్' సౌకర్యం అందుబాటులో ఉండేది. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఎగ్గొట్టినా, వ్యాపారులు మోసం చేసినా శిక్షలు చాలా కఠినంగా ఉండేవి.

ఊళ్లకు 1.18 లక్షల కోట్లు

ఉపాధి పథకానికి రూ.60 వేల కోట్లు

న్యూఢిల్లీ: గ్రామీణాభివృద్ధికి బడ్జెట్లో రూ.1.18 లక్షల కోట్లను కేటాయించారు. ఇది గతేడాది కంటే 4.6 శాతం ఎక్కువ. కిందటేడాది రూ.1.12 లక్షల కోట్లు ప్రతిపాదించారు. ఉపాధి హామీ, ప్రధాన్మంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన, ప్రధాన్మంత్రి గ్రామసడక్ యోజన, జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) తదితర పథకాలన్నింటినీ గ్రామీణాభివృద్ధి శాఖనే అమలు చేస్తుంది. ఈసారి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రూ.60 వేల కోట్లు కేటాయించారు. కిందటేడాది బడ్జెట్తో పోలిస్తే ఇది 11 శాతం అధికం. అవసరమైతే మరిన్ని కేటాయింపులు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 2018-19 బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.55 వేల కోట్లు కేటాయించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు కిందటేడాది కంటే రూ.3 వేల కోట్లు తక్కువగా రూ.19 వేల కోట్లు ప్రతిపాదించారు. గ్రామీణ సడక్ యోజనకు రూ.19 వేల కోట్లు కేటాయించారు.

పట్టణాభివృద్ధికి 48,032 కోట్లు

పట్టణాభివృద్ధికి బడ్జెట్లో రూ.48,032 కోట్లు కేటాయించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా ప్రతి రోజూ 27 కి.మీ. మేర జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని పీయూష్ చెప్పారు.



'చదివింపులు' పెంచిండ్రు

విద్యా రంగానికి రూ.93,847.64 కోట్లు

గతేడాది కంటే 10% ఎక్కువ

ఉన్నత విద్యకు రూ.37,461 కోట్లు

పాఠశాల విద్య రూ.56,386 కోట్లు

ఐఐఎంలకు 60% నిధుల కోత

న్యూఢిల్లీ: 2019-20 బడ్జెట్లో విద్యారంగానికి సంబంధించి కేంద్రం ప్రభుత్వం పెద్ద ప్రకటన ఏదీ చేయలేదు. అయితే గతేడాదితో పోలిస్తే 10 శాతం ఎక్కువగా కేటాయింపులు జరిపింది. విద్యారంగానికి రూ. 93,847.64 కోట్లు కేటాయించింది. ఉన్నత విద్యకు రూ.37,461.01 కోట్లు, పాఠశాల విద్య రూ .56,386.63 కోట్లు చదివింపులు చేసింది. మొత్తం బడ్జెట్లో విద్యకు 3.3 శాతం కేటాయించింది. గతేడాది బడ్జెట్ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విద్యకు రూ.85,010 కోట్లు కేటాయించారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 'రీ వైటలైజింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ ఇన్ఎడ్యుకేషన్ (ఆర్ఐఎస్ఈ)' పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్వెల్లడించారు. వచ్చే నాలుగేళ్లలో ప్రముఖ విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థల్లో రీసెర్చ్లు, సంబంధిత మౌలిక సదుపాయాల కోసం పెట్టుబడులు పెంచనున్నట్లు చెప్పారు. టీచర్లలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు టెక్నాలజీని ఉపయోగిస్తామని, ఈ మేరకు 'దీక్ష' పేరుతో డిజిటల్పోర్టల్ను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు దేశంలోని అన్ని స్కూళ్లలో 'ఆపరేషన్ డిజిటల్స్కూల్'ను ప్రారంభించనున్నామని, దీనిపై పని చేసేందుకు ఉన్నత విద్యాశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసిందని చెప్పారు. రెండు ఎస్పీఏ (స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్)లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనునట్లు గోయల్ప్రకటించారు. అలాగే కొత్తగా మరో 18 ఎస్పీఏలను ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పరిశోధనలు, ఆవిష్కరణల కోసం రూ.608.87 కోట్ల కేటాయింపులు జరిపారు. గతేడాది రూ.350.23 కోట్లు మాత్రమే కేటాయించారు. హయ్యర్ఎడ్యుకేషన్ఫైనాన్సింగ్ఏజెన్సీ (హెచ్ఈఎఫ్ఏ)కి గతేడాది రూ.2,750 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది 2,100 కోట్లకు కుదించారు. 2018-19 బడ్జెట్లో కేటాయించిన మొత్తంలో కేవలం రూ.250 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు.

ఐఐటీ, ఐఐఎంలకు కోత

ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్వంటి విద్యా సంస్థలతోపాటుయూజీసీ, ఏఐసీటీఈ తదితర రెగ్యులేటరీ బాడీస్కు గతేడాదితో పోలిస్తే కేటాయింపులు తగ్గాయి. ఐఐఎంలకు గతేడాదితో పోలిస్తే ఏకంగా కేటాయింపులు 60 శాతం కుదించారు. మిగతా విద్యాసంస్థలకు కూడా పాక్షికంగా నిధులు తగ్గించారు. యూజీసీ, ఏఐసీటీఈ తదితర చట్టబద్ధమైన సంస్థలకు గతేడాదితో పోలిస్తే 2.7 శాతం కేటాయింపులు తగ్గాయి. గతేడాది మొత్తంగా రూ.5,207.75 కోట్లు కేటాయించగా, తాజాగా 5,066.66 కోట్లకు తగ్గించారు.


కేటాయింపుల్లో తగ్గుదల ఇలా

విద్యాసంస్థలు	2018–19	2019–20
ఐఐఎంలు	రూ.1,036 కోట్లు	415.41 కోట్లు
ఐఐటీలు	రూ.6,326 కోట్లు	రూ.6,223.02 కోట్లు
యూజీసీ	రూ.4,722.75 కోట్లు	రూ.4,600.66 కోట్లు
ఏఐసీటీఈ	రూ.485 కోట్లు	రూ.466 కోట్లు
ఐఐఎస్ఈఆర్	రూ.689 కోట్లు	రూ.660 కోట్లు



ఈశాన్య రాష్ట్రాలకు పెరిగిన బడ్జెట్

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం శుక్రవారం బడ్జెట్లో ఈశాన్య రాష్ట్రాలకు కేటాయింపులు పెంచింది. గత ఏడాదికంటే ఈసారి 21శాతం కేటాయింపులు పెంచామని మంత్రి పీయూష్గోయల్ చెప్పారు. 'ఈశాన్య రాష్ట్రాల మౌలిక అభివృద్ధికి రూ.58,166 కోట్లు కేటాయించాం. అరుణాచల్ప్రదేశ్ ఈ మధ్యనే ఎయిర్ మ్యాప్లోకి చేరింది. మేఘాలయా, త్రిపుర, మిజోరం రాష్ట్రాలు మొదటిసారి రైల్మ్యాప్లోకి చేరాయి.' అని గోయల్ చెప్పారు. బ్రహ్మపుత్ర నదిపై రవాణా సౌకర్యం మెరుగుపర్చడం ద్వారా కంటేయినర్ కార్గో సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. 'నార్త్ ఈస్టర్న్కౌన్సిల్లోని పథకాలకు రూ.580 కోట్లు, సిక్కింలోని సెంట్రల్ పూల్ ఆఫ్ రిసోర్సెస్కు రూ.931 కోట్లు, సబ్సిడీల కోసం రూ.674 కోట్లు, హిమాలయన్ రాష్ట్రాల్లో పారిశ్రామిక యూనిట్లకు ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ తిరిగి చెల్లించడానికి రూ.1700 కోట్లు కేటాయించాం'. అని మంత్రి వివరించారు.



ఎయిరిండియాకు రూ.3,900 కోట్లు

న్యూఢిల్లీ: తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన ఎయిరిండియాకు కేంద్రం బడ్జెట్లో రూ.3,900 కోట్లు కేటాయించింది. రూ.29 వేల కోట్ల అప్పును స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ) అయిన 'ఎయిరిండియా అస్సెట్ హోల్డింగ్ కంపెనీ'కి కేంద్రం గతంలో బదలాయించింది. ఇప్పుడు ఈ ఎస్పీవీకి 2019-20లో రూ.1,300 కోట్లు కేటాయించాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది మరో రూ.2,600 కోట్లు కేటాయించనుంది. మొత్తంగా 3,600 కోట్లను అందజేయనుంది.

ప్రభాత
వెలుగు
Follow:
v6velugu
07
శనివారం | హైదరాబాద్
02.02.2019
www.v6velugu.com



బ్యాలెట్ బడ్జెట్
2019-20

రాష్ట్రంలో కూత పెట్టలే



రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి కొత్త ప్రతిపాదనల ఊసే లేదు | దక్షిణ మధ్య రైల్వేకు రూ. 5,924 కోట్ల కేటాయింపు | గతేడాదితో పోలిస్తే పెంపు స్వల్పమే

కాజీపేట ప్రాజెక్టులకు నిరాశ | అభివృద్ధిలో ఉన్న పనులకే కేటాయింపులు | కొత్త లైన్లకు రూ. 834 కోట్లు | డబ్లింగ్ పనులకు రూ. 1,905 కోట్లు | మౌలిక వసతులకు రూ. 229 కోట్లు

హైదరాబాద్, వెలుగు:
రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి ఈసారీ మొండిచెయ్యే ఎదురైంది. ఎలాంటి కొత్త ప్రాజెక్టుల ఊసుకూడా లేకుం డా పోయింది. ఉన్న ప్రాజెక్టులకు మాత్రం అరకొరగా నిధులను కేటాయించారు. ముఖ్యంగా కాజీపేటలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన వ్యాగన్ ఫ్యాక్టరీ, డివిజన్‌గా ఏర్పాటు వంటివాటిని ప్రస్తావించ లేదు. హైదరాబాద్‌లో రైల్వే టెర్మినళ్ల నిర్మాణంపైనా ప్రకటన చేయలేదు.

పెంపు కొంతే..
దక్షిణ మధ్య రైల్వేకు బడ్జెట్‌లో రూ. 5,924 కోట్లు కేటాయించారు. గతేడాది ఇచ్చిన రూ. 5,752 కోట్ల కన్నా కేవలం రూ.172 కోట్లే ఎక్కువ. మొత్తంగా ఇప్పటికే కొనసాగుతున్న పనులకు మాత్రమే కొంత మేర నిధులు ఇచ్చారు. లైన్ల నిర్మాణం కోసం రూ. 834 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ. 1,905 కోట్లు, ట్రాఫిక్ ఫెసిలిటీలకు రూ. 138 కోట్లు, మౌలిక వసతులకు రూ. 229 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రాంతాలకు కూడా కలిపి ఈ కేటాయింపులు ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ జాన్ థామస్ రైల్వే కేటాయింపుల వివరాలను శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు.


ప్రాజెక్టులు పూర్తయ్యేదెన్నడు?
బడ్జెట్‌లో కొత్త ప్రాజెక్టులను పట్టించుకోలేదు. ఎప్పటి నుంచో ఆశగా ఎదురు చూస్తున్న కాజీపేట వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్, రైల్ యూనివర్సిటీ ఏర్పాటును మరోసారి అటకెక్కించారు. హైదరాబాద్ ఎంఎంటీఎస్ విస్తరణకు నామమాత్రంగా రూ.10 లక్షలు విదిలించారు. హైదరాబాద్ పరిధిలో నిర్మించతలపెట్టిన టెర్మినళ్లనూ పెద్దగా పట్టించుకోలేదు. నల్లగొండ-మాచర్ల లైన్‌కు రూ.10 లక్షలు, భద్రాచలం-కొవ్వూరు లైన్‌కు రూ.కోటి ఇచ్చారు. ఇలా నామమాత్రంగా నిధులిస్తే.. ప్రాజెక్టులు ఎప్పటికి పూర్తవుతాయని దక్షిణ మధ్య రైల్వే వర్గాలే విస్తుపోతుండటం గమనార్హం.

భద్రతా పనులకూ స్వల్పమే

ఈసారి భద్రతా పనులకూ నిధులు తక్కువే ఇచ్చారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రోడ్డు ఓవర్/అండర్ బ్రిడ్జి పనులకు రూ.397 కోట్లు కేటాయించారు. వివిధ వంతెనల నిర్మాణాలకు రూ.52 కోట్లు, క్రాసింగ్‌ల వద్ద భద్రతకు రూ. 72.5 కోట్లు, ట్రాక్‌ల పునరుద్ధరణకు రూ. 657 కోట్లు, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ వర్క్‌లకు రూ. 23.4 కోట్లు ఇచ్చారు. హెచ్ఆర్‌డీ శిక్షణకు రూ.16.4 కోట్లు కేటాయించారు. బైపాస్ లైన్ల కోసం రూ.143 కోట్లు, చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ అభివృద్ధికి రూ. 5 కోట్లు, కాజీపేట పీరియాడిక్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌కు రూ. 10 కోట్లు, మౌలాలీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌కు రూ.6 కోట్లు ప్రకటించారు.

వీపీ 'సబ్సిడీ' సింగ్

పేదలకు సబ్సిడీలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించిన తొలి ఆర్థిక మంత్రి వీపీ సింగ్. 1986 బడ్జెట్‌లోనే రిక్షావాళ్లు, రోజు కూలీలకు సబ్సిడీపై బ్యాంకు లోన్లు ఇప్పించాలని ప్రతిపాదించారు. చిన్న పరిశ్రమలకు చేయూత కోసం ప్రత్యేక బ్యాంకును నెలకొల్పాలని, మున్సిపల్ కార్మికులు, రైల్వే పోర్టర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు.



బడ్జెట్ ముందే తెలిసిపోతుంది

సాధారణంగా బడ్జెట్ రూపకల్పన రహస్యంగా కొనసాగుతుంది. కేవలం ఆర్థిక మంత్రి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, కార్యదర్శి, ఒకరిద్దరు ఉన్నతాధికారులకు తప్ప ఎవరికీ వివరాలు తెలిసే అవకాశం ఉండదు. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు ఇది కొనసాగుతుంది. కానీ ఒక్కరికి మాత్రం ముందే తెలుస్తుంది. అదెవరో తెలుసా.. రాష్ట్రపతికి. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టే రోజున ఆర్థిక మంత్రి వెళ్లి రాష్ట్రపతిని కలుస్తారు. బడ్జెట్‌లోని కీలక అంశాలను వివరిస్తారు. తర్వాత పార్లమెంటుకు వచ్చి, ప్రధాన మంత్రి ఇతర కేబినెట్ మంత్రులకు కూడా బడ్జెట్ అంశాలను చెబుతారు. తర్వాత ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి కలసి లోక్‌సభకు వచ్చి.. బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.



ఈ ప్రాజెక్టులకు ఓకే..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నిర్మాణంలో ఉన్న పలు పనులకు మాత్రం ఓ మోస్తరుగా నిధులు కేటాయించారు.

- కరీంనగర్ నుంచి సిరిసిల్ల మీదుగా హైదరాబాద్‌కు అనుసంధానమయ్యే మనోహరాబాద్-కొత్తపల్లి 150 కిలోమీటర్ల లైన్ కోసం రూ.200 కోట్లు.
- మునీరాబాద్-మహబూబ్‌నగర్ మధ్య 246 కి.మీ. లైనుకు రూ.275 కోట్లు
- భద్రాచలం-సత్తుపల్లి మధ్య 56 కిలోమీటర్ల లైన్‌కు రూ.405 కోట్లు
- కాజీపేట-బల్లార్షా 202 కిలోమీటర్ల ట్రిపుల్ లైన్ ప్రాజెక్టుకు రూ.265 కోట్లు
- సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ. 200 కోట్లు
- కాజీపేట-విజయవాడ మూడో లైన్‌కు రూ.110 కోట్లు
- అక్కన్నపేట్-మెదక్ లైన్‌కు 10 కోట్లు
- నడికుడి-శ్రీకాళహస్తి మధ్య 309 కిలోమీటర్ల లైన్ కోసం రూ.700 కోట్లు
- కడప-బెంగళూరు మధ్య రూ. 225 కిలోమీటర్ల కొత్త లైన్ నిర్మాణానికి రూ. 210 కోట్లు
- విజయవాడ-గూడూరు మూడో లైన్‌కు రూ. 350 కోట్లు
- ఓబులవారిపల్లి-కృష్ణపట్నం కొత్త లైనుకు రూ. 30 కోట్లు
- ముద్ఖేడ్-పర్భణికి రూ. 34.5 కోట్లు
- గుంటూరు-తెనాలి లైన్ విద్యుదీకరణకు రూ.5 కోట్లు

ఘట్‌కేసర్-యాదాద్రికి రూ. 20 కోట్లు

యాదాద్రిని హైదరాబాద్‌తో అనుసంధానించేందుకు ప్రతిపాదించిన ఘట్‌కేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్ ఫేజ్-2 విస్తరణ పనులకు రూ.20 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.412 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కొంత భరించనుంది. అయినా కేంద్రం ఈసారి రూ. 20 కోట్లే ఇచ్చింది.

తీవ్ర అన్యాయం జరిగింది


దక్షిణ మధ్య రైల్వేకు అన్యాయం జరిగింది. అరకొర నిధులు ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. చాలా ప్రాజెక్టులకు చాలా తక్కువగా నిధులిచ్చారు. ఒక్క కిలోమీటర్ ట్రాక్‌కు రూ.20 కోట్లు ఖర్చవుతుంది. పదీ, ఇరవై లక్షలిస్తే ఎలా?

- శంకర్‌రావు,
ప్రధాన కార్యదర్శి, ఎస్సీఆర్ ఎంయూ

ఇటీవలి వరకు కేంద్ర బడ్జెట్, రైల్వే బడ్జెట్ వేర్వేరుగా ఉండేవి.

ఈ ఆనవాయితీ బ్రిటీషర్ల కాలంలో ప్రారంభమైంది. మోడీ సర్కార్ దానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. 2016-17లో రెండింటినీ కలిపి ఒకే బడ్జెట్ ప్రవేశపెట్టింది.

చివరి రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి సురేశ్ ప్రభు



ఇది ఎన్నికల బడ్జెట్. అందుకే రైతులు, మధ్యతరగతి ప్రజలకు ఈ రాయితీలు. మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి తర్వాత కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావాలంటే బీజేపీ సర్కారుకు మధ్యంతర బడ్జెట్ చివరి అవకాశం.

- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్



ఈ బడ్జెట్ ఎన్నికల మేనిఫెస్టో. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బీజేపీ గిమ్మిక్కులు చేసింది. ఈ హామీలను పూర్తి చేసే అవకాశమే లేదు. ఐదేళ్ల పాలనలో ఏం సాధించారు, ఎన్ని హామీలు పూర్తి చేశారన్న ప్రస్తావన లేదు. 10 కోట్ల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోలేదు. ప్రతిదాంట్లోనూ రాజకీయమే. బీజేపీ మోసం ప్రజలకు అర్థమైంది.

- లోక్ సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే

రైల్వే ఆదాయం తీరు (రూ. కోట్లలో)



విభాగం (అంచనా)	2018-19 (రివైజ్డ్)	2019-20
ప్రయాణికుల నుంచి	52,000	56,000
సరుకు రవాణా	1,29,750	1,43,000
ప్రత్యేక రవాణా ఆదాయం	5,000	6,000
ఇతర మార్గాల ద్వారా..	9,864	11,575

కొత్త ట్రాక్‌పై రైల్వే

ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలకు రూ. 1,58,658 కోట్లు | కొత్తగా రైళ్లు, బోగీలు, స్టేషన్లలో సౌకర్యాలకు ప్రాధాన్యం

సిగ్నలింగ్ వ్యవస్థల అభివృద్ధిపైనా దృష్టి | సాధారణ బడ్జెట్ నుంచి 64 వేల కోట్లకుపైగా సాయం | ప్రయాణికులు, సరుకు రవాణా చార్జీలు యథాతథం

న్యూఢిల్లీ:
మధ్యంతర బడ్జెట్‌లో ఎన్నో కీలకమైన నిర్ణయాలు తీసుకున్న మోడీ సర్కారు రైల్వే బడ్జెట్‌లో మాత్రం ఎలాంటి మార్పులకు పోలేదు. ప్రయాణికుల చార్జీలుగానీ, సరుకు రవాణా చార్జీలుగానీ పెంచలేదు. కానీ రైల్వే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడం లక్ష్యంగా, కొత్త రైళ్లు, అధునాతన బోగీలు, ప్రయాణికులకు మౌలిక సౌకర్యాల పెంపు వంటి వాటిపై ప్రధానంగా దృష్టిసారించారు. ఇందుకోసం ఇక రైల్వేల చరిత్రలోనే అత్యధికంగా మూలధన వ్యయం కింద రూ.1,58,658 కోట్లు కేటాయించారు. మొత్తంగా రైల్వే ఆదాయ వ్యయాలను రూ.2,72,705 కోట్లుగా చూపారు. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రివైజ్డ్ రైల్వే బడ్జెట్ రూ.2,49,851 కోట్ల కన్నా రూ.22,854 కోట్లు ఎక్కువ. రైల్వేలకు సంబంధించి బడ్జెట్ ప్రసంగంలో పెద్దగా ప్రస్తావించని పీయూష్ గోయల్ .. ప్రస్తుత ఏడాది రైల్వేలకు అత్యంత భద్రమైన సంవత్సరమని పేర్కొన్నారు. దేశంలోని బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గాలపై ఉన్న అన్ని లెవల్ క్రాసింగ్ ల వద్ద కాపలా ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సేవలు అందించేందుకు అద్భుతమైన సెమీ హైస్పీడ్‌రైలు 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను రూపొందించారని చెప్పారు.

కేటాయింపులివీ..
రైల్వే ఆదాయం, నిర్వహణ ఖర్చు నిష్పత్తిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 96.2 శాతానికి తీసుకురాగలిగామని, వచ్చే ఏడాది దీనిని 95 శాతానికి తీసుకురావాలన్నది లక్ష్యమని పీయూష్ గోయల్ బడ్జెట్ స్పీచ్‌లో పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్ల కోసం రూ.7,255 కోట్లు, గేజ్ మార్పిడి కోసం రూ.2,200 కోట్లు, లైన్ల డబులింగ్ కోసం రూ.700 కోట్లు, రైలు కోచ్‌లు, వ్యాగన్లు, ఇంజన్ల (రోలింగ్ స్టాక్) కోసం రూ.6,114 కోట్లు, సిగ్నలింగ్, టెలికం వ్యవస్థల ఏర్పాటు, మరమ్మతుల కోసం రూ.1,750 కోట్లు కేటాయించారు. రైళ్లు, స్టేషన్లలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం రూ.3,422 కోట్లు ఇచ్చారు.

త్వరలో అధునాతన రైలు బోగీలు
రైలు బోగీలు, సరుకు రవాణ వ్యాగన్లు, ఇంజన్ల వంటి వాటి కోసం గతేడాదికన్నా ఈసారి రెండింతల బడ్జెట్ కేటాయించారు. ఇటీవల అభివృద్ధి చేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజయవంతం కావడం, తాజాగా కేటాయింపులను పెంచిన నేపథ్యంలో త్వరలో అత్యాధు నిక బోగీలు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రాయ్‌బరేలీ, చెన్నై, కపుర్తలా, హల్దియాల్లోని రైల్వే ఫ్యాక్టరీల్లో ఏర్పాట్లన్నీ పూర్తయితే వచ్చే రెండేళ్లలో 15,000 రైల్వే కోచ్‌లను తయారు చేసే ప్రణాళికలు ఉన్నాయని రైల్వేశాఖ వర్గాలు వెల్లడించాయి. వందేభారత్ ఎక్స్ ప్రెస్ (ట్రైన్ 18) తరహాలో మరో 18 రైళ్లను తయారు చేయాలని ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు.

సాధారణ బడ్జెట్ నుంచి 64 వేల కోట్లు
రైల్వేల అభివృద్ధి కోసం కేంద్రం సాధారణ బడ్జెట్ నుంచి రూ.64,587 కోట్లను మూలధన సహాయం (క్యాపిటల్ సపోర్ట్)గా అందిస్తోంది. రైల్వే విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ నిధులు కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో కూడా సాధారణ బడ్జెట్ నుంచి రూ.55,088 కోట్లను అందించారు.

రూ.85,800 కోట్లు జీతాలకే..
రైల్వేలకు సిబ్బంది వేతనాలే భారంగా మారుతున్నాయి. వేతనాల కోసం గతేడాదికన్నా రూ.14 వేల కోట్లు అదనంగా ఈసారి రూ.85,800 కోట్లను కేటాయించారు. త్వరలో చేరనున్న లక్ష మంది కొత్త ఉద్యోగులు, సిబ్బంది కోసమే రూ.4,500 కోట్లు ఖర్చవుతుందని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.



మొత్తం రైల్వే బడ్జెట్
2,72,705 కోట్లు

నిర్వహణ ఆదాయం
2,16,675 కోట్లు

ఇతర ఆదాయం
260 కోట్లు

నిర్వహణ వ్యయం
2,05,500 కోట్లు

ఇతర వ్యయాలు
2,400 కోట్లు

రెవెన్యూ మిగులు
9,035 కోట్లు

ఇది 160వ బడ్జెట్!

మన దేశంలో ఇది 160వ బడ్జెట్ తెలుసా? ఇదేంటి అనుకుంటున్నారా.. ఓ రకంగా ఇది వాస్తవమే. తొలి స్వాతంత్ర్య సంగ్రామంగా చెప్పే 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటీషు సర్కారు భారత దేశ పాలనను నేరుగా తమ పరిధిలోకి తీసుకుంది. దాంతో పలు పాలనా విధానాలు అమల్లోకి వచ్చాయి. ఆ సమయంలోనే తొలిసారిగా 1860 ఏప్రిల్ 7న ఈస్టిండియా కంపెనీ మన దేశ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. తర్వాత 1869 ఫిబ్రవరిలో జేమ్స్ విల్సన్ పూర్తిస్థాయిలో భారత తొలి బడ్జెట్ ప్రవేశపెట్టారు. అందుకే జేమ్స్ విల్సన్‌ను ఫాదర్ ఆఫ్ ఇండియన్ బడ్జెట్ అని కూడా అంటుంటారు.



మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947లో ప్రధాని నెహ్రూ నేతృత్వంలో ఆర్థికమంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి మొదటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాతి నుంచి బడ్జెట్‌కు సంబంధించి ఎన్నో విశేషాలు ఉన్నాయి. అవేంటో చూద్దామా?

- మన దేశంలో మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పదిసార్లు బడ్జెట్ పెట్టారు. ఆయన తర్వాత పి.చిదంబరం తొమ్మిదిసార్లు, ప్రణబ్‌ముఖర్జీ ఎనిమిదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు.
- మొదట బడ్జెట్ పత్రాలను కేవలం ఇంగ్లిష్‌లో ముద్రించేవారు. 1955-56 నుంచి హిందీలోనూ బడ్జెట్ పేపర్లను ముద్రించడం మొదలైంది.
- 25 మంది ఆర్థిక మంత్రుల్లో లా డిగ్రీ చేసిన వారు 11 మంది ఉన్నారు. ఇక ఎకనమిక్స్ లేదా కామర్స్ చదివిన వారు 8 మందే.
- ఆర్థిక మంత్రులుగా చేసి ప్రధానమంత్రి అయినవారు నలుగురు. మొరార్జీ దేశాయ్, చరణ్‌సింగ్, వీపీసింగ్, మన్మోహన్‌సింగ్
- ఆర్థిక మంత్రులుగా చేసి రాష్ట్రపతులైన వారు ఇద్దరు రామస్వామి వెంకట్రామన్, ప్రణబ్ ముఖర్జీ
- ముగ్గురు ప్రధానమంత్రులు బడ్జెట్ ప్రవేశపెట్టారు. వారు ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ(1958), ఇందిరాగాంధీ(1970), రాజీవ్‌గాంధీ (1987). ఆ సమయంలో ఆర్థిక శాఖను వారే నిర్వహిస్తున్నారు.
- దేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఏకైక మహిళా ఆర్థిక మంత్రి ఇందిరాగాంధీ.

సైన్స్‌అండ్ టెక్నాలజీకి అంతంతే

న్యూఢిల్లీ: సైన్స్ అండ్ టెక్నాలజీకి ఈసారి కేంద్రం ₹1 2,797.24 కోట్లు కేటాయించింది గతేడాది ₹1 2,322.28 కోట్లు కేటాయిస్తే.. ఇప్పుడు ₹474.96 కోట్లు ఎక్కువిచ్చిందంతే. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీకి ₹5,321.01 కోట్లు, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌కు ₹2,580.34 కోట్లు, సీఎస్ఐఆర్‌కు ₹4,895.89 కోట్లను కేటాయించింది. ఎర్త్ సైన్సెస్ విభాగానికి గతేడాది ₹1,800 కోట్లు ఇస్తే ఈ ఏడాది ₹1,901.76 కోట్లతో సరిపెట్టేసింది. ఇంకో రెండేళ్లలో మానవ సహిత ప్రయోగానికి ఇస్రో సన్నద్ధమవుతున్న తరుణంలో ₹11,538.26 కోట్లిచ్చింది. అడవులు, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై పోరాటం కోసం ₹3,175.72 కోట్లను కేటాయించింది. ప్రాజెక్ట్ టైగర్‌కు రూ.350 కోట్లు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్‌కు ₹30 కోట్లిచ్చింది. పీసీబీకి ₹100 కోట్లనిచ్చింది. జాతీయ పులుల సంరక్షణ అధీకృత సంస్థకు రూ.10 కోట్లు, పశు సంరక్షణ బోర్డుకు ₹12 కోట్లు, నేషనల్ కమిషన్ ఫర్ గ్రీన్ ఇండియాకు ₹240 కోట్లు ఇచ్చింది.



పునరుత్పాదక విద్యుత్‌కూ...
అణు విద్యుత్ కు కేటాయింపులను భారీగా పెంచుతూ ₹16,725.51 కోట్లు ఇచ్చింది. అందులో పవర్ ప్రాజెక్టులకు ₹4,547 కోట్లు కేటాయించింది. అణు విద్యుత్ ప్రాజెక్టులను కేంద్రం కడుతోంది. ఈ నిధులను వాటికి వాడనున్నారు. పునరుత్పాదక విద్యుత్ కోసం ₹5,254.83 కోట్లను కేటాయించింది.



ఆర్థిక మంత్రులే.. కానీ బడ్జెట్ పెట్టలేదు

కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రులుగా పనిచేసిన ఇద్దరు మాత్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదు.

- 1950లో కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీ నియోగి కేవలం 35 రోజుల పాటే ఆ పదవిలో ఉండటంతో బడ్జెట్ అవకాశం రాలేదు. తర్వాత ఆయన తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1979లో జనతా పార్టీ సర్కారులో ఉత్తరప్రదేశ్ నేత హెచ్ఎన్ బహుగుణ కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆగస్టు నుంచి డిసెంబర్ మధ్య నాలుగున్నర నెలల పాటు ఈ పదవిలో ఉన్నా ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోయారు.

ప్రభాత వెలుగు
Follow: v6velugu

బ్యాలెట్ బడ్జెట్ 2019-20



ఎవరేమన్నారంటే...



ఈసారి బడ్జెట్ వృద్ధి అనుకూలంగా, ముందుచూపుతో ఉంది. చిన్న, సన్నకారు రైతుల కోసం తీసుకొచ్చిన 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' స్వాగతించదగ్గ పథకం. పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షల వరకు పెంచడం, మధ్య తరగతి ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచుతుంది. రెండో ఇంటికి పన్ను మినహాయింపు ఇవ్వడం హౌజింగ్ రంగానికి బూస్టప్ ఇస్తుంది. చిన్న పొదుపులు, బ్యాంక్ డిపాజిట్లపై టీడీఎస్ సీలింగ్ పరిమితి పెంచడం కొత్త డిపాజిటర్లను ఆకర్షిస్తుంది

– ఎస్‌బీఐ చైర్మన్ రజ్నీష్ కుమార్

2019–20 బడ్జెట్ కనీసం 15 కోట్ల మంది భారతీయులకు లబ్ధి చేకూరుస్తుంది. వీరిలో 12 కోట్ల మంది రైతులు కాగా, 3 కోట్ల మంది వేతన జీవులు. ఈ మధ్యంతర బడ్జెట్ అసంఘటిత రంగంలో ఉన్న 95 శాతం మంది వర్కర్లకు మద్దతుగా నిలుస్తుంది.

– ఫిక్కీ

ఎకానమీలో డిమాండ్‌ను, వృద్ధిని ఉత్తేజపరిచే కీలక అంశాలను బడ్జెట్ టచ్ చేసింది. రైతులు, మధ్యతరగతి ప్రజలు, అనధికారిక వర్గాలను అడ్రస్ చేయడంతో ఆదాయాల్లో స్థిరత్వం పొందడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రజల బడ్జెట్, ఎకానమీ వృద్ధి చెందడానికి ఇది సహకరిస్తుంది

- సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ



ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ చాలా పాజిటివ్‌గా ఉంది. రియల్ ఎస్టేట్ ఎదుర్కొనే పలు సమస్యలను ప్రభుత్వం గుర్తించడం సంతోషదాయకంగా ఉంది. గృహాలు కొనే వారికి తక్కువ పన్ను భారంతో పాటు మెరుగైన లిక్విడిటీ అందించే చర్యలను బడ్జెట్ తీసుకుంది. రెండో ఇంటికి పన్ను మినహాయింపు ఇవ్వడం అద్భుతమైన నిర్ణయం. ఇది ప్రైమరీ, సెకండరీ మార్కెట్‌లో అమ్మకాలను పెంచుతుంది

– నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్

గ్రామీణుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, గృహోపకరణాలకు డిమాండ్‌ను పెంచుతాయి. ఐటీ మినహాయింపులను పెంచడంతో సగటున మధ్యతరగతికి రూ.20వేలదాకా ఆదా అవుతుంది.

పానాసోనిక్ ఇండియా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మనీష్ శర్మ

రైతులకు, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూరేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ వల్ల వైట్ గూడ్స్ డిమాండ్ పెరుగుతుంది. గ్రామీణ విద్యుదీకరణ, గ్రామీణ డిమాండ్‌ను పెంచుతుంది

– కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లియెన్సస్ మానుఫ్రాక్చర్స్ అసోసియేషన్



ఆరోగ్యకరమైన ఇండియాను రూపొందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఈ బడ్జెట్ ద్వారా మరోసారి వెల్లడైంది. ఏఐ కోసం జాతీయ కేంద్రం ఏర్పాటు కూడా బిగ్ పాజిటివ్. అంటువ్యాధులకు చికిత్స చేయడానికి కొత్త టూల్స్‌ను డిజైన్ చేసేందుకు ఏఐ ఎంతో దోహదం చేస్తుంది

– అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి

అసంఘటిత కార్మికుల కోసం తాజా పింఛన్ పథకం అటల్ పెన్షన్ యోజనకు కొనసాగింపు. ఈ స్కీమ్‌లోకి ఇక అధికారిక రంగాల్లో ఉన్న సన్నకారు వేతన జీవులు కూడా వస్తారు. అటల్ పెన్షన్ పథకం కింద ఉన్న వయసు పరిమితిని 40 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచారు. ఇది నిజంగా స్వాగతించదగ్గ విషయం. చాలా మందికి ఇది సామాజిక భద్రతను కల్పిస్తుంది

– పీడబ్ల్యూసీ ఇండియా లీడర్ అశోక్ వర్మ

ఇండియాలో ఉన్న అన్ని నియోజకవర్గాలను ఈ బడ్జెట్ సంతృప్తి పరిచింది. రైతుల, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పటిష్టతను ఇది ఎక్కువగా ఫోకస్ చేసింది. డిజిటల్ ఇండియా ప్రొగ్రామ్‌పై ప్రభుత్వం దృష్టిసారిస్తూనే ఉంది. డిజిటల్ పరంగా లైఫ్ ఇన్సూరెన్స్ సెక్టార్‌ను ప్రోత్సహించడానికి పలు అవకాశాలను ఈ బడ్జెట్‌లో కల్పించింది

– మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ప్రశాంత్ త్రిపాటి



2019 మధ్యంతర బడ్జెట్.. మధ్యతరగతి వర్గ ప్రజలు, గ్రామీణ రంగం, రైతుల ఆదాయం పెంపుదలపై ఎక్కువగా ఫోకస్ చేసింది. గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయాన్ని, వినియోగాన్ని పెంచడానికి, పెద్ద మొత్తంలో వనరులను అందిస్తుంది. అయితే వినియోగం పెంపుదలతో.. స్థానిక తయారీ కల్పించడం, ఉద్యోగాలివ్వడం కష్టమే

– వాల్‌మార్ట్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో క్రిష్ అయ్యర్

ఈ బడ్జెట్ చాలా ప్రొత్సాహకరంగా ఉంది. సిమెంట్ రంగానికి, పరిశ్రమకు డైరెక్ట్ విజన్‌ను ప్రకటించకపోయినా.. దాని సంబంధిత రంగాల కీలక ప్రకటనలు, సిమెంట్ ఇండస్ట్రీని పాజిటివ్ ధోరణిలో నడిపిస్తాయి. గ్రామీణ ప్రాంత రోడ్ల కోసం కేటాయించిన రూ.19వేల కోట్లు సిమెంట్ ఇండస్ట్రీకి బూస్టప్‌ను ఇస్తుంది.

–దాల్మియా సిమెంట్(భారత్) లిమిటెడ్ ఎండీ, సీఈవో మహేంద్ర సింఘి

ఇండియాలో ఉన్న అన్ని నియోజకవర్గాలను ఈ బడ్జెట్ సంతృప్తి పరిచింది. రైతుల, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పటిష్టతను ఇది ఎక్కువగా ఫోకస్ చేసింది. డిజిటల్ ఇండియా ప్రొగ్రామ్‌పై ప్రభుత్వం దృష్టిసారిస్తూనే ఉంది. డిజిటల్ పరంగా లైఫ్ ఇన్సూరెన్స్ సెక్టార్‌ను ప్రోత్సహించడానికి పలు అవకాశాలను ఈ బడ్జెట్‌లో కల్పించింది

– మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ప్రశాంత్ త్రిపాటి




ఇది అద్భుతమైన బడ్జెట్. నా ప్రియమైన మిత్రుడు, ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ఈ జాబ్‌ను నిర్వర్తించినందుకు అభినందనీయం. ఇది ప్రజల బడ్జెట్. ఎకానమీకి ఎంతో సహకరిస్తుంది. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం ఫుల్ జోష్‌నిచ్చింది

– స్పైస్‌జెట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ సింగ్



పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది డ్రీమ్(మధ్యంతర) బడ్జెట్. ప్రొత్సాహకాల రూపంలో రైతులకు, అనధికారిక రంగానికి మెగా పెన్షన్ స్కీమ్ రూపంలో, వేతన జీవులకు రూ.5 లక్షల వరకు ట్యాక్స్ రిబేట్, మూలధన లాభాల మినహాయింపు నిబంధనల రూపంలో గృహరంగానికి వరాల జల్లు కురిపించారు. అయితే వీటి వల్ల వచ్చే రెండేళ్లలో ఆర్థిక లోటు 3.4 శాతంపెరిగి, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపనుంది

– కేపీఎంజీ ఇండియా కార్పొరేట్ అండ్ ఇంటర్నేషనల్ ట్యాక్స్ హెడ్, పార్టనర్ హిమాన్ను పరేఖ్



బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతితో భేటీ అయిన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, ఇతర మంత్రులు, అధికారులు

బిజినెస్‌ను మార్చిన జీఎస్టీ

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యాపార, వాణిజ్యవర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థికమంత్రి పీయుష్‌గోయల్ శుక్రవారం పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రకటించారు. జీఎస్టీ అమలు వల్ల అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు ఎంతో మేలు జరిగిందని ఉన్నారు. చిన్న వ్యాపార సంస్థలకు త్వరగా అప్పు పుట్టేలా చర్యలు తీసుకున్నామని ప్రకటించారు. పన్నుల రాబడి పెంచామన్నారు. కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని చెప్పారు. కేవలం 59 నిమిషాల్లో కోటి రూపాయల వరకు రుణం ఇచ్చే కార్యక్రమాన్ని ఇటీవలే ప్రారంభించామన్నారు. జీఎస్టీలో నమోదు చేసుకున్న ఎస్‌ఎంఈలు కోటి రూపాయల ఇంక్రిమెంటల్ లోన్ తీసుకుంటే వడ్డీపై రెండుశాతం రాయితీ ఇస్తామన్నారు. ప్రభుత్వసంస్థలు ఇక నుంచి ఎస్‌ఎంఈల నుంచి కనీసం కొనే వస్తువుల పరిమాణాన్ని 25 శాతానికి పెంచామన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన 'గవర్నమెంట్ ఈమార్కెట్ ప్లేస్ (జీఈఎం)' వల్ల ఎంఎస్‌ఎంఈలు సులువుగా అమ్మకాలు సాగిస్తున్నాయని మంత్రి చెప్పారు. ఇవి పూర్తిపారదర్శకంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని అన్నారు. వీటి ద్వారా ఇప్పటికే రూ.17,500 కోట్ల విలువ లావాదేవీలు జరిగాయి. అన్ని సీపీఎస్‌ఈలకు జీఈఎం సదుపాయాన్ని విస్తరిస్తున్నారు. చిల్లర వ్యాపారం అభివృద్ధి, వ్యాపారులు, వారి ఉద్యోగుల సంక్షేయానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతను 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్'కు అప్పగించామని గోయల్ వివరించారు. ఇక నుంచి దీనిని 'డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్'గా వ్యవహరిస్తామని అన్నారు. మరిన్ని వాణిజ్య అంశాలపైనా మంత్రి పలు ప్రకటనలు చేశారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

జీఎస్టీతో ఎన్నో లాభాలు

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన అతిపెద్ద పన్ను సంస్కరణ జీఎస్టీ. ఫలితంగా కొత్తగా చాలా మంది పన్ను పరిధిలోకి వచ్చారు. పన్నుల వసూళ్లు పెరిగాయి. వ్యాపారం సులభతరంగా మారింది. రిటర్నుల దాఖలును పూర్తిగా ఆన్‌లైన్ చేసి ఈ-వే బిల్ విధానాన్ని ప్రవేశపెట్టాం. ఫలితంగా రాష్ట్రాల మధ్య రవాణాకు అడ్డంకులు తొలగిపోయాయి. జీఎస్టీ రాకముందు కొన్ని వస్తువులపై భారీగా పన్నులు ఉండేవి. జీఎస్టీ వచ్చాక అవన్నీ తొలగిపోయాయి. వినియోగదారులకు ఏటా రూ.80 వేల కోట్లు ఆదా అవుతోంది. అత్యధికులు ఉపయోగించే వస్తువులపై పన్నురేటు 0-5 శాతం మధ్యే ఉంది. సినిమా టికెట్లపై ఎన్నో పన్నులు ఉండేవి. ఇప్పుడు 12 శాతం చెల్లిస్తే చాలు. జీఎస్టీతో చిన్న వ్యాపారులకు, ఉత్పత్తిదారులకు ఎంతో మేలు జరుగుతోంది. చిన్న వ్యాపారులకు జీఎస్టీ మినహాయింపు పరిధిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పెంచాం. రూ.1.5 కోట్ల టర్నోవర్ ఉండే చిన్న వ్యాపారులకు ఫ్లాట్ రేటు ఒక్కశాతం మాత్రమే ఉంటుంది. సర్వీసు ప్రొవైడర్ల టర్నోవర్ రూ.50 లక్షల వరకు ఉంటే, కాంపొజిషన్ స్కీమ్‌ను ఎంచుకోవచ్చు. వీళ్లు 6-18 శాతం వరకు జీఎస్టీ చెల్లించాలి. వ్యాపార అనుకూల విధానాల వల్ల 35 లక్షల మంది చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులు, సర్వీసు ప్రొవైడర్లు బాగుపడ్డారు.

- 2022 నాటికి కొత్త ఇండియాను సృష్టిస్తాం
- ఇందుకు మరిన్ని సంస్కరణలు తెస్తాం
- ఐటీ పరిధిలోకి కొత్తగా కోట్లాది మంది వచ్చారు
- రూ.17 లక్షల కోట్ల విలువైన ఎఫ్‌డీఐలు వచ్చాయి
- ఆర్థికమంత్రి పీయుష్ గోయల్

1.30 లక్షల కోట్లు నల్లధనం వెలికితీశాం...

"బ్లాక్‌మనీకి వ్యతిరేకంగా తీసుకున్న చర్యల వల్ల, నోట్లరద్దు వల్ల రూ.1.30 లక్షల కోట్ల విలువైన అప్రకటిత ఆదాయం వెల్లడయింది. ఇందులో రూ.50 వేల కోట్లను స్వాధీనం చేసుకున్నాం. నల్లధనాన్ని నిర్మూలించడంపై చిత్తశుద్ధితో ఉన్నాం. అంతేగాక రూ.6,900 కోట్ల విలువైన బినామీ ఆస్తులను, రూ.1,600 కోట్ల విలువైన విదేశీ స్తులను గుర్తించాం. దాదాపు 3.38 లక్షల డొల్ల కంపెనీల గుర్తింపు రద్దు చేశాం. వాటి డైరెక్టర్లను అర్హులుగా ప్రకటించాం. ప్రత్యక్ష పన్నుల రాబడి 18 శాతం పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1.06 కోట్ల మంది ఐటీ రిటర్నులు దాఖలు చేశారు" అని గోయల్ వివరించారు. నల్లధనం నిర్మూలనలో భాగంగా మోదీ ప్రభుత్వం 2016, నవంబరు ఎనిమిదిన రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. తదనంతరం వీటిస్థానంలో కొత్త రూ.500 నోటు, రూ.రెండువేల నోట్లను విడుదల చేసింది.

గత ఐదేళ్లలో 239 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు

"సుస్థిర ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుండటం వల్ల గత ఐదేళ్లలో 239 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.17 లక్షల కోట్లు) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐలు) ఆకర్షించాం. ఎఫ్‌డీఐ విధానాన్ని సరళీకరించడం వల్ల ఆటోమేటిక్ అప్రూవల్ రూట్‌లో చాలా ఎఫ్‌డీఐలు వచ్చాయి. సింగిల్ బ్రాండ్ రిటైల్, డిఫెన్స్, ఎయిర్‌లైన్స్, ఫుడ్‌ప్రాసెసింగ్ సెక్టర్లలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి సులువుగా అనుమతులు ఇచ్చాం. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలికమ్యూనికేషన్స్, ట్రేడింగ్, కన్‌స్ట్రక్షన్స్, ఆటోమొబైల్స్, పవర్ సెక్టర్లలోకి భారీగా పెట్టుబడులు వచ్చాయి" అని మంత్రి తెలిపారు.





ఎస్‌బీఐకి రూ.3,955 కోట్ల లాభం

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద బ్యాంకు ఎస్‌బీఐ క్యూ3 అంచనాలను అందుకుంది. గత నెలతో ముగిసిన మూడో క్వార్టర్‌లో రూ.3,955 కోట్ల లాభం సంపాదించింది. ప్రొవిజన్లు తగ్గడం, ఎన్ఐఐ వృద్ధి వల్ల రాబడులు పెరిగాయి. ఏడాది క్రితం ఇదే క్వార్టర్‌లో రూ.2,416 కోట్ల లాభాలు సాధించింది. సెప్టెంబరుతో ముగిసిన క్వార్టర్‌తో పోలిస్తే ఈసారి లాభం దాదాపు నాలుగు రెట్లు పెరగడం విశేషం. గత ఏడాదితో పోలిస్తే ఈ క్వార్టర్ నికర వడ్డీ ఆదాయం 21.4 శాతం పెరిగి రూ.22,691 కోట్లకు చేరింది. రుణాలవృద్ధి 12.1 శాతం నమోదయింది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ 2.97 శాతం పెరిగింది. సెప్టెంబరు క్వార్టర్‌లో ఇది 2.92 శాతం నమోదయింది. ఆస్తుల నాణ్యత పెరిగింది. ఇది వరకటి క్వార్టర్‌తో పోలిస్తే ప్రస్తుత క్వార్టర్‌లో స్థూల అడ్వాన్సుల్లో స్థూల ఎన్‌పీఏల శాతం 9.95 శాతం నుంచి 8.71 శాతానికి తగ్గింది. నికర అడ్వాన్సుల్లో నికర ఎన్‌పీఏలు 4.84 శాతం నుంచి 3.95 శాతానికి తగ్గాయి. గత ఏడాదితో పోలిస్తే స్థూల ఎన్‌పీఏలు రూ.1.87 లక్షల కోట్ల మేర, నికర ఎన్‌పీఏలు రూ.80,943 కోట్ల మేర తగ్గాయి. ప్రొవిజన్లకు, కంటింజెన్సీలకు కేటాయింపులు గత క్వార్టర్‌లో రూ.12,092 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.6,006 కోట్లు మాత్రమే ఇచ్చారు. 2017 డిసెంబరులో క్వార్టర్‌లో వీటి విలువ రూ.18,876 కోట్లు కావడం గమనార్హం. అయితే సెప్టెంబరులో క్వార్టర్ ఎన్‌పీఏలకు రూ.10,184 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.13,971 కోట్లకు పెంచారు.

బడ్జెట్ రోజున మార్కెట్లు లేచాయ్.. పడ్డాయ్.. లేచాయ్



ముంబై

బడ్జెట్ సందర్భంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లు భారీ ఒడిదుడుకులకు లోనై చివరకు సాధారణ లాభాల్లో ముగిసాయి. బడ్జెట్ నేపథ్యంలో ఉవ్వెత్తున ఎగిసిన సూచీలు ఆ తరువాత అదే స్థాయిలో కిందకు దిగివచ్చాయి. ఉదయం నుండే భారీ లాభాల్లో కొనసాగిన సూచీలు మధ్యాహ్నం తరువాత కొన్ని స్టాక్స్ భారీ నష్టాలను మూటగట్టుకోవడం, అమ్మకాల ఒత్తిడి వంటివాటితో స్టాక్ మార్కెట్లు దిగివచ్చాయి. శుక్రవారం ట్రేడింగ్ లో సెన్సెక్స్ 500 పాయింట్ల మేర పెరిగి ఆ తరువాత మార్కెట్ ముగిసే సమయానికి 212 పాయింట్ల లాభంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆటో, కన్సమ్షన్ స్టాక్స్ చివర్లో మార్కెట్లను నిలబెట్టాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 212.74 పాయింట్లు పెరిగి 36,469.43 పాయింట్లు వద్ద స్థిరపడగా, నిఫ్టీ 62.70 పాయింట్లు పుంజుకుని 10,893.65 వద్ద ముగిసింది. జనరల్ ఎలక్షన్లను దృష్టిలో పెట్టుకుని పాపులిస్టిక్ బడ్జెట్ ను ప్రకటించి, ఈ యేడాదికి గాను ద్రవ్యలోటు టార్గెట్ కు మించే ఉంటుందని అంచనా వేస్తున్నప్పటికీ ఇన్వెస్టర్లలతో మాత్రం పాజిటివ్ సెంటిమెంట్ కొనసాగింది. బీఎస్ఈ లో ఆటో కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎమ్‌సిజి, రియాల్టి రంగాల సూచీలు 2.62 శాతం దాకా లాభపడ్డాయి. హీరో మోటోకార్ప్, మారుతి, హెచ్‌సిఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో, భారతి ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ వంటివి 7.48 శాతం లాభపడ్డాయి. ఇక వేదాంత ఇవాల్టి ట్రేడింగ్ లో 17.82 శాతం నష్టపోయింది. యస్ బ్యాంక్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, ఆక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ స్టాక్స్ 4.68 శాతం దాకా నష్టపోయాయి. డాలర్ తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 24 పైసలు నష్టపోయి రూ.71.32 వద్ద ఉంది.

అదరగొట్టిన డాక్టర్ రెడ్డీస్



హైదరాబాద్, వెలుగు

నగరానికి చెందిన డాక్టర్ రెడ్డీస్ డిసెంబర్ తో ముగిసిన మూడవ త్రైమాసికానికి ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ (పిఎటి) లో 45 శాతం వృద్ధి కనబరిచింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.334 కోట్ల ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ ఆర్జించగా, ఈ క్యూ3 లో రూ.485 కోట్లు సాధించింది. రెండో త్రైమాసికంతో పోలిస్తే పిఎటి 4 శాతం తగ్గినప్పటికీ గతేడాది క్యూ3 తో పోలిస్తే 45 శాతం పెరిగింది. మొత్తం రెవెన్యూ గతేడాది క్యూ3 లో రూ.3,806 కోట్లు కాగా ఈ యేడాది క్యూ3 కి గాను 1 శాతం వృద్ధి చెంది రూ.3,850 కోట్లకు చేరుకుంది. దేశీయంగా గతేడాది క్యూ3 తో పోలిస్తే రెవెన్యూ 10 శాతం పెరిగి రూ.674 కోట్లుగా నమోదైంది. నార్త్ అమెరికా లో గతేడాది క్యూ3 తో పోలిస్తే రెవెన్యూ 8 శాతం తగ్గి రూ.1,483 కోట్లుగా ఉంది. క్యూ3 లో 10 కొత్త ప్రాడక్టులను నార్త్ అమెరికా మార్కెట్లో ప్రవేశపెట్టామని, అయినా అక్కడి పన్ను అసమానతల వల్ల రెవెన్యూలో ఆశించిన వృద్ధి కనబరచలేదని డాక్టర్ రెడ్డీస్ సీఎఫ్‌వో సోమెన్ చక్రవర్తి తెలిపారు. మరో 3 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. వర్ధమాన దేశాల్లో గణనీయంగా వృద్ధి చెందుతున్నామని, చైనాలో తమ రెవెన్యూ 100 మిలియన్ డాలర్లను దాటిందని చెప్పారు.

మరో పదేళ్లలో 2 కోట్ల ఎలక్ట్రిక్ వెహికిల్స్

న్యూఢిల్లీ: రవాణా రంగంలో ఇండియా, ప్రపంచంలోనే ముందంజలో ఉండబోతుందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీలు), ఎనర్జీ స్టోరేజ్ డివైజ్‌లు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. రవాణా రంగ సంస్కరణల్లో ప్రపంచంలోనే ఇండియా ముందంజలో ఉండనుందని, ఇది ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా సాధ్యమవుతుందని చెప్పారు. ఎనర్జీ స్టోరేజ్ డివైజ్‌లను దిగుమతి చేసుకోవడాన్ని తగ్గిస్తామన్నారు. గ్రీన్ టెక్నాలజీలు మన దేశాన్ని ఎనర్జీ అవసరాల్లో స్వతంత్రంగా ఎదిగేందుకు సాయపడనున్నాయని గోయల్ పేర్కొన్నారు. విదేశాల నుంచి దిగుమతులను తగ్గించుకుంటేనే రెన్యూవబుల్ ఎనర్జీ వేగవంతంగా వృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు వాడటం ప్రారంభించినప్పటి నుంచి, విదేశీ కరెన్సీ మిగలడమే కాకుండా.. దేశం స్వతంత్ర శక్తిని పొందుతుందని తెలిపారు.



క్యూ3 లో ఎన్ఎమ్‌డిసి ప్రాఫిట్ 78 % జంప్

హైదరాబాద్, వెలుగు: ఎన్ఎమ్‌డిసి (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) క్యూ3 ఫలితాల్లో రూ.3,649 కోట్ల టర్నోవర్ సాధించింది. గతేడాది క్యూ 3 ఫలితాల్లో సాధించిన రూ.2,4 69 కోట్లతో పోలిస్తే ఈసారి 48 శాతం వృద్ధిని నమోదుచేసింది. ఇక ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ లో 78 శాతం వృద్ధి కనబరిచి రూ.1,577 కోట్లు ఆర్జించింది. 2018-19 మూడవ త్రైమాసికంలో కంపెనీ 9.54 మిలియన్ టన్నుల ముడి ఇనుము ను ఉత్పత్తి చేయగా, 8.7 మిలియన్ టన్నుల ముడి ఇనుము అమ్మకాలు జరిగినట్లు ఎన్ఎమ్‌డిసి తెలిపింది. తాజాగా ఎన్ఎమ్‌డిసి బోర్డు 10,20,40,815 ఈక్విటీ షేర్లను బై బ్యాక్ చేయడానికి అనుమతించింది. ఒక్కో షేరుకు రూ.98 విలువతో రూ.వెయ్యి కోట్లు మించకుండా షేర్ బైబ్యాక్ చేయాలని నిర్ణయించింది. దొనిమలాయ్ సెక్టార్, బైలాదిలా సెక్టార్లలో పలు సవాళ్లను ఉద్యోగులు అధిగమించారని బోర్డు చైర్మన్ బైజేంద్ర కుమార్ అభినందించారు.

ఆర్‌కామ్‌కు దివాలాయే దిక్కు!



న్యూఢిల్లీ: అప్పుల చెల్లింపులో మరోసారి విఫలం కావడంతో దివాలా ప్రక్రియకు వెళ్లాలని అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ నిర్ణయించింది. ఈ కంపెనీ తన అన్న ముకేశ్ అంబానీకి చెందిన జియోకు స్పెక్ట్రం కూడా అమ్ముకోలేకపోయింది. తనకు బకాయిలు చెల్లించడంతో విఫలమైనందున ఆర్‌కామ్ దివాలా ప్రక్రియను ప్రారంభించాలని స్వీడిష్ కంపెనీ ఎరిక్సన్ ఇది వరకే ఎన్సీఎల్టీలో పిటిషన్ వేసింది. అయితే ఆర్‌కామ్ విజ్ఞప్తి మేరకు న్యాయస్థానం అప్పుల చెల్లింపునకు గడువు పొడగించింది. ఈ కంపెనీకి దాదాపు రూ.46 వేల కోట్ల అప్పులు ఉన్నాయని అంచనా. దాదాపు 40 మంది రుణదాతలకు రూ.25 వేల కోట్లు చెల్లించడానికి ఆస్తులను అమ్మకానికి పెట్టింది. అయితే ఆర్‌కామ్ రుణబాధ్యతను స్వీకరించడానికి జియో ఒప్పుకోకపోవడంతో స్పెక్ట్రం, ఇతర ఆస్తుల అమ్మకం ముందుకు సాగలేదు.



రెండు దశాబ్దాల తర్వాత మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి మళ్లీ తెలుగులో నటించిన చిత్రం 'యాత్ర'. ఇందులో ఆయన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాత్రను పోషించారు. ఫిబ్రవరి 8న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా మమ్ముట్టి ఇలా ముచ్చటించారు.

కథ నచ్చితే ఇక్కడా నటిస్తా

::: మమ్ముట్టి

- చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ తెలుగులో నటించాను. ఇప్పటివరకూ 380 సినిమాల వరకూ చేశాను. వాటిలో 70 చిత్రాలతో కొత్త దర్శకులను పరిచయం చేశాను. కొత్త దర్శకులైతే ఓ విషయాన్ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నిస్తారని నేను నమ్ముతాను.
- ఒకప్పుడు విశ్వనాథ్‌గారి సినిమా 'స్వాతికిరణం'లో నటించాను. గ్రే షేడ్ ఉన్న పాత్ర. తర్వాత కోడి రామకృష్ణగారి డైరెక్షన్‌లో 'రైల్వే కూలి' సినిమా చేయాల్సింది కానీ కుదరలేదు. మళ్లీ ఇన్నేళ్లకు తెలుగులో నటించాను. ఏదీ ప్లాన్ ప్రకారం చేయలేదు. ఈ మధ్య ప్రతి సినిమా ఇండస్ట్రీలో చాలా మార్పులొచ్చాయి. తెలుగులో వైవిధ్యమైన సినిమాలు వస్తుండటం మంచి పరిణామం. మంచి కథతో దర్శకులు వస్తే నేనూ ఇక్కడ సినిమాలు చేస్తాను.
- స్క్రిప్ట్ మాత్రమే విన్నాను. అందులో నిజమైన చరిత్ర, సంఘటనలు ఉండొచ్చు, ఉండకపోవచ్చు. సాధారణంగా ఒక వ్యక్తి జీవితాన్ని రెండు గంటల్లో చెప్పలేం. వైఎస్ఆర్ పాదయాత్ర నేపథ్యంలో ఏం జరిగిందనేది మాత్రమే ఈ సినిమా. యాత్ర అంటే కేవలం నడక కాదు.. వ్యక్తులను కలుసుకోవడం, వారి బాధలను, ఎమోషన్స్‌ను పంచుకోవడం, వారి సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకడం. రకరకాల మనుషుల సమస్యలు, వారి కష్టసుఖాలు ఇందులో ఉన్నాయి.
- వైఎస్ఆర్‌ని ఇమిటేట్ చేయాలనుకోలేదు. ఆయనలా నడవడం, మాట్లాడటం, ప్రవర్తించడం సాధ్యం కాదు. ఆయనో డిఫరెంట్ పర్సనాలిటీ. ఆయన్ని గుర్తు చేసుకుంటూ చూస్తే.. నేను కేవలం చేయి ఊపినా ఆయనలాగే కనిపిస్తాను.
- ప్రత్యేకంగా రీసెర్చ్ ఏమీ చేయలేదు. దర్శకుడు చెప్పిన స్క్రిప్ట్‌ను ఫాలో అయ్యానంతే. ప్రజలు ఏ భాష వారైనా వారి ఎమోషన్స్ అన్నీ ఒకేలా ఉంటాయి. పేదరికానికి రంగు ఉండదుగా!
- ఇప్పటి వరకూ రాజకీయ నేపథ్యమున్న చిత్రాల్లో నటించాను తప్ప... ఒక రాజకీయ నాయకుడి బయోపిక్‌లో నటించడం ఇదే తొలిసారి. అలాగని దీన్ని బయోపిక్ అనలేం. ఆయన జీవితంలోని పాదయాత్ర అనే ఘట్టం మాత్రమే ఈ సినిమా. నన్ను అందరూ అడుగుతుంటారు రాజకీయాల్లోకి వెళ్తారా అని. వెళ్లను... నటుడిగా ఉండటమే నాకిష్టం.
- మలయాళ భాషకి చాలా దగ్గరగా ఉంది తెలుగు. ఉదాహరణకు అద్భుతం అనే పదాన్ని మేము అల్భుదం అని పలుకుతాం. ఇలా రెండు భాషల్లోని చాలా పదాల మధ్య పోలికలున్నాయి. ఎటొచ్చీ పలికే విధానంలో కొంత తేడా ఉంది. దాన్ని సరిజేసుకుంటూ డబ్బింగ్ చెప్పాను. తమిళ చిత్రం 'పేరంబు'కు కూడా నేనే డబ్బింగ్ చెప్పాను. 'అంబేద్కర్'ను ఇంగ్లీష్‌లో తీసినప్పుడూ నేనే చెప్పాను. రంగస్థలం, భరత్ అనే నేను చిత్రాలు అమెజాన్ ప్రైమ్‌లో చూశాను. చాలా తెలుగు ఇంటర్వ్యూస్, బాలకృష్ణ స్పీచ్‌తో సహా పలు యూట్యూబ్ క్లిప్స్ చూసి నా తెలుగు ఉచ్చారణను సరిచేసుకున్నాను.
- మూడేళ్ల క్రితం 'పేరంబు' సినిమా మొదలుపెట్టాం. ఈ శుక్రవారం తమిళంలో విడుదలైంది. 'యాత్ర' చిత్రాన్ని గత సంవత్సరం ప్రారంభించాం. ఇప్పుడు విడుదలవుతోంది. ఇది ప్లాన్ చేసింది కాదు... యాదృచ్ఛికం. 'పోకిరిరాజా' సీక్వెల్ 'మధుర రాజా' షూటింగ్ జరుగుతోంది. ఏప్రిల్‌లో విడుదల కానుంది. 'యాత్ర'తో తెలుగు ప్రేక్షకులు నన్ను యాక్సెప్ట్ చేస్తే ఆ సినిమా కూడా ఉగాదికి తెలుగులోకి వస్తుంది.

వరుణ్‌తో వాళ్లిద్దరూ?


తమిళంలో హిట్టయిన 'జిగర్తాండ' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేస్తోన్న సంగతి తెలిసిందే. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ నెగిటివ్ రోల్ చేయబోతున్నాడు. ఈ సినిమాకి సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు వినిపిస్తున్నాయి. వరుణ్ విలన్ అయితే హీరో ఎవరు అన్న ప్రశ్నకి సమాధానంగా శ్రీవిష్ణు పేరు వినబడుతోంది. డిఫరెంట్ సినిమాలతో ఆకట్టుకుంటోన్న అతడైతే బాగుంటుందని టీమ్ డిసైడైనట్టు వినికిడి. మరోపక్క హీరోయిన్ విషయంలో కూడా ఒక ఊహించని పేరు వినిపిస్తోంది. యూట్యూబ్‌లో డబ్ స్మాష్‌ల ద్వారా పాపులర్ అయిన మృణాళినీ రవిని ఫిమేల్ లీడ్‌గా తీసుకోనున్నారట. మరి ఈ రెండు విషయాలూ ఎంతవరకూ నిజమో.








నేనంత చీప్ కాదు



అక్షర హాసన్ ఫొటోల లీకేజీ వ్యవహారం మర్చిపోకముందే హన్సిక ఫొటోలు నెట్‌లో లీకయ్యాయి. దాంతో తన ఫోన్, ట్విటర్ అకౌంట్స్ హ్యాక్ అయ్యాయని చెప్పింది హన్సిక. ట్విటర్ అకౌంట్ హ్యాక్ అయితే ఎలా ట్వీట్ చేస్తున్నావు అని, అవకాశాలు తగ్గడంతో పబ్లిసిటీ కోసం తనే అలా చేసి ఉంటుందని కొందరు కామెంట్ చేయడంతో హన్సిక ఘాటుగా స్పందించింది. 'ఫొటోలు లీకయిన బాధకంటే వీరి మాటలు ఎక్కువ బాధపెడుతున్నాయి. ఆ ఫొటోలన్నీ ఒరిజినల్ కాదు. కొన్నిటిని మార్ఫ్ చేశారు. అది తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం అన్యాయం. పబ్లిసిటీ కోసం ఇలాంటి చీప్ పనులు చేయాల్సిన అవసరం నాకు లేదు. మొదట్నుంచీ నేను లో ప్రొఫైలే మెయింటెయిన్ చేస్తున్నాను' అని చెప్పింది. మొత్తంగా నెటిజన్ల కామెంట్లకి హర్ట్ అయిన వారిలో రకుల్, రశ్మికలతో పాటు హన్సిక కూడా చేరిందన్న మాట.

ఒక్క సినిమా... 4 గెటప్స్



సింప్లిసిటీతో కూడా స్టార్ అయిపోవచ్చని ప్రూవ్ చేసిన ఘనత నానీది. మనిషి సింపుల్. ఎంచుకునే పాత్రలు సింపుల్. నటన సింపుల్. ప్రతి విషయంలోనూ ఉండే సహజత్వమే తనని, తన సినిమాలని ఇష్టపడేలా చేసింది. అయితే నానీని అంత సింపుల్‌గా చూపించదలచుకోలేదు దర్శకుడు విక్రమ్ కుమార్. తమ కాంబినేషన్లో రాబోయే సినిమాని కాస్త భారీగానే ప్లాన్ చేస్తున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం 'జెర్సీ' చేస్తోన్న నాని, అదయ్యాక విక్రమ్ కుమార్ డైరెక్షన్లో నటించబోతున్నాడు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇందులో నాని పాత్రకి నాలుగు షేడ్స్ ఉంటాయట. ఒక వ్యక్తి జీవితంలోని నాలుగు దశలు చూపిస్తారట. పంతొమ్మిదేళ్ల అబ్బాయిగా, పాతికేళ్ల యువకుడిగా, నలభయ్యేళ్ల మధ్య వయస్కుడిగా, అరవైకి చేరువైన వ్యక్తిగా... నాలుగు వయసుల వాడిగా నాని కనిపిస్తాడని సమాచారం. ఇలాంటి చాలెంజింగ్ సబ్జెక్టుల్ని డీల్ చేయడంలో విక్రమ్ కుమార్‌ది అందె వేసిన చేయి. ఎలాంటి పాత్రనైనా పండించడంలో నానికి తిరుగు లేదు. కాబట్టి ప్రేక్షకులకు కనువిందే.

4 లెటర్స్ చుట్టూ తిరిగే కథ



ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం '4 లెటర్స్'. ఫిబ్రవరి రెండో వారంలో ఈ సినిమా రిలీజ్ కానున్న సందర్భంగా దర్శక నిర్మాతలు సినిమా విశేషాలను ఇలా పంచుకున్నారు. దర్శకుడు రఘురాజ్ మాట్లాడుతూ... ''ఇది ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌ని దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా. నేనొక రోజు ఎయిర్‌పోర్ట్ నుంచి క్యాబ్‌లో వస్తుంటే కార్లో 'సైన్స్ ఈజ్ అబౌట్ నోయింగ్. ఇంజినీరింగ్ ఈజ్ అబౌట్ డూయింగ్. బట్ ఆల్ ఇంజినీర్స్ ఆర్ డయింగ్' అన్న కొటేషన్ కనిపించింది. అదేంటని డ్రైవర్‌ని అడిగితే... తానొక బీటెక్ స్టూడెంట్ అని, జాబ్స్ దొరక్క తనలాంటి వారంతా పదివేల రూపాయలకు చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నారని, ఇంజినీరింగుకి వాల్యూ లేదని చెప్పాడు. షాకయ్యాను. తర్వాత కొన్నిరోజులు అతనితో ట్రావెల్ చేసి ఇంజినీరింగ్ చేసిన వారి కష్టాలు తెలుసుకున్నాను. అలా ఈ స్టోరీ పుట్టింది. ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కి మా సినిమాలో ఒక మెసేజ్ కూడా ఉంటుంది. లవ్ ఎట్ సెకెండ్ లుక్ అన్న కొత్త కాన్సెప్ట్ కూడా ఉంది. 4 లెటర్స్ టైటిల్ పెట్టడానికి కారణం ఉంది. ఇందులో హీరో ఫాదర్‌కి POOR అనే ఫోర్ లెటర్స్ నచ్చవు. హీరోయిన్ తల్లికి RICH అనే ఫోర్ లెటర్స్ నచ్చవు. హీరోయిన్ LOVE అనే ఫోర్ లెటర్స్‌తో సతమతమవుతుంది. ఆమె తండ్రి జీవితంలో FAIL అనే ఫోర్ లెటర్స్ తప్ప ఏమీ అనుభవించడు. హీరో ఫ్రెండ్స్ PASS అనే ఫోర్ లెటర్స్ గురించి ఆలోచించరు. యూత్‌కి నచ్చే ఫోర్ లెటర్స్ కూడా ఈ చిత్రంలో ఉన్నాయి. ప్రీ ప్రొడక్షన్, షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్‌తో కలిపి డెబ్బై అయిదు రోజుల్లో ఫస్ట్ కాపీ రెడీ చేశాం'' అని చెప్పారు. నిర్మాత ఉదయ్ కుమార్ దొమ్మరాజు మాట్లాడుతూ... ''మా అబ్బాయి ఈశ్వర్‌కి చిన్నప్పట్నుంచీ సినిమాలంటే చాలా ఇష్టం. తనలో మంచి యాక్టర్ ఉన్నాడు. వైజాగ్‌లో సత్యానంద్ దగ్గర శిక్షణ తీసుకున్నాడు. సినిమా ఫీల్డ్‌కి నా ఫీల్డ్‌కి అసలు సంబంధం లేదు. నేను సివిల్ ఇంజినీర్‌ని. న్యూయార్క్‌తో పాటు ఇక్కడ కూడా పలు సాఫ్ట్‌వేర్ బిజినెస్‌లున్నాయి. సినిమా నిర్మాణంపై ఏమాత్రం అవగాహన లేదు. అయినా ఎక్కడా ఇబ్బంది లేకుండా సినిమా ప్రారంభించి పూర్తి చేశామంటే మా టీమ్ వల్లే. మేమంతా డైరెక్టర్‌ని నమ్మి ఈ సినిమా చేశాం'' అన్నారు.

స్వర సాహసం



కాస్టింగ్ కౌచ్ అయినా... మరింకే వివాదాస్పద విషయం గురించైనా తూటాలు పేల్చినట్టు మాట్లాడటం స్వరా భాస్కర్‌కి అలవాటు. అలాగే అన్యాయాలకు వ్యతిరేకంగా గళం విప్పడంలో కూడా ఆమె ఎప్పుడూ ముందుంటుంది. అందుకే అందరూ ఆమెకి ధైర్యం ఎక్కువ అంటారు. ఇప్పుడు సినిమాల విషయంలో కూడా నిర్ణయాలు ధైర్యంగా తీసుకోవడం మొదలుపెట్టింది స్వర. ఇటీవలే ఆమె ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసింది. మొదటి సినిమాగా స్వీటీ సేన్ కథను తెరకెక్కించే ప్రయత్నాల్లో ఉంది. అమ్మాయి అయివుండి, అబ్బాయిలా చెలామణీ అవుతూ, ఎంతోమంది ఆడపిల్లలను మోసం చేసి పెళ్లాడి, వాళ్ల డబ్బు దోచుకున్న నేరస్తురాలు స్వీటీ సేన్ ఉరఫ్ కృష్ణా సేన్. ఆమె జీవితం ఆధారంగా తెరకెక్కే ఈ చిత్రంలో స్వర స్వయంగా స్వీటీ పాత్రను పోషించనుంది. మొదటి ప్రయత్నమే ఇలాంటి నెగిటివ్ స్టోరీ, నెగిటివ్ పాత్రతో చేయడం పెద్ద సాహసమే అంటున్నారు బాలీవుడ్ జనాలు.

2020 ప్రేమకథ



అరవింద్, మోహిని హీరో హీరోయిన్లుగా పరిచయమవుతోన్న చిత్రం 'లవ్ 2020'. సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. మోహన్ మీడియా క్రియేషన్స్ పతాకంపై మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల, జో శర్మ అమెరికాకు చెందిన మెక్విన్ గ్రూప్ సహకారంతో నిర్మిస్తున్నారు. యూత్‌కి కనెక్ట్ అయ్యే విధంగా, అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోందని, రొటీన్ ప్రేమకథలకి భిన్నంగా ఉంటుందని చెబుతున్నారు టీమ్. హైదరాబాద్‌తో పాటు బెంగళూర్, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, ఇడుక్కి తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. ఫిబ్రవరి ఒకటి నుంచి ఆరు వరకు ముంబైలోని ముఖ్య ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్, ఒక సాంగ్ పూర్తి చేస్తారు. అనంతరం మిగతా కార్యక్రమాలన్నీ కంప్లీట్ చేసి ఏప్రిల్ నెలలో సినిమాని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో అతి తక్కువ ప్రేమకథలు విజయాన్ని చవిచూశాయి. మరి ఈ మోడ్రన్ లవ్ స్టోరీ ఎంత అలరిస్తుందో చూడాలి.



ఆన్ లొకేషన్



సల్మాన్ ఖాన్ హీరోగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'భారత్'. కత్రినా కైఫ్ కథానాయిక. ఇటీవలే ఒక పాట చిత్రీకరణ జరిగింది. ఆ లొకేషన్లో కొరియోగ్రాఫర్ వైభవీ మర్చంట్‌తో కత్రినా.

ట్విటర్ టాక్



కల్పనా చావ్లా వర్ధంతి సందర్భంగా మాధురీ దీక్షిత్ ఇలా ట్వీట్ చేసింది.

"ప్రతి తల్లీ తన కూతురికి కలలు కనడం నేర్పాలి. అంతరిక్షంలోకి అడుగు పెట్టిన తొలి భారతీయ మహిళ కల్పనా చావ్లాని అనుక్షణం గుర్తు చేయాలి. ఆమెని ఆదర్శంగా తీసుకొమ్మని చెప్పాలి. కల్పన మరణించి కూడా వెలుగుతున్న ధ్రువతార. ఆడపిల్లలందరికీ ఒక స్ఫూర్తి ప్రదాత."

ఫొటో ఫీస్ట్




పర్యావరణం పట్ల అమితమైన ప్రేమ రవీనా టాండన్‌కి. ఆ ప్రేమను తన పిల్లలకు కూడా కలిగించాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. అందులో భాగంగా వారిని అటవీ ప్రాంతాలకు, పంట పొలాల దగ్గరకు తీసుకెళ్తుంది. రీసెంట్‌గా తన కొడుకు రణబీర్‌తో అలా వెళ్లినప్పుడు తీసిన ఫొటో ఇది.

గప్‌చుప్

ఏ ముహూర్తాన తెలుగులో ఎంట్రీ ఇచ్చిందో కానీ... నాటి నుంచి నేటి వరకూ ఎప్పుడూ వార్తల్లోనే ఉంటోంది పాయల్ రాజ్‌పుత్. వరుస అవకాశాలు రావడమే అందుకు కారణం. 'సీత' సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ చేస్తోందన్న న్యూస్ రీసెంట్‌గానే తెలిసింది. ఇప్పుడు మరో క్రేజీ మూవీలో చాన్స్ కొట్టేసిందని అంటున్నారు. మరేదో కాదు... మన్మథుడు సీక్వెల్. నాగ్ హీరోగా రాహుల్ రవీంద్రన్ రూపొందించనున్న ఈ మూవీలో పాయల్‌ను ఆల్రెడీ సెలెక్ట్ చేసేశారన్న వార్త కాస్త గట్టిగానే వినిపిస్తోంది. ఎంతవరకూ నిజమో.

వరద ఉన్నప్పుడే చెరువులను నింపుకోవాలి



జూరాల ప్రాజెక్టును సందర్శించిన జిల్లా కలెక్టర్ శశాంక

- జిల్లా కలెక్టర్ శశాంక

గద్వాల, వెలుగు : నదికి వరద ఉన్నప్పుడే చెరువులు, కుంటలు, జలాశయాలను నీటితో నింపుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో కలిసి కలెక్టర్ జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు జలాశయం, పంప్‌హౌస్, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం స్టేజ్ 2ను, గుడ్డెందొడ్డి జలాశయాన్ని పరిశీలించారు. ఏ జలాశయం నుంచి ఎంత నీటిని సకాలంలో నింపుకుని ఎంత నీటిని దిగువకు వదులుతున్నారో అందుకు తగినట్లుగా నీటిని నింపుకోవాలని చెప్పారు. జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఎంత ఆయకట్టుకు నీటిని అందించడానికి వీలవుతుందన్నారు. పొలాలకు నీటిని అందించే కాల్వల పనులను రైతుల సహకారంతో నీటిని వృథా కాకుండా చేయాలని అన్నారు. వేసవిలో కాల్వల మరమ్మతులు చేపట్టి వానాకాలంలో నీటిని విడుదలకు ఏర్పడే ఇబ్బందులను తొలగించేలా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రాజెక్టులు, విద్యుదుత్పత్తి తయారు చేసే జెన్కో కేంద్రాలను సందర్శించేలా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. తాగునీటి సమస్యలు, తాగు పథకాలలో ఉన్న సమస్యలు, పైప్‌లైన్లలో లీకేజీలు, పగుళ్లు ఏ రకం సమస్య ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 18004253886కు ఫోన్ చేసి సమాచారం, ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాదాద్రి, వెలుగు: యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంగా కర్ణాటకకు తరలుతున్న రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి భువనగిరి ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. మండలానికి చెందిన ఆటో డ్రైవర్లు లావుడ్య వినోద్, సురేశ్, సుమన్, మురళి, రమేశ్, బానోత్ నరేశ్‌లు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలో రూ.7 చొప్పున కొని కేకే తండాలోని ఓ ఇంట్లో నిల్వ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని జగదేవ్‌పూర్‌లోని ఓ మిల్లులో నూకగా మార్చి కిలో రూ. 16 చొప్పున కర్నాటకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడ దానిని కోళ్ల దాణాగా వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి నూకను కర్నాటకలోని నాందేడ్‌కు తరలించేందుకు సిద్ధమవుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 160 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, నాలుగు టాటా ఏస్ వాహనాలను స్వాధీనం చేసుకొని, ఆరుగురు ఆటో డ్రైవర్లతో పాటు, నాందేడ్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్ అజీం, క్లీనర్ గణేష్ సూర్యకాంత్ షిండేను అదుపులోకి తీసుకొని బొమ్మలరామారం పోలీసులకు అప్పగించారు.



కేవి కేశవులు అంత్యక్రియలు

ధర్మపురి వెలుగు: స్వతంత్ర సమరయోధుడు, తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి కే.వి. కేశవులు అంత్యక్రియలు శుక్రవారం ధర్మపురిలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. రెండు రోజుల కింద ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లో చనిపోయారు. ఆయన మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఆయన స్వగ్రామమైన ధర్మపురికి తరలించారు. స్థానిక ప్రజల దర్శనం కోసం ఆయన మృతదేహాన్ని మున్సిపల్ ఆఫీసు ఆవరణలో ఉంచారు. ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత గోదావరి వరకు అంతిమ యాత్ర నిర్వహించి, ప్రభుత్వ లాంఛనాలతో అంతక్రియలు చేశారు. జాయింట్ కలెక్టర్ రాజేశం, అడిషనల్ ఎస్పీ మురళీధర్, స్థానిక నేతలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



పెద్దమ్మ గుడిలో సమావేశమైన కుల ప్రజలు



విచారణ జరుపుతున్న పోలీసులు

ఓటేశారా... ఒట్టేయండి

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా కుల పెద్దలు హరిస్తున్నారు. ఇష్టం వచ్చిన, నచ్చిన నాయకులకు కాకుండా కుల పెద్దలు నిర్ణయించిన వ్యక్తికే ఓటు వేసే ఆచారాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాలో తీసుకువస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కుల సంఘం నిలబెట్టిన వ్యక్తి ఓడిపోయాడని, కుల ఓట్లు చీలిపోయాయంటూ ప్రజల నిజాయతీని నిరూపించుకునే పరీక్ష పెట్టారు రాళ్లపేట కుల పెద్దలు. ఆలయంలో ప్రమాణం చేయాలని ఆదేశించారు.

రాజన్నసిరిసిల్ల, వెలుగు :

- పంచాయతీ ఎన్నికల్లో కులపెద్దలు నిర్ణయించిన అభ్యర్థి ఓటమి
- కులం కట్టు దాటారని పెద్దల ఆగ్రహం
- పెద్దమ్మ గుడిలో ప్రమాణం చేయాలని ఆదేశం

రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో ఓ సామాజికి వర్గం నుంచి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిలబెట్టిన నాగరాజు అనే వ్యక్తి 32 ఓట్లతో ఓడిపోయాడు. 230 ఓట్లు ఉన్న తమ సామాజికవర్గం వారిపై కేవలం 60 ఓట్లు ఉన్న వేరే కులం వ్యక్తి ఎట్లా గెలిచిండని కులపెద్దలు ఆరా తీశారు. మన కులపోళ్ల ఓట్లు మొత్తం మనకు పడలేదనే నిర్ణయానికి వచ్చారు. గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ దేవాలయంలో తమ కుల సంఘం మీటింగ్ పెట్టారు. సంఘసభ్యులు, పురుషులు, స్త్రీలు అందరిని పిలిపించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మన కులం ఓట్లు మనోళ్లకు పడలేదని, మనవారే మనల్ని మోసం చేశారని పేర్కొన్నారు. ఎవరెవరు నాగరాజుకు ఓటు వేశారో తెలియాలంటే.. పెద్దమ్మ గుడి ముందు గంట కొట్టి, గర్భ గుడిలోని అమ్మవారి ముందు ప్రమాణం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఓటు వేసినవారు కొందరు ప్రమాణం చేశారు. ప్రమాణం చేయడం ఇష్టం లేనివారు కొంతమంది చేయలేదు. దేవుడిపై తాము ప్రమాణం చేయమని పలువురు భీష్మించుకు కూర్చున్నారు. ఓటు ప్రమాణం విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. విషయం పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. ప్రమాణం చేయించడం చట్టరీత్యా నేరమని, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్కడి నుంచి అందరిని పంపించేశారు. కులపెద్దలు మాత్రం తాము ప్రతి నెలా కులం చిట్టీ వేసుకుంటామని, ప్రమాణం చేయించలేదని పేర్కొన్నారు. కొంతమంది మాత్రం ప్రమాణం చేయించారని, తాము చేయలేదని తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మా పైసల్ మాకియ్

ఇంటింటికి తిరిగి వసూళ్లు

కరీంనగర్, వెలుగు: ఎన్నికల పండగ అయిపోయింది. బరిలో ఉన్న అభ్యర్థులు ఇచ్చిన కాడికి తీసుకున్నరు. దొరికిన కాడికి తాగిండ్రు. ఇంతవరకు బాగానే ఉంది. గెలిచినోళ్లు సంబరాలు చేసుకుంటున్నారు.. కానీ ఓడిపోయిన వాళ్ల పరిస్థితే ఘోరంగా మారింది. ఇంటింటికి వెళ్లి నాకు ఓటేసినవా.. పైసలైతే తీసుకున్నవ్ గానీ... మావి మాకు ఇచ్చేయమంటూ గోలగోల చేస్తున్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెంలో ఓ అభ్యర్థి ఇలానే ఇంటింటికి వెళ్లి పైసలు వసూలు చేసుకున్నడు. ఇలాంటి సంఘటనే కరీంనగర్ జిల్లాలో జరిగింది. కరీంనగర్‌లోని హుజురాబాద్ డివిజన్ లో బుధవారం మూడో విడతలో ఎన్నికలు జరిగాయి. గురువారం ఉదయాన్నే అందరి ఇంటి తలుపులు తడుతూ మా పైసలు మాకివ్వండి అనే అరుపులు వినిపించడంతో ప్రజలంతా ఆశ్చర్యపోయారు. జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో ఓడిన అభ్యర్థులు తెల్లవారుజామున ఇంటింటికి వెళ్లి తలుపు కొట్టి మా డబ్బులు మాకు ఇవ్వండి లేకుంటే గుడిలో ప్రమాణం చేయండని అడిగారు. అయితే చాలామంది గుడి వద్ద గుమిగూడారు. డబ్బులు ఇవ్వమని ఎవరు అడిగారు.. ఎందుకిలా బజారుకీడుస్తున్నారంటూ లొల్లి చేశారు. ఇంట్లో రెండు ఓట్లు ఉంటే అటు ఒకటి.. ఇటు ఒకటి వేశా.. ఇది తప్పా అంటూ ఓటర్లు సమర్థించుకోవడం కొసమెరుపు.



గద్వాలలో మంత్రాలయ పీఠాధిపతి

గద్వాల, వెలుగు : గద్వాల కోటలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి జాతర ఈనెల 19 వ తేదీనుంచి జరుగనున్నందున ఏర్పట్లను పరిశీలించేందుకు మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శుక్రవారం గద్వాలకు వచ్చారు. కోటలో ఉన్న ఆలయాల నిర్వహణను స్వీకరించిన మంత్రాలయం పీఠం ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు జరగనున్నందున పరిశీలనకు పీఠాధిపతి వచ్చారు. ఆయనకు గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బియస్ కేశవ్, తెరాస పార్టీ సీనియర్ నాయకులు తిరుమల రెడ్డి, ధరూర్ నరసింహారెడ్డి, పాల్గొన్నారు.



యాదాద్రికి ఎల్‌ఈడీ వెలుగులు

యాదగిరికొండ, వెలుగు: యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు కోసం శుక్రవారం ఈసీవో సన్స్ అండ్ కంపెనీకి చెందిన అధికారులు, దేవాలయ విద్యుత్ శాఖ ఏఈఈ రామారావులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి వారి గర్భాలయం, గోపురాలు, మాఢవీధుల్లో లైటింగ్ ఏ విధంగా ఏర్పాటు చేయాలనే విషయాలపై చర్చించారు. అనంతరం స్థపతులు సుందర రాజన్, ఆనంద వేలుతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జాతర పనులు త్వరగా చేయాలి



సూర్యాపేట, వెలుగు: పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర వద్ద చేపట్టే పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డి.అమయ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, విద్యుత్, పంచాయతీరాజ్, దేవాదాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతర సమయం సమీపిస్తున్నందున ఫిబ్రవరి 17వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేయాలని, పనుల నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. జాతర నిర్వహణకు ఎనిమిది మందితో సమన్వయ కమిటీని ఏర్పాట్లు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పశు వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

పశు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పశువైద్యాధికారులతో పశు సంవర్ధక శాఖ జేసీ వేణు మనోహర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ సేవలు అందించాలని సూచించారు.



నేటినుంచి బ్రహ్మోత్సవాలు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమ వారం రథోత్సవం నిర్వహిస్తారు. కాళికాంశతో దర్శనమిచ్చే అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు. **నాగర్‌కర్నూల్, వెలుగు**

‘వేధింపుల వల్లే చనిపోయింది’

హన్మకొండ సిటి, వెలుగు;

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్రిష్టియానా వేధింపుల వల్లే కోర్టు అటెండర్ ఈగల టీనా చనిపోయిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీయస్ నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. టీనా శవం ఉన్న అంబులెన్సును కోర్టు గేటు ముందు నిలబెట్టి ఆందోళనకు దిగారు. క్రిష్టియానా అన్యాయంగా తమ బిడ్డను పొట్టన పెట్టుకుందని మృతురాలి తల్లి తాళ్లపల్లి ఏలియా, ఇద్దరు కూతుళ్లు ఆరోపించారు. మరణించిన టీనా కుటుంబానికి న్యాయం చేయాలని, వేధింపులకు పాల్పడిన కార్యదర్శిమీద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శ మంద కుమార్ మాదిగ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. మూడు గంటల సేపు ధర్నా జరుగగా, మృతురాలి పెద్దకూతురు సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను ఎంజీఎంకు తరలించారు.

అసలు ఏమి జరిగింది?

టీనా తన భర్త రవి, ఇద్దరు కూతుళ్లతో సుబేదారిలోని జూలైవాడలో ఉంటోంది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అనిరోజ్ క్రిష్టియానా తన దగ్గర అటెండర్‌గా పనిచేస్తున్న టీనాను మాటలతో వేధించి, మానసికంగా ఇబ్బందులకు గురి చేసిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కోర్టు పని, ఇంటి పని చేయించుకుంటూ వేధించేదన్నారు. నెలన్నర కింద తమ బంధువు చనిపోవడంతో టీనా సెలవు అడగగా, నువ్వు చచ్చిపో అంటూ తిట్టిందని, అప్పటి నుంచి టీనా మానసికంగా కృంగి పోయిందన్నారు. మరుసటి రోజు నిద్రమాత్రలు మింగి కోర్టు ఆవరణలో పడిపోయిన ఆమెను కోర్టు సిబ్బంది ఎంజీఎం ఆసుపత్రికి తరలించారన్నారు. నెల రోజుల నుంచి చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి మరింత విషమించడంతో శుక్రవారం చనిపోయిందని వివరించారు. టీనా చికిత్స పొందుతున్నా క్రిష్టియానా ఒక్కసారన్నా పరామర్శించేందుకు రాలేదని వాపోయారు. టీనా కుటుంబానికి న్యాయం చేస్తామని కోర్టు అధికారులు కుటుంబసభ్యులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



ధర్నాలో సొమ్మసిల్లి పడిపోయిన మృతురాలి పెద్ద కూతురు

- కుటుంబీకుల ఆందోళన
- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్
- కోర్టు ఎదుట మూడుగంటలపాటు ధర్నా

అరెస్టు చేయాలి

ఈగల టీనా మరణానికి కారణమైన క్రిస్టియానాను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. తన దగ్గర అటెండర్‌గా పనిచేస్తున్న టీనాను వేధించడంవల్లనే ఆమె ఆత్మహత్య చేసుకోబోయిందన్నారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బిర్రు మహేందర్, కందికట్ల విజయ్‌కుమార్, గోవింద్, నకరకంటి యాకన్న పాల్గొన్నారు. ధర్నా సందర్భంగా గొడవలు జరగకుండా హన్మకొండ ఏసీపీ చంద్రయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

వారసులకు నియామక పత్రాల పంపిణీ



కార్మికుల వారసులకు కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్

- నెలకు 253 మందికి అందజేయడమే లక్ష్యం
- సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు : కార్మికుల సంక్షేమానికి సింగరేణి యాజమాన్యం కట్టుబడి ఉందని కంపెనీ డైరెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద కార్మికుల వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల్లో భాగంగా ఆగస్టు నుంచి ప్రతీ నెల 253 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. సింగరేణిలో పదిశాతం కారుణ్య నియామకాలు కొత్తగూడెం ఏరియాలో ఉన్నాయని, ఈ నియామకాలకు సంబంధించి వారికి పత్రాలను అందజేయడంలో ఏరియా సీజీఎం, ఆఫీసర్ల చర్యలు అభినందనీయమని అన్నారు. కొత్తగాఉద్యోగాలు పొందిన వారంతా సీనియర్ కార్మికులు, ఆఫీసర్ల సూచనలు పాటిస్తూ వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏరియా సీజీఎం కేవీ రమణమూర్తి మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ నారాయణ, ఏరియా ఇంజినీర్ దామోదర్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు రజాక్, పీవోలు సంజీవరెడ్డి, షాలెం రాజు, ఏజెంట్ బైద్య, డీజీఎం జ్యోతి, సూర్యనారాయణ, డీవైఎస్ఈ మహేశ్, డీవైపీఎం కిరణ్‌బాబు పాల్గొన్నారు.



7వ అంతస్తు నుంచి దూకాడు

- ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య

సంగారెడ్డి, వెలుగు : ఏడో అంతస్తు నుంచి దూకి ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి రూరల్ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా తెనాలికి చెందిన అనిరుధ్ తల్లిదండ్రులు హైదరాబాద్ బోయినపల్లిలో నివాసం ఉంటున్నారు. అనిరుధ్ సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఐఐటీ (హెచ్) క్యాంపస్‌లో బీటెక్ మెకానికల్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తోటి మిత్రుడైన కనిష్క్ రెడ్డికి తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు ఎస్ఎంఎస్ పంపాడు. తెల్లవారుజామున క్యాంపస్‌లోని డి బ్లాక్ 7వ అంతస్తు పైనుంచి దూకాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని వెంటనే మిత్రులు క్యాంపస్‌లో ఉన్న హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అనిరుధ్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

ఏటా వెలుగు క్రికెట్ టోర్నీ

వరంగల్/ నిజామాబాద్, వెలుగు:

ఇక నుంచి ప్రతీ ఏటా వెలుగు వీ 6 ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వీఐఎల్ మీడియా చైర్మన్ వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. వెలుగు వీ6 మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వరంగల్‌లో చందా కాంతయ్య మెమోరియల్ కాలేజీ మైదానంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తమ కుటుంబానికి క్రికెట్ ఆటపై మక్కువ ఎక్కువ అన్నారు. 'ఉప్పల్‌లో క్రికెట్ స్టేడియం నిర్మాణంలో ఉన్నప్పుడు దానికి స్పాన్సర్ చేయాల్సిందిగా మా నాన్న వెంకటస్వామి నాపై ఒత్తిడి తెచ్చారు. అప్పుడు మా విశాక గ్రూపు ఇంత పెద్దగా లేదు. కేవలం మా నాన్న చేసిన ఒత్తిడితో స్పాన్సర్ చేశాను. అందువల్లే మా నాన్న పేరు మీద గతేడాది వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాం. ఈ టోర్నీ సందర్భంగా హైదరాబాద్‌లో పోటీలు ఎందుకు.. గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో క్రికెట్ క్రీడాకారులు ఉన్నారు. వారి కోసం రూరల్ ఏరియాలో టోర్నీ పెట్టవచ్చు కదా అని చాలా మంది నన్ను అడిగారు. ఇటీవల ఓ గ్రామీణ క్రీడాకారుడు మహారాష్ట్ర నుంచి 600 కిలోమీటర్ల దూరం నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగిన వెలుగు వీ 6 సెలెక్షన్స్‌కు వచ్చాడని తెలిసింది. అది విన్నప్పుడు గ్రామీణ క్రికెట్‌కు నేను చేయాల్సింది ఎంతో ఉందని అర్థమైంది. ఇకపై ఏటా వెలుగు వీ6 టోర్నమెంట్ నిర్వహిస్తామ'ని వివేక్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మర్రియాదవరెడ్డి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ రవికిరణ్‌లకు వివేక్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ క్రికెట్ మన క్రీడ కాదనే భావన ఉందని, ఇలాంటి టోర్నీల వల్ల ఆ అభిప్రాయం పోతుందన్నారు. ఇటీవల మహిళలు క్రికెట్ ఎక్కువగా ఆడుతున్నారని , వారి కోసం కూడా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించాలని కోరారు. గ్రామీణ క్రీడాకారుల కోసం జిల్లా స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని యాదవరెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ పెద్ద సక్సెస్ అయ్యిందని, ఇతర రాష్ట్రాలు ఆ టోర్నీని ఆదర్శంగా తీసుకున్నాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్న వెలుగు వీ-6 యాజమాన్యానికి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం తొలి రోజు పోటీలో పాల్గొంటున్న నర్సంపేట, వర్ధన్నపేట జట్లకు చెందిన క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. వివేక్ బౌలింగ్ చేయగా సుదర్శన్‌రెడ్డి కొద్ది సేపు బ్యాటింగ్ చేశారు. మధ్యాహ్నం నర్సంపేట, వర్ధన్నపేట మధ్య మ్యాచ్‌కు మాజీ మంత్రి జి. వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




వర్ధన్నపేట బ్యాట్స్‌మన్‌ను రనౌట్ చేసే ప్రయత్నం చేస్తున్న వరంగల్ తూర్పు జట్టు ఫీల్డర్లు

- క్రమం తప్పకుండా నిర్వహిస్తాం
- గ్రామీణ క్రికెటర్లను ప్రోత్సహిస్తాం
- ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకట స్వామి
- ఇదో మంచి ప్రయత్నం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

గ్రామాల్లో ప్రతిభకు కొదవలేదు: వరుణ్

గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ పట్ల పిచ్చిప్రేమతో ఆడే వారు ఎందరో ఉన్నారని వెలుగు క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ వరుణ్ అన్నారు. ఆర్మూర్ లోని జావీద్ భాయ్ మినీ స్టేడియంలో ప్రారంభమైన వెలుగు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లకు వెలుగు, వీ-6 సంస్థల డైరెక్టర్ వైష్ణవి, డాక్టర్ నవీన్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఆర్మూర్ లోని క్రికెట్ ప్రాంగణంలో జరిగే మ్యాచ్‌లకు హాజరైనక్రీడాకారుల కు ట్రాక్ సూట్లను అందిం చారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభగల క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రోత్సహిద్దామనే లక్ష్యంతో మొట్ట మొదటిసారిగా వెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల్లో వెలుగు క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని జిల్లాల నుంచి ఊహించనంత రెస్పాన్స్ వస్తోందని అన్నారు. జిల్లాల్లో ఆడిన క్రీడా జట్లనుంచి రాష్ట్రజట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని టోర్నమెంట్‌లో ప్రతిభను నిరూపించుకోవాలని క్రీడాకారులకు సూచించారు.



వీ6 వెలుగు క్రికెట్ పోటీలకు వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న వివేక్‌వెంకటస్వామి

వరంగల్ ఈస్ట్‌దే బోణీ

వీ6 వెలుగు టీ20 క్రికెట్‌లో వరంగల్ ఈస్ట్ బోణీ కొట్టింది. స్థానిక సీకేఎమ్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో వరంగల్ ఈస్ట్ ఎనిమిది వికెట్ల తేడాతో వర్ధన్నపేటపై ఘన విజయం సాధించింది. ఇదే మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో వర్ధన్నపేట నాలుగు వికెట్ల తేడాతో నర్సంపేట్‌పై విజయం సాధించింది.

సంక్షిప్త స్కోర్లు: వర్ధన్నపేట 11.1 ఓవర్లలో 60 ఆలౌట్ (శశాంక్ 17; అబ్రార్ 4/8), వరంగల్ ఈస్ట్ 7.1 ఓవర్లలో 61/2 (శివ 33 నాటౌట్), మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్: అబ్రార్; **నర్సంపేట్:** 20 ఓవర్లలో 146/5 (దేవేందర్ 35, అరుణ్ 33, రోమన్ 3/36), **వర్ధన్నపేట:** 19.5 ఓవర్లలో 147/6 (అఖిల్ 56, శ్రీనివాస్ 54), మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్: అఖిల్;

ఆర్మూర్ తొలి గెలుపు

నిజామాబాద్ జిల్లా పోటీల్లో ఆర్మూర్ టీమ్ తొలి విజయం ఖాతాలో వేసుకుంది. జావెద్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆర్మూర్ 14 పరుగుల తేడాతో నిజామాబాద్ రూరల్‌పై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో నిజామాబాద్ రూరల్ ఒక వికెట్ తేడాతో బాల్కొండ టీమ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది.

సంక్షిప్త స్కోర్లు: ఆర్మూర్ 20 ఓవర్లలో 145/5(నరేశ్ 42, షాహిద్ 32),
నిజామాబాద్ రూరల్: 20 ఓవర్లలో 131/9 (ఉపేందర్ 52);
బాల్కొండ: 20 ఓవర్లలో 137/6 (వెంకీ 43 నాటౌట్);
నిజామాబాద్ రూరల్ : 18.1 ఓవర్లలో 138/9 (ఉపేందర్ 47, సంపత్ 26)

బ్యాలెట్ బడ్జెట్ 2019-20

స్పోర్ట్స్‌కు మరో రూ.214 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్రం తాజాగా ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడలకు అదనంగా మరో రూ. 214.20 కోట్లు కేటాయించారు. 2018-19 సంవత్సరంలో స్పోర్ట్స్ బడ్జెట్ రూ. 2002.72 కోట్లు ఉండగా, 2019-20 సంవత్సరానికి ప్రకటించిన స్పోర్ట్స్ బడ్జెట్ మొత్తం 2216.92 కోట్ల రూపాయలుగా ఉంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కి, నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎన్ఎస్‌డిఎఫ్)లకు ఈ బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. సాయ్‌కు గత బడ్జెట్‌లో కేటాయింపులు రూ.395 కోట్లు ఉండగా, ఈ ఏడాది ఆ మొత్తాన్ని 450 కోట్లకు పెంచారు. మొత్తంగా సాయ్‌కు రూ. 55 కోట్లు అదనంగా కేటాయించారు. ఇక ఎన్ఎస్‌డిఎఫ్‌కు ఇంతకు ముందున్న రెండు కోట్ల ఫండ్‌ను ఏకంగా 70 కోట్లకు పెంచారు. దీంతో పాటు ప్లేయర్లకు ఇచ్చే ఇన్సెంటివ్ ఫండ్స్‌ను 63 కోట్ల నుంచి 89 కోట్లకు పెంచారు. అయితే నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్ (ఎన్ఎస్ఎఫ్)లకు ఇచ్చే మొత్తంలో స్వల్పంగా కోత పడింది. ఇంతకు ముందు ఈ మొత్తం 245.13 కోట్లు ఉండగా తాజాగా ఈ మొత్తాన్ని 245 కోట్లకు తగ్గించారు. ఇక ప్లేయర్లకు ప్రోత్సాహకాలు, అవార్డుల మొత్తం కూడా అదనంగా 94.07 కోట్లకు పెరిగింది. ఇంతకు ముందు ఏడాది ఈ మొత్తం రూ316.93 కోట్లు కాగా, తాజా బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.411 కోట్లకు పెంచారు. ఖేలో ఇండియా నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫర్ స్పోర్ట్స్ ఫండ్‌కు కూడా అదనంగా రూ.50.31 కోట్లు కేటాయించారు. గతంలో ఈ ఫండ్‌కు 550.69 కోట్ల నిధులుండగా, ఈ మొత్తం 601 కోట్లకు చేరింది.



2019–20 స్పోర్ట్స్ బడ్జెట్ రూ.2216.92 కోట్లు

పెరిగిన మొత్తం రూ 214 కోట్లు	స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ 55 కోట్లు	నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ 70 కోట్లు
ఖేలో ఇండియా రూ 50.31కోట్లు	ఆటగాళ్లకు ఇన్సెంటివ్ ఫండ్ రూ 89 కోట్లు	ప్లేయర్లకు అవార్డులు ప్రోత్సాహకాలు రూ 94.07కోట్లు

రిజల్ట్ రిపీట్

వరుసగా రెండో రోజు హామిల్టన్‌లో అదే సీన్ రిపీటైంది. రోహిత్ సేనకు ఎదురైన పరాభవాన్నే మిథాలీ గ్యాంగ్ కూడా రుచి చూసింది. న్యూజిలాండ్‌ను వైట్‌వాష్ చేస్తారనుకున్న మహిళలు కూడా ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయి అభిమానులను నిరాశపరిచారు. రోహిత్ మాదిరిగా కెరీర్‌లో 200వ వన్డే ఆడిన కెప్టెన్ మిథాలీకి కూడా చేదు జ్ఞాపకమే మిగిలింది.

హామిల్టన్ :

అదే వేదిక.. అదే ఫలితం.. రోజు మారింది కానీ హామిల్టన్‌లో ఇండియా రాత మారలేదు. గురువారం ఇండియా పురుషుల జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోతే, శుక్రవారం మహిళల జట్టు కూడా అదే ఫలితాన్ని రిపీట్ చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగిన మూడో వన్డేలో కివీస్ ఎనిమిది వికెట్ల తేడాతో ఇండియాపై ఘన విజయం సాధించింది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కివీస్ జట్టు ఇండియా ఆధిక్యాన్ని 2-1కి తగ్గించి పరువు దక్కించుకుంది. కివీస్ బౌలర్లు అనా పీటర్సన్(4/28), తహుహు(3/26) ధాటికి టీమిండియా 44 ఓవర్లలో 149 రన్స్‌కే ఆలౌటైంది. దీప్తి శర్మ(90 బంతుల్లో 4 ఫోర్లతో52) హాఫ్ సెంచరీతో జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. అనంతరం సాటర్త్‌వైట్ (74 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 66 నాటౌట్), సుజీ బేట్స్ (64 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 57) హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో కివీస్ మహిళలు 29.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 153 రన్స్ చేసి లక్ష్యాన్ని సునాయసంగా ఛేదించారు. విమెన్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న కివీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ కోల్పోయినా.. ఈ పోరులో నెగ్గి కీలక పాయింట్‌ను ఖాతాలో వేసుకుంది. నాలుగు వికెట్లు తీసిన కివీస్ స్పిన్నర్ అనా పీటర్సన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా.. తొలి వన్డేలో 105, రెండో వన్డేలో 90 రన్స్ చేసిన మంధాన ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైంది.

- మూడో వన్డేలో మిథాలీసేన ఓటమి
- 8 వికెట్లతో కివీస్ విక్టరీ

బ్యాటింగ్ వైఫల్యం..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన మిథాలీ సేన కివీస్ బౌలర్లు పీటర్సన్, తహుహు దెబ్బకు పెవిలియన్‌కు క్యూ కట్టింది. దీప్తి శర్మ మినహా మిగిలిన వారెవరూ క్రీజులో నిలబడలేకపోయారు. దీప్తిశర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్(24) నాలుగో వికెట్‌కు జోడించిన 48 రన్స్ భాగస్వామ్యం తప్ప చెప్పుకోదగిన అంశమే లేదు. 14 ఓవర్లు ముగిసే సరికి ఇండియా 39/3 పై నిలిచింది. ఈ దశలో దీప్తి, హర్మన్ ప్రీత్ నాలుగో వికెట్‌కు 48 రన్స్ జోడించారు. హర్మన్‌ను ఔట్ చేసి పీటర్సన్ ఈ జోడీని వీడదీసింది. ఆ తర్వాత దీప్తికి సహకారమే కరువైంది. హేమలత(13), జులన్ గోస్వామి(12 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు ఆ తర్వాత ఛేజింగ్‌లో కొత్త పార్ట్‌నర్ లారెన్ డౌన్(10)తో కలిసి సుజీ బేట్స్ కివీస్ ఇన్నింగ్స్‌ను ధాటిగా ప్రారంభించింది. తొలి వికెట్‌కు 22 రన్స్ జోడించిన తర్వాత డౌన్ రనౌట్ అయ్యింది. సాటర్త్‌వైట్‌తో కలిసి బేట్స్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి రెండో వికెట్‌కు 84 రన్స్ జోడించింది. ఈ క్రమంలో బేట్స్, సాటర్త్‌వైట్ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. జట్టు స్కోరు 106 వద్ద పూనమ్ బౌలింగ్‌లో బేట్స్ బౌల్డ్ అయ్యింది. ఆ తర్వాత డివైన్(17 నాటౌట్)తో కలిసి సాటర్త్‌వైట్ మిగతా పని పూర్తి చేసింది.



స్కోరు బోర్డు

ఇండియా: రోడ్రిగ్స్(సి)కెర్(బి)తహుహు 12, మంధాన(సి)డివైన్(బి) పీటర్సన్ 1, దీప్తి (సి)పెర్కిన్స్(బి)పీటర్సన్ 52, మిథాలీ (సి)పీటర్సన్(బి)కాస్పిరిక్ 9, హర్మన్ (బి)పీటర్సన్ 24, హేమలత (సి అండ్ బి) కెర్ 13, తానియా (ఎల్బీ) కెర్ 0, శిఖా (సి)డివైన్(బి)పీటర్సన్ 8, జులన్(నాటౌట్) 12, బిస్త్(ఎల్బీ) తహుహు 3, పూనమ్(సి)బెర్నాండెజ్ (బి)తహుహు 1, ఎక్స్‌ట్రాలు :14, **మొత్తం: 44 ఓవర్లలో 149 ఆలౌట్; వికెట్ల పతనం :-** 1-12, 2-13, 3-39, 4-87, 5-117, 6-117, 7-129, 8-138, 9-146, 10-149. **బౌలింగ్:** తహుహు 9-1-26-3, పీటర్సన్ 10-1-28-4, డివైన్ 3-0-8-0, హడల్స్టన్ 7-0-23-0, కాస్పిరిక్ 5-0-18-1, కెర్ 10-1-43-2. **న్యూజిలాండ్:** బేట్స్ (బి)పూనమ్ 57, డౌన్ (రనౌట్) 10, సాటర్త్‌వైట్ (నాటౌట్) 66, డివైన్(నాటౌట్) 17, ఎక్స్‌ట్రాలు 3, మొత్తం: 29.2 ఓవర్లలో 153/2. వికెట్ల పతనం : 1-22, 2-106, **బౌలింగ్:** జులన్ 8-0-26-0, ఏక్తా 5-0-29-0, శిఖా 5-0-24-0, దీప్తి 4.2-0-19-0, పూనమ్ 5-1-31-1, హేమలత 2-0-22-0.



మిథాలీ@ 200

హామిల్టన్: 1999 జనవరిలో మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన టీమిండియా కెప్టెన్ మిథాలీ రాజ్ శుక్రవారం తన కెరీర్‌లో 200వ వన్డే ఆడింది. దీంతో అత్యధిక వన్డేలాడిన మహిళా క్రికెటర్‌గాను నిలిచింది. అయితే 200 అనేది తనకు ఓ నంబర్ మాత్రమేనని 36 ఏళ్ల మిథాలీ అంటోంది. 16 ఏళ్ల వయసులో టీమిండియా జెర్సీ ధరించిన మిథాలీ వన్డేలో 6622 రన్స్ చేసి ఓవరాల్ టాప్‌స్కోరర్‌గా కూడా ఉంది. 200వ వన్డే ఆడిన సందర్భంగా మిథాలీ మాట్లాడుతూ'' 200 అనేది నా దృష్టిలో ఒక సంఖ్య మాత్రమే. కానీ ఇంత దూరం రావడం చాలా ఆనందంగా ఉంది. 20 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ప్రపంచ వ్యాప్తంగా మహిళల క్రికెట్ సాధించిన ప్రగతిని చూశా. ఇంటర్నేషనల్ విమెన్స్ క్రికెట్ కౌన్సిల్ నుంచి ఐసీసీ పరిధిలోకి వచ్చిన తర్వాత మహిళాక్రికెట్ వేగంగా అభివృద్ధి చెందింది' అని వివరించింది.

బర్న్స్, హెడ్ సెంచరీలు

కాన్‌బెర్రా: జో బర్న్స్ (172 బ్యాటింగ్), ట్రావిస్ హెడ్ (161) భారీ సెంచరీలతో అదరగొట్టడంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. వీరిద్దరి జోరుతో శుక్రవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 4 వికెట్లు కోల్పోయి 384 రన్స్ చేసింది. బర్న్స్‌కు తోడు కుర్టిస్ ప్యాటర్‌సన్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. లంక బౌలర్లలో ఫెర్నాండోకు 3 వికెట్లు దక్కాయి.

తొలి రోజు ఇటలీదే పైచేయి

కోల్‌కతా:

డేవిస్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఇండియాకు ఇటలీ ఊహించని షాకిచ్చింది. గ్రాస్‌కోర్ట్, హోంగ్రౌండ్ అడ్వాంటేజ్‌తో గెలుద్దామనుకున్న సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఇండియా ఓడిపోయి 0-2తో వెనుకబడింది. శనివారం జరిగే డబుల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌ల్లో గెలిస్తే తప్ప ఇండియా ఎలిమినేషన్ గండం నుంచి బయటపడే అవకాశం లేదు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి రోజు శనివారం జరిగిన మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో ఇటలీ స్టార్ ప్లేయర్ సెప్పి 6-4, 6-2 స్కోరుతో ఇండియా ప్లేయర్ రామ్‌కుమార్ రామ్‌నాథన్‌ను ఓడించాడు. రెండో సింగిల్స్ మ్యాచ్‌లో తొలి సారి డేవిస్ కప్ ఆడుతున్న మటారో బెరెట్టిని 6-4, 6-3 స్కోరుతో ఇండియా నంబర్ వన్ ప్రజ్నేశ్ ను ఓడించి ఇటలీ ఆధిక్యతను 2-0కు పెంచాడు.

- డేవిస్‌కప్ క్వాలిఫయింగ్ సింగిల్స్‌లో షాక్
- 2–0 తో ఇటలీ ముందంజ
- డబుల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌ల్లో గెలుపు తప్పనిసరి



భార్య అనుష్క తో కలిసి హాలీడే లో ఉన్న టీమిండియా కెప్టెన్ కోహ్లీ శుక్రవారం ఈ ఫొటోను ట్వీట్ చేసి అభిమానులను సర్‌ప్రైజ్ చేశాడు. అయితే హాలీడేకి ఎక్కడికి వెళ్లారన్న విషయాన్ని మాత్రం విరుష్క జోడి ఇంకా సస్పెన్స్‌గానే ఉంచింది. మరోవైపు విదేశీ టూర్లలో భాగస్వాములు వెంట ఉంటే ఇంకా ఉత్సాహంగా ఆడగలమని పట్టుబట్టిన కోహ్లీ తన పంతం నెగ్గించుకున్నా... ఈ నిర్ణయంతో బీసీసీఐకి కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. సుదీర్ఘ పర్యటనల్లో టీమ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు, సపోర్టింగ్ స్టాఫ్‌తో కలిసి మొత్తం సంఖ్య అమాంతం పెరిగిపోతోంది. దీని వల్ల సౌకర్యాలు కల్పించే విషయంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీసీసీఐ అధికారులు వాపోతున్నారు.



వాలీబాల్ లీగొచ్చింది

కొచ్చి: నేటి నుంచి ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) స్టార్ట్ అవుతోంది. గ్రామీణ స్థాయిలో అందరికి పరిచయమున్న క్రీడే అయినా... లైటింగ్‌లు, కామెంటరీలతో మరో రేంజ్‌లో వాలీబాల్ దర్శనమివ్వనుంది. కొచ్చి బ్లూ స్పైకర్స్, యు ముంబా వాలీ జట్ల మధ్య ఇక్కడి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌తో సీజన్‌కు తెరలేవనుంది. పీవీఎల్ తొలి సీజన్‌లో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించే ఈ టోర్నీలో ప్రతీ జట్టు మిగతా ఐదు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. బెస్టాఫ్-5 సెట్‌లుగా టోర్నీ సాగుతుంది. ప్రతి సెట్‌లో 15 పాయింట్లు ఉంటాయి. విజేత జట్టుకు 2 పాయింట్లు లభిస్తాయి. మూడు సెట్‌లు ముగిసిన అనంతరం కూడా విన్నర్స్ కోరిక ప్రకారం మ్యాచ్ కొనసాగించొచ్చు. 5-0తో గెలిచిన టీమ్‌కు 3 పాయింట్లు దక్కుతాయి. .20 రోజుల పాటు వినోదం పంచే తొలి సీజన్ ఈ నెల 22న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. విజేతకు 50 లక్షలు, రన్నరప్‌కు 20 లక్షల ప్రైజ్‌మనీ దక్కుతుంది.





ఈవీఎంలు వద్దే వద్దు

- 4న ఈసీతో ప్రతిపక్షాల భేటీ
- బ్యాలెట్ కు వెళ్లేది లేదన్న ఈసీ

న్యూఢిల్లీ : లోక్ సభ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం) ఉపయోగించే అంశం పై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తో ఈనెల 4న సమావేశం కావాలని బీజేపీయేతర ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఈవీఎంల అంశం పై అన్ని ప్రతిపక్షాలతో చర్చించినట్లు కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ చెప్పారు. ఈవీఎంలు ఉపయోగించడంపై తమకున్న అభ్యంతరాలను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు.అంతకుముందు ఈవీఎంల అంశం పై ఒక సంయుక్త కార్యాచరణ రూపొందించడానికి కాంగ్రెస్ పిలుపుమేరకు బీజేపీయేతర ప్రతిపక్షాలు శుక్రవారం ఢిల్లీలోని కాన్ స్టిట్యూషన్ క్లబ్ లో సమావేశమయ్యాయి. ప్రపంచంలో కేవలం కొన్ని దేశాలు మాత్రమే ఈవీఎంలు ఉపయోగిస్తున్నాయని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. 'సేవ్ ది నేషన్, సేవ్ ది డెమోక్రసీ' పేరుతో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ, సీనియర్ కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, లోక్ తాంత్రిక్ జనతాదళ్ చీఫ్ శరద్ యాదవ్, డెరెక్ ఒబెరాయ్ (తృణమూల్ కాంగ్రెస్), రాం గోపాల్ యాదవ్ (ఎస్పీ), మహమ్మద్ సలీం (సీపీఎం), డి.రాజా (సీపీఐ), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), సతీశ్ చంద్ర మిశ్రా (బీఎస్పీ), కనిమొళి (డీఎంకే), ప్రొఫెసర్ కోదండరాం (టీజెఎస్) తదితరులు హాజరయ్యారు.

ఈవీఎంలకే జై కొట్టిన ఎన్నికల సంఘం

మరోవైపు బ్యాలెట్ పత్రాలకు వెళ్లేది లేదని ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఈవీఎంలనే ఉపయోగిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా స్పష్టం చేశారు. రెండు దశాబ్దాల నుంచి దేశంలో ఈవీఎంలను వాడుతున్నారన్నారు. ఈవీఎంలకు అనుసంధానంగా వీవీ ప్యాట్ యంత్రాలను కూడా లోక్ సభ ఎన్నికల్లో ఉపయోగిస్తామన్నారు.దీంతో ఓటరు తన ఓటు ఎవరికి పడిందో అక్కడికక్కడే తెలుసుకోవచ్చునన్నారు. ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా ఈవీఎంలను తయారు చేసినట్లు సునీల్ అరోరా చెప్పారు. జనవరి 19న కోల్ కతాలో జరిగిన ప్రతిపక్షాల బహిరంగ సభలో ఈవీఎంలను 'చోర్ మెషీన్లు' గా పేర్కొన్నారు. దీంతో ఈ యంత్రాల వాడకం పై వివాదం రాజుకుంది. ప్రతిపక్షాలన్నీ ఈవీఎంలకు వ్యతిరేకంగా గళమెత్తాయి.

బడ్జెట్‌పై కామెంట్స్

ఇది పేదలు, రైతులు, కార్మికులు, సామాన్యుల బడ్జెట్.
- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

ఇబ్బందుల్లో ఉన్న రైతులకు మోడీ ప్రభుత్వం బొంబాయి మిఠాయి ఇచ్చింది.
- కర్నాటక సీఎం కుమారస్వామి

మధ్యంతర బడ్జెట్ మోడీ ప్రభుత్వం చివరి గిమ్మిక్. ఢిల్లీ ప్రజలకు నిరాశే మిగిలింది.
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

పూర్తిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ బడ్జెట్ తెచ్చారు. ఉద్యోగుల సమస్య సీపీఎస్. దాని రద్దు ప్రస్తావనే లేదు.
- టీఎన్జీవో ప్రెసిడెంట్ కారం రవీందర్ రెడ్డి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల ముందు చెబుతున్న పార్టీలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వాగ్దానాలను మరుస్తున్నాయి.
- టీజీవో ప్రెసిడెంట్ మమత

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఐటీ మినహాయింపు ఇచ్చారు. త్వరలో ఉద్యోగులకు పీఆర్సీ రానుంది. ఆ తర్వాత మినహాయింపు పరిధిలో ఎవరూ రారు.
- టీఈఏ జనరల్ సెక్రటరీ పద్మాచారి

ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేదు. రూ.5 లక్షలు దాటితే పన్ను కట్టాల్సిందే.
- టీఎన్ఈ ప్రెసిడెంట్, మాధవరం నరేందర్ రావు

విద్యార్థులకు సాయం చేయండి

అమెరికా కాన్సులేట్‌ను కోరిన కేంద్రం

న్యూ ఢిల్లీ: అమెరికాలో నకిలీ పత్రాలతో అడ్మిషన్లు పొంది అరెస్ట్ అయిన ఇండియన్ స్టూడెంట్లకు సాయం అందించాల్సిందిగా అమెరికా కాన్సులేట్ ను కోరినట్లు భారత విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. విద్యార్థులను బాధితులుగా పరిగణించాలని సూచించినట్లు విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీశ్ కుమార్ శుక్రవారం చెప్పారు. భారతీయ విద్యార్థులకు సాయం అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. "మనవాళ్లు అరెస్ట్ అయ్యారన్న విషయం తెలిసిన వెంటనే వాషింగ్టన్‌లోని ఇండియన్‌మిషన్‌తో పాటు ఇండియన్ కాన్సులేట్ ఇక్కడి స్టేట్ డిపార్ట్ మెంట్ ను సంప్రదించింది. విద్యార్థుల వివరాలు, నిర్బంధించిన ప్రాంతం తదితర సమాచారం ఇవ్వాల్సిందిగా అధికారులను కోరాం. ఈ వ్యవహారంలో మోసాలకు పాల్పడ్డ దళారీలను, విద్యార్థులను ఒకే కోవలో చూడొద్దని, కాన్సులర్ యాక్సెస్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. దీనిపై యూఎస్ అధికారులు పాజిటివ్‌గా స్పందిస్తారని భావిస్తున్నాం" అని రవీశ్ కుమార్ అన్నారు. అమెరికాలోని ఇండియన్ అసోసియేషన్లతో కలిసి విద్యార్థులకు అవసరమైన సాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు.



తెలుగు విద్యార్థులకు సాయపడండి

అమెరికన్ కాన్సులేట్ జనరల్‌కు కేటీఆర్ వినతి

హైదరాబాద్, వెలుగు: అమెరికాలో చిక్కుకుపోయిన తెలుగు విద్యార్థులకు సాయం చేయాలని అమెరికా కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డాను టీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. శుక్రవారం ప్రగతి భవన్ లో ఆమె కేటీఆర్‌ను కలిశారు. ఈ విషయాన్ని ఆమె ట్విట్టర్‌లో వెల్లడించారు. తన బెస్ట్ ఫ్రెండ్‌ను కలవడం సంతోషంగా ఉందన్నారు. వివిధ రంగాల్లో ప్రస్తుతం, భవిష్యత్తులో అమెరికా-తెలంగాణ మధ్య సహకారంపై చర్చించామన్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి కేటీఆర్ అర్హుడని కొనియాడారు. ఆమె ట్వీట్ కు బదులిచ్చిన కేటీఆర్ .. ఆమెతో భేటీ అవడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. భేటీలో అమెరికా-భారత్ సంబంధాలు, తెలంగాణ అంశాలపై చర్చించామన్నారు. అమెరికాలోని తెలుగు విద్యార్థుల పరిస్థితిపై చర్చించామని, తమ అభ్యర్థనను అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరామని చెప్పారు.

సీపీటీ కావాలంటే క్లాసులకెళ్లాలి

టైం అయిపోతే వెళ్లిపొండి.. మళ్లీ రండి ఇమిగ్రేషన్ నిపుణులు జనేతా కంచర్ల

హైదరాబాద్, వెలుగు: సీపీటీ (కరికులర్ ప్రాక్టికల్ ట్రైనింగ్) చేయాలనుకునే వారు కచ్చితంగా క్లాసులకు హాజరు కావాలని అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు, జనేతా ఇమిగ్రేషన్ లా నిర్వాహకురాలు కంచర్ల జనేతా అన్నారు. క్లాసులకు వెళ్లకుండా ఆన్ లైన్‌లో సీ పీటీ చేద్దామంటే కుదరదని, ఉద్యోగం చేసుకోవడానికి అనుమతి లేదని అన్నారు. ఫార్మింగ్టన్ యూనివర్సిటీ ఉదంతం నేపథ్యంలో ఆమె విద్యార్థులకు కొన్ని సలహాలిచ్చారు. ఇమిగ్రేషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేకపోతే కష్టాలు తప్పవని చెప్పారు. ఆగస్ట్ 9 మెమో (ఎఫ్ 1 వీసాలపై వచ్చి గడువు తీరాక కూడా ఉంటున్న వారి విషయంలో తీసుకొచ్చిన మెమో) ప్రకారం 180వ రోజు (వీసా గడువు దాటాక 180 రోజులుండొచ్చు. ఆ లోపు వీసాను పునరుద్ధరించుకోవాలి. లేదంటే ఆ 180 రోజులకు ఒక్కరోజు దాటినా అక్రమంగా ఉంటున్నట్టే లెక్క) గురించి పక్కాగా తెలుసుకోవాలని సూచించారు. టైం అయిపోయాక కచ్చితంగా వెళ్లిపోవాలని, కావాలంటే వీసాను పునరుద్ధరించుకుని మళ్లీ రావొచ్చని చెప్పారు. ఫార్మింగ్టన్ యూనివర్సిటీ లాంటి ఘటనలు ఎదురైనప్పుడు నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు. తమనూ www.janethalaw.com లో కావాల్సిన సాయం అడగొచ్చన్నారు. లేదా janetha@janethalaw.comకు ఈ మెయిల్ చేయొచ్చని, 7038806409 నంబర్‌లో సంప్రదించొచ్చని ఆమె చెప్పారు.

'రైతుబంధు'కు కాపీ

'పీఎం కిసాన్' పథకంపై కేటీఆర్ వ్యాఖ్య



- అయినా ఎన్డీయేకి ఓట్లు రాల్చదు
- రైతు బంధుతోనే లాభమెక్కువ
- కేంద్ర పథకాన్ని స్వాగతిస్తున్నాం: కేటీఆర్

హైదరాబాద్, వెలుగు: కేంద్రం ప్రకటించిన 'పీఎంకిసాన్' పథకం రాష్ట్రంలో అమలవుతున్న 'రైతు బంధు' పథకానికి కాపీ అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ పథకాన్ని కొన్ని మార్పులతో మోడీ సర్కారు కాపీ కొట్టిందని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు తెచ్చిన ఈ పథకం బీజేపీకి, ఎన్డీయేకు ఓట్లు రాల్చదన్నారు. ఏదేమైనా.. రైతు బంధు పథకం దేశంలోని రైతులందరికీ మేలు చేయడం శుభపరిణామమని, స్వాగతిస్తున్నట్లు ఆయన ట్విటర్‌లో, పీటీఐ వార్తా సంస్థతో పేర్కొన్నారు. "తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు స్కీమ్ ను ఎన్డీఏ ప్రభుత్వం పేరు మార్చి బడ్జెట్ లో ప్రవేశపెట్టింది. సీఎం కేసీఆర్ మానస పుత్రిక రైతు బంధుతో దేశ ప్రజలకు సహాయం అందటం హర్షణీయమన్నారు. అనుకరణకు మించిన పొగడ్త మరొకటి లేదు. జై కిసాన్" అని ట్వీట్ చేశారు. "రైతు బంధు పథకాన్ని కేంద్రం కొంచెం మార్చి కిసాన్ సమ్మాన్ నిధిగా తెచ్చింది. 12కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందంటే సంతోషమే. కానీ.. కేంద్ర పథకం కింద ఒక రైతుకు ఏడాదికి అందేది రూ. 6 వేలు మాత్రమే. అది కూడా ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకే. పైగా మూడు వాయిదాల్లో రూ. 2 వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేస్తారు" అని కేటీఆర్ అన్నారు. "కేంద్ర పథకాన్ని స్వాగతించాల్సిందే. అయితే రైతులు, దేశ ప్రజలకు రాజకీయాలు, ఆర్థిక వ్యవహారాలు పూర్తిగా తెలుసు. ఎవరు ఎందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో వారు అర్థం చేసుకోగలరు" అని చురకలంటించారు. ఈ పథకాన్ని మోడీసాబ్ గత నాలుగేళ్లలో ఎప్పుడైనా ప్రకటిస్తే బాగుండేదని, ఇప్పుడు ప్రకటించడం వెనక కారణమేంటో ప్రజలకు తెలుసని కేటీఆర్ అన్నారు.

కేసీఆర్‌ది సొంత ఆలోచన.. మోడీది కాపీ పేస్ట్: అసదుద్దీన్

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు పథకాన్ని ప్రధాని మోడీ కాపీ, పేస్ట్ చేశారని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేసీఆర్‌కు ఉన్న సొంత ఆలోచన, దూర దృష్టి ప్రధానికి లేదని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. టీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఆయన రీ ట్వీట్ చేశారు. దేశానికి కేసీఆర్ నాయకత్వం వహించే రోజు ఆసన్నమైందన్నారు.



ఎన్నికల బడ్జెటే: కవిత

రాష్ట్రంలోని రైతు బంధు పథకాన్ని కేంద్రం కాపీ కొట్టిందని, ఆ కాపీని కూడా సరిగా చేయలేకపోయిందని ఎంపీ కవిత అన్నారు. పన్ను సంస్కరణలు మధ్య తరగతి వారికి, ఉద్యోగులకు కాస్త ఊరట నిస్తాయని, ఇది కచ్చితంగా ఎన్నికల బడ్జెటేనని ట్విటర్‌లో పేర్కొన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలులో కేంద్రం విఫలమైందని, ప్రభుత్వ ఘనతలు చెప్పిన ఆర్థిక మంత్రి వైఫల్యాలను ఎందుకు ప్రస్తావించలేదని ఆమె ప్రశ్నించారు.





కుప్పకూలిన శిక్షణ విమానం

ఇద్దరు పైలెట్లు మృతి

బెంగళూరు: భారత వాయుసేనకు చెందిన శిక్షణ విమానం మిరాజ్ 2000 శుక్రవారం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలెట్లు చనిపోయారు. విమానం కూలిపోయిన వెంటనే మంటలు చెలరేగటంతో పైలెట్లు తప్పించుకోలేకపోయారని అధికారు లు చెప్పారు. మంటల్లో చిక్కుకున్న పైలెట్ ఒకరు అక్కడికక్కడే చనిపోగా, మరొకరు చికిత్స పొందుతూ చనిపోయారన్నారు . ఘటనపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైసన్‌పోలో గ్రౌండ్ అప్పగించండి

రక్షణ మంత్రికి టీఆర్ఎస్ ఎంపీల వినతి

హైదరాబాద్, వెలుగు: సచివాలయం నిర్మాణానికి బైసన్ పోలో గ్రౌండ్ ను తెలంగాణకు అప్పగించాలని టీఆర్ఎస్ ఎంపీలు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. పార్టీ పార్లమెంటరీ నేత జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు శుక్రవారం మంత్రిని పార్లమెంటు సచివాలయంలో కలుసుకుని వినతి పత్రం అందజేశారు. రక్షణ రంగ స్థలానికి బదులుగా భూములివ్వడానికి రాష్ట్ర సర్కారు సిద్ధంగా ఉందని చెప్పారు. రక్షణ మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు బి. వినోద్ కుమార్, సంతోష్ కుమార్, బీ.బీ.పాటిల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్ ఉన్నారు.

గంటలో వెయ్యి మందికి బీపీ టెస్ట్

గిన్నిస్ కెక్కిన 'గాంధీ' డాక్టర్ల ఫీట్

హైదరాబాద్, వెలుగు: గాంధీ ఆస్పత్రి డాక్టర్లు గంటలో వెయ్యిమందికి పైగా రోగులకు బీపీని విజయవంతంగా పరీక్షించారు. డాక్టర్ల అరుదైన ఫీట్‌ను గుర్తించిన గిన్నిస్ ప్రతినిధులు గురువారం గాంధీ ఆస్పత్రి పేరి ట రికార్డు సర్టిఫికెట్‌ను ఇచ్చారు. గురువారం ఈ సర్టిఫికెట్ అందుకున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. వైద్య రంగానికి సంబంధించి గిన్నిస్‌బుక్ ఏటా ఓ ప్రత్యేక అంశం పై ఈవెంట్ ఏర్పాటు చేస్తుంది. ఇందులో వివిధ ఆస్పత్రులు, నిపుణుల మధ్య పోటీ నిర్వహించి గెలుపొందిన వాటికి గుర్తింపు పత్రం అందజేస్తుంది. గత ఏడాది సెప్టెంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఒక్క గంటలో ఎక్కువ మందికి బీపీ టెస్టు నిర్వహించే కాంటెస్ట్ ఏర్పాటు చేసింది. ఇందులో మన దేశంలో 37 ఆస్పత్రులను ఎంపిక చేసింది. ఈ 37 ఆస్పత్రుల్లో గాంధీ ఆస్పత్రి చోటు దక్కించుకొని మొదటి స్థానంలో నిలిచింది.

ఇదో ఓట్ల బడ్జెట్

మధ్యంతర బడ్జెట్ కేవలం ఓట్ల కేసమే తెచ్చినట్టుంది. 3 నెలల ఖర్చుల కోసం తెచ్చిన ఓటాన్ బడ్జెట్‌లా లేదు.
- టీఆర్ఎస్ ఎంపీ వినోద్

రైతు బంధును కేంద్రం ఆచరించడం సంతోషం. కేసీఆర్ దేశానికే రోల్ మోడల్.
- టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి



బడ్జెట్‌పై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: ఇలా బడ్జెట్ పెట్టారో లేదో.. అలా సుప్రీం కోర్టులో పిటిషన్ పడిపోయింది. మధ్యంతర బడ్జెట్‌కు రాజ్యాంగంలో ఎలాంటి నియమ, నిబంధనలు లేవని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ మనోహర్ లాల్ శర్మ అనే లాయర్ పిటిషన్ వేశారు. బడ్జెట్‌ను రద్దు చేయాల్సిందిగా కోర్టును కోరారు. రాజ్యాంగంలో కేవలం పూర్తి బడ్జెట్, వోటాన్ అకౌంట్‌కు మాత్రమే నియమాలున్నాయన్నారు. కాగా, గతంలో ఆర్‌బీఐకి సంబంధించిన ఓ విషయంలో అరుణ్ జైట్లీపైనా ఆయన ప్రజా హిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఆ కేసులో మనోహర్ లాల్ శర్మకు ₹50 వేల ఫైన్ వేసింది కోర్టు.

నేటి నుంచి మళ్లీ నుమాయిష్

హైదరాబాద్, వెలుగు: నాంపల్లి ఎగ్జిబిషన్ శనివారం నుంచి మళ్లీ ప్రారంభిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి రంగారెడ్డి చెప్పారు. నష్టపోయిన స్టాల్ నిర్వాహకులకు ఇప్పటివరకు రూ.70 లక్షల ఆర్థిక సాయం అందించామని, మంటల్లో ఆహుతైన 300 స్టాళ్లను అదే స్థానంలో మళ్లీ నిర్మించేందుకు సొసైటీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రమాద ఘటనపై కమిటీ వేశామని, రిపోర్ట్ ఆధారంగా బాధితులకు పరిహారం చెల్లిస్తామని అన్నారు. ఎగ్జిబిషన్‌ను అదనంగా నాలుగు రోజులు పొడిగిస్తున్నట్లు చెప్పారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.